


epaper. aksharakalam. com

# అక్షరకలం

తెలుగు దినపత్రిక

aksharakalam@gmail.com

సంపుటి : 19 సంచిక : 45 | 25-04-2026 శనివారం | ఎడిటర్ : పిట్టల రామకృష్ణ | నల్లగొండ | Published from Nalgonda, circulated throughout Telangana state | పేజీలు : 12 వెల : రూ.1.00



## ఆమ్‌ఆద్మీ పార్టీకి భారీ షాక్

ఆమ్‌ఆద్మీ పార్టీకి భారీ షాక్ తగిలింది. ఆ పార్టీ రాజ్యసభ సభ్యుల్లో ముగ్గురు పార్టీకి గుడ్‌బై చెప్పి.. బీజేపీలో చేరబోతున్నారు. వీరిలో ప్రస్తుతం రాజ్యసభ ఆప్ డిప్యూటీ లీడర్ అశోక్ కుమార్ మిట్టల్ కూడా ఉన్నారు. ఇటీవలే రాఘవ్ చద్దాను రాజ్యసభ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పదవి నుంచి తొలగించిన ఆప్.. ఆయన స్థానంలో అశోక్ మిట్టల్‌ను నియమించింది. కానీ, ఇప్పుడు ఆయన కూడా పార్టీని వీడి బీజేపీలో చేరబోతున్నారు.

2

# బెంగాల్‌లో జగిల్ రాజ్ ఖేల్ ఖతం

- భారీ ఓటింగ్ బిజెపి అధికారానికి సూచిక
- టిఎంసి పూర్తి మహిళా వ్యతిరేక పార్టీ
- ప్రచారంలో ప్రధాని మోడీ విమర్శలు

వివరాలు 2లో..



పశ్చిమ బెంగాల్‌లో నమోదైన భారీ పోలింగ్.. రాష్ట్రంలో మమత ఆధ్వర్యంలోని టీఎంసీ జంగిల్ రాజ్ పాలనకు అంతం అని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. బెంగాల్‌లోని డుమ్ డుమ్‌లో శుక్రవారం జరిగిన బీజేపీ ప్రచార సభలో మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడి టీఎంసీ ప్రభుత్వంపై కీలక వ్యాఖ్యలు చేశారు. పశ్చిమ బెంగాల్‌లో గురువారం జరిగిన తొలి దశ ఓటింగ్‌లో భారీ స్థాయిలో పోలింగ్ నమోదైన సంగతి తెలిసిందే. ఈ అంశంపై కూడా మోదీ మాట్లాడారు. తొలి దశ ఎన్నికల్లో రికార్డ్ స్థాయిలో పోలింగ్ నమోదైందంటే అది టీఎంసీ మహా జంగిల్ రాజ్ ప్రభుత్వానికి అంతం మొదలైనట్లే. రాష్ట్రంలో బీజేపీ కచ్చితంగా అధికారంలోకి వస్తుంది.





వివరాలు 2లో..

## తెలంగాణలో మరో కొత్త పార్టీ

నేడు పార్టీపేరును ప్రకటించనున్న కవిత

కార్యకర్తల సమక్షంలో జెండా, ఎజెండా వెల్లడి

తెలంగాణ ప్రజా జాగృతి అంటూ ప్రచారం

తెలంగాణలో మరో కొత్త పార్టీ పురుడుపోసుకుంటుంది. శనివారం కవిత కొత్త పార్టీ ప్రకటించబోతున్నారు. పార్టీ పేరు ప్రకటన విడుదల కాబోతున్నది. శనివరాం ఉదయం 10 గంటలకు.. కవిత తన పార్టీ పేరును ప్రకటించబోతున్నారు. జెండా, ఎజెండా విడుదల చేయబోతున్నారు. తెలంగాణ రాజకీయాల్లో కీలక మలుపు కాబోతున్నది. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, కామ్రేడ్ పార్టీలకు ధీటుగా పోరాటానికి సిద్ధం అవుతున్న కవిత పార్టీ ప్రకటన ఎలా ఉండబోతుంది అనేది ఉత్కంఠ రేపుతోంది.



## శంకర్‌గౌడ్ మృతి అత్యంత బాధాకరం

### శవరాజకీయం చేస్తున్న బండి సంజయ్

### మండిపడ్డ అద్దంకి దయాకర్

ఆర్టీసీ కార్మికుడు శంకర్ గౌడ్ మృతి అత్యంత బాధాకరమని ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ అన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ శవ రాజకీయాలు చేస్తున్నారని దయాకర్ మండిపడ్డారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. శంకర్ మృతిని కేంద్ర మంత్రి బండి సంజయ్ రాజకీయం చేస్తున్న తీరు హేయం, సిగ్గుచేటు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

2

# ముత్తోజిపేటలో తీవ్ర ఉద్రిక్తత

శంకర్ గౌడ్ మృతదేహాన్ని డిపోకు తీసుకెళ్లకుండా అడ్డంకులు

పోలీసుల తీరుపై మండిపడ్డ ఆర్టీసీ కార్మికులు

డిపోకు తీసుకెళితే నష్టమేంటని బండి సంజయ్ ప్రశ్న

వరంగల్ జిల్లా నర్సంపేట మండలం ముత్తోజిపేటలో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఆత్మహత్య చేసుకున్న ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతదేహాన్ని డిపో వరకు తీసుకెళ్లేందుకు కార్మికులు యత్నించారు. నర్సంపేట డిపో వద్ద మృతదేహానికి నివాళులర్పిస్తామని చెప్పారు. అందుకు పోలీసులు అంగీకరించలేదు. మృతదేహాన్ని తీసుకెళ్లకుండా అడ్డుకున్నారు.



వార్త 2లో



## వందేమాతరం సాముహిక గీతాలపన

### మోడీని ఆహ్వానించేందుకు బిజెపి ఆఫీస్‌కు వెళ్లా

### మాజీ మంత్రి మల్లారెడ్డి కోడలు ప్రీతి రెడ్డి

గత కొంతకాలంగా మాజీ మంత్రి మల్లారెడ్డి బీజేపీలో చేరతారంటూ వస్తున్న వార్తలకు కోడలు ప్రీతి రెడ్డి చెక్ పెట్టారు. శుక్రవారం ఉదయం ప్రీతి రెడ్డి బీజేపీ కార్యాలయానికి వెళ్లారు.

వార్త 2లో



2లో..

## ఆర్టీసీ సమ్మెకు బలయిన శంకర్‌గౌడ్

### పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం

### చికిత్స పొందుతూ హైదరాబాద్‌లో మృతి

### సిఎం రేవంత్ సంతాపం, మంత్రి పొన్నంల సంతాపం

ఆర్టీసీ సమ్మెపై ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరసనగా పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డ నర్సంపేట డిపో ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి చెందారు. హైదరాబాద్ అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. అపోలో ఆస్పత్రిలో శంకర్ గౌడ్ మృతదేహానికి పోస్టుమార్టం పూర్తైంది.



## ఆర్టీసీ కార్మికులకు అఖిలపక్షం మద్దతు

తెలంగాణ ఆర్టీసీ కార్మికులు చేస్తున్న సమ్మె విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆర్టీసీ సమ్మెకు తమ పూర్తి మద్దతు ఉందని అన్నారు.


2



## శంకర్ గౌడ్ ఆత్మహత్య బాధాకరం

ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ ఆత్మహత్య బాధాకరమని కేంద్ర మంత్రి బండి సంజయ్‌అన్నారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ... 'ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే కార్మికుడి ఆత్మహత్య.. ఇది ప్రభుత్వ హత్య' అంటూ వ్యాఖ్యానించారు. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వం బెదిరిస్తోందని ఆరోపించారు. ఇంత పెద్ద సమ్మె జరిగితే.. ప్రభుత్వం పట్టించుకోవడం లేదంటూ మండిపడ్డారు.

2



## శంకర్ గౌడ్ మృతి విషాదకరం

వార్త 2లో

## కేదార్‌నాథ్‌కు భారీగా తరలి వస్తున్న భక్తులు

డెహ్రాడూన్, అక్షరకలం ప్రతినిధి

చార్‌ధామ్ యాత్రలో భాగంగా కేదార్‌నాథ్ ఆలయ ద్వారాలు తెరుచుకున్నాయి. గఢ్‌వాల్ హిమాలయాల పర్వత శ్రేణిలోని ఈ ఆలయానికి తొలి రోజే భక్తులు పోటెత్తారు. వేలాదిగా భక్తులు తరలి రావడంతో ఆలయ పరిసర ప్రాంతాలు జనసంద్రంగా మారాయి. ఒకానొక దశలో భక్తులను కట్టడి చేయడం ఆలయ సిబ్బందికి కష్టతరంగా మారింది. మరో వైపు స్వామి వారి దర్శనం కోసం ఏర్పాటు చేసిన క్యూలైన్లు భక్తులతో నిండిపోయాయి. ఈ సందర్భంగా భక్తులు నిబంధనలు అతిక్రమిస్తూ.. ఒక క్యూ లైన్ నుంచి మరో క్యూ లైన్‌లోకి చొరబడుతున్నారు. దాంతో వారి మధ్య ఘర్షణ, వాగ్వివాదం చోటు చేసుకుంది. అందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. దీనిపై నెటిజన్లు తమదైన శైలిలో స్పందిస్తున్నారు.





2లో..

## ఆర్టీసీ కార్మికులకు రేవంత్ తీరని ద్రోహం

# ఆమ్‌ఆద్మీ పార్టీకి భారీ షాక్

## బిజెపిలో చేరుతున్న రాఘవచద్దా తదితరులు

న్యూఢిల్లీ, అక్షరకలం ప్రతినిధి

ఆమ్‌ఆద్మీ పార్టీకి భారీ షాక్ తగిలింది. ఆ పార్టీ రాజ్యసభ సభ్యుల్లో ముగ్గురు పార్టీకి గుడ్‌బై చెప్పి.. బీజేపీలో చేరబోతున్నారు. వీరిలో ప్రస్తుతం రాజ్యసభ ఆప్ డిప్యూటీ లీడర్ అశోక్ కుమార్ మిట్టల్ కూడా ఉన్నారు. ఇటీవలే రాఘవ్ చద్దాను రాజ్యసభ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ పదవి నుంచి తొలగించిన ఆప్.. ఆయన స్థానంలో అశోక్ మిట్టల్‌ను నియమించింది. కానీ, ఇప్పుడు ఆయన కూడా పార్టీని వీడి బీజేపీలో చేరబోతున్నారు. ఈ విషయాన్ని ఆప్ రాజ్యసభ సభ్యుడు, ఆ పార్టీ బహిష్కృత నేత రాఘవ్ చద్దా వెల్లడించారు. శుక్రవారం రాఘవ్ చద్దా, అశోక్ కుమార్ మిట్టల్, సందీప్ పాఠక్ మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా తాము ఆమ్ ఆద్మీ పార్టీకి రాజీనామా చేసి, బీజేపీలో చేరబోతున్నట్లు వెల్లడించారు. రాజ్యసభలో మూడింట రెండొంతుల ఆప్ సభ్యులు కలిసి బీజేపీలో చేరబోతున్నట్లు ప్రకటించారు. అంటే రాజ్యాంగం ప్రకారం ఈ ముగ్గురూ కలిసి ఆమ్ ఆద్మీ పార్టీని బీజేపీలో విలీనం చేస్తారు. ఇలా ఒక సభలో ఒక పార్టీకి చెందిన మూడింట రెండు వంతుల మంది సభ్యులు.. అధికార లేదా వేరే ఏ పార్టీలోనైనా చేరవచ్చు. ఇలా చేరితే, పార్టీ ఫిరాయింపుల చట్టం వర్తించదు. దీంతో ఈ ముగ్గురి రాజ్యసభ సభ్యత్వానికి ఢోకా లేకపోవచ్చు. ఇక, రాఘవ్ చద్దా, అశోక్, సందీప్.. ముగ్గురూ 2022 నుంచి ఆప్ తరఫున రాజ్యసభలో సభ్యులుగా కొనసాగుతున్నారు. తాజా మీడియా సమావేశంలో రాఘవ్ చద్దా మాట్లాడుతూ 'ఆమ్ ఆద్మీ పార్టీ కోసం 15 ఏళ్లపాటు చెమట, రక్తం చిందించాను. ఇప్పుడు ఆ పార్టీ తన సిద్ధాంతాలు, విలువలు, నైతిక అంశాల నుంచి పూర్తిగా పక్కకు తప్పుకొంది. ఆమ్ ఆద్మీ పార్టీ తన స్వార్థ ప్రయోజనాల కోసం తప్ప దేశం కోసం, జాతి ప్రయోజనాల కోసం పని చేయడం లేదు. ఇది చాలా మంది ఎప్పటినుంచో చెబుతున్నారు. ఇప్పుడు నేను కూడా అదే అనుకుంటున్నా. నేను సరైన పార్టీలో లేనని భావిస్తున్నా. సరైన వ్యక్తిని.. తప్పుడు పార్టీలో ఉన్నా. అందుకే ఈ రోజే ఆమ్ ఆద్మీ పార్టీకి దూరంగా ఉంటున్నా. ప్రజల కోసం వెళ్తున్నా' అంటూ ప్రకటించారు. తమతోపాటు స్వాతి మాలివాల్, హర్భజన్ సింగ్, రాజిందర్ గుప్తా, విక్రమ్‌జిత్ సింగ్ సహ్నీ కూడా త్వరలో ఆప్‌ను వీడి బీజేపీలో చేరుతారు అంటూ రాఘవ్ వెల్లడించారు. అలాగే, తాను మోదీ, అమిత్ షా నాయకత్వంలో పని చేయబోతున్నట్లు వెల్లడించారు. తాజా సమాచారం ప్రకారం.. రాఘవ్ చద్దాకు కేంద్ర కేబినెట్‌లో మంత్రిగా చోటు దక్కే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

# బెంగాల్‌లో జగిల్ రాజ్ ఖేల్ ఖతం

## భారీ ఓటింగ్ బిజెపి అధికారానికి సూచిక

## టిఎంసి పూర్తి మహిళా వ్యతిరేక పార్టీ

## ప్రచారంలో ప్రధాని మోడీ విమర్శలు

కోల్‌కతా, అక్షరకలం ప్రతినిధి



పశ్చిమ బెంగాల్‌లో నమోదైన భారీ పోలింగ్.. రాష్ట్రంలో మమత ఆధ్వర్యంలోని టీఎంసీ జంగిల్ రాజ్ పాలనకు అంతం అని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. బెంగాల్‌లోని డుమ్ డుమ్‌లో శుక్రవారం జరిగిన బీజేపీ ప్రచార సభలో మోదీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడి టీఎంసీ ప్రభుత్వంపై కీలక వ్యాఖ్యలు చేశారు. పశ్చిమ బెంగాల్‌లో గురువారం జరిగిన తొలి దశ ఓటింగ్‌లో భారీ స్థాయిలో పోలింగ్ నమోదైన సంగతి తెలిసిందే. ఈ అంశంపై కూడా మోదీ మాట్లాడారు. తొలి దశ ఎన్నికల్లో రికార్డ్ స్థాయిలో పోలింగ్ నమోదైందంటే అది టీఎంసీ మహా జంగిల్ రాజ్ ప్రభుత్వానికి అంతం మొదలైనట్లే. రాష్ట్రంలో బీజేపీ కచ్చితంగా అధికారంలోకి వస్తుంది. బీజేపీకి అండగా నిలుస్తున్న మహిళా ఓటర్లకు ధన్యవాదాలు. గురువారం నాడు బీజేపీకి లభించిన మద్దతు పార్టీ విజయ శంఖారావం పూరించినట్లే. బెంగాల్‌లో ఎక్కడ ప్రజాస్వామ్యాన్ని తన నిరంకుశత్వంతో టీఎంసీ అంతం చేసిందో, అక్కడే, మొదటి దశలోనే ప్రజలు ప్రజాస్వామ్య దేవాలయాన్ని నిర్మించడం ప్రారంభించారు. బీజేపీ అధికారంలోకి రాగానే ఆయుష్మాన్ భారత్ యోజన పథకాన్ని వర్తింపజేస్తాం. అర్హులైన వారికి ఐదు లక్షల వైద్యం అందిస్తాం. ప్రభుత్వం ఏర్పడ్డ తొలి క్యాబినెట్ మీటింగ్‌లోనే దీనిపై నిర్ణయం తీసుకుంటాం. టీఎంసీ మహిళా వ్యతిరేక పార్టీ. మహిళలు అభివృద్ధి చెందాలని టీఎంసీ కోరుకోవడం లేదు. మహిళల భద్రతే బీజేపీ మొదటి ప్రాధాన్యం. బెంగాల్ ఆడబిడ్డలు అత్యాచారానికి గురై న్యాయం కావాలని కోరితే.. ఆడబిడ్డలు బయటకు రాకూడదని టీఎంసీ ప్రభుత్వం చెబుతోంది. మహిళలు కలలు కనడాన్ని టీఎంసీ అంగీకరించదని వ్యాఖ్యానించారు. ఆర్‌జీ కర్ ఆస్పత్రిలో హత్యాచారానికి గురైన బాధిత యువతి తల్లి రత్న దేవ్‌నాథ్‌ను ప్రధాని మోదీ కలిశారు. ఆమెను బీజేపీ ఈ ఎన్నికల్లో తన పార్టీ తరఫున పానిహటి నుంచి బరిలోకి దింపింది. ఈ అంశంపై మోదీ స్పందించారు. రత్న దేవ్‌నాథ్.. తన కూతురును కష్టపడి డాక్టర్ చేసింది. కానీ, టీఎంసీ ప్రభుత్వం ఆమె కూతురును తీసుకెళ్లింది. మేం ఆమె తల్లిని మా అభ్యర్థిగా నిలబెట్టాం అని మోదీ అన్నారు.

# శంకర్‌గౌడ్ మృతి అత్యంత బాధాకరం

## శవరాజకీయం చేస్తున్న బండి సంజయ్

## మండిపడ్డ అద్దంకి దయాకర్

హైదరాబాద అక్షరకలం ప్రతినిధి

ఆర్టీసీ కార్మికుడు శంకర్ గౌడ్ మృతి అత్యంత బాధాకరమని ప్రభుత్వ విప్ అద్దంకి దయాకర్ అన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ శవ రాజకీయాలు చేస్తున్నారని దయాకర్ మండిపడ్డారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. శంకర్ మృతిని కేంద్ర మంత్రి బండి సంజయ్ రాజకీయం చేస్తున్న తీరు హేయం, సిగ్గుచేటు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓ వైపు బీఆర్‌ఎస్ నాయకులు కార్మికులను రెచ్చగొడుతుంటే.. మరోవైపు బీజేపీ నాయకులు శవరాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. నర్సంపేటలో ఉద్రిక్తతలకు కారణం బండి సంజయ్ అని వ్యాఖ్యానించారు. కేంద్ర మంత్రి అన్న విషయాన్ని మర్చిపోయి బండి సంజయ్ కార్మికులను రెచ్చగొట్టేలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. గతంలో ఆర్టీసీ కార్మికులు సమ్మె చేస్తే బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎలా స్పందించిందో అందరికీ తెలుసన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ స్వయంగా శంకర్ గౌడ్ కుటుంబాన్ని కలిసి ఆదుకుంటామని హామీ ఇచ్చారన్నారు. శంకర్ గౌడ్ కుటుంబం పట్ల ప్రభుత్వం సానుభూతితో ఉందన్నారు. ఆర్టీసీ కార్మికులతో ప్రభుత్వం చర్చలు జరుపుతోందని, చనిపోయిన ఆర్టీసీ కార్మికుడి కుటుంబానికి అండగా ఉంటామని సర్కార్ ప్రకటించిందన్నారు. సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుంటే... బీజేపీ చిల్లర రాజకీయాలు చేస్తోందని ప్రభుత్వ విప్ మండిపడ్డారు. సీఎం, మంత్రివర్గం అంతా.. ఆర్టీసీ కార్మికులు తొందరపడవద్దని విజ్ఞప్తి చేశారన్నారు. సమస్య పరిష్కారానికి తాము ప్రయత్నిస్తుంటే.. బండి సంజయ్, బీఆర్‌ఎస్ నేతలు మాత్రం ఓట్లు వెతుక్కుంటున్నారని విమర్శించారు. దయచేసి ఆర్టీసీ కార్మికులు ఇలాంటి క్షుద్ర రాజకీయ పార్టీలను, నాయకులను నమ్మొద్దని.. కచ్చితంగా కార్మికులకు ప్రభుత్వం అండగా ఉంటుందని అద్దంకి దయాకర్ స్పష్టం చేశారు.

# ఆర్టీసీ కార్మికులకు అఖిలపక్షం మద్దతు

## పోరాటం చేయాలే తప్ప ప్రాణాలు తీసుకోవద్దు

## ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హితవు

కొత్తగూడెం, అక్షరకలం ప్రతినిధి

తెలంగాణ ఆర్టీసీ కార్మికులు చేస్తున్న సమ్మె విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆర్టీసీ సమ్మెకు తమ పూర్తి మద్దతు ఉందని అన్నారు. ఆర్టీసీ జాబ్ ఆధ్వర్యంలో మూడోరోజు ఉధృతంగా కొనసాగుతున్న సమ్మెలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొని మాట్లాడారు. కార్మికులు పట్టుదలతో తమ సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు పోరాడాలే కానీ ప్రాణాలు తీసుకోవద్దని కోరారు. అనంతరం మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు కార్మికుల ధర్నాను ఉద్దేశించి మాట్లాడారు. ఆర్టీసీ సమ్మెకు బీఆర్‌ఎస్ పార్టీ పూర్తిస్థాయిలో మద్దతునిస్తుందని, తానే ముందుండి సమ్మెకు నాయకత్వం వహిస్తానని తెలిపారు. కార్మికులు ఎలాంటి తొందరపాటు చర్యలకు పాల్పడవద్దని, శాంతియుతంగా సమ్మె నిర్వహించాలని ఎలాంటి పరిస్థితుల్లోనూ ప్రాణాలు తీసుకోవద్దని కోరారు. అనంతరం కొత్తగూడెం మేయర్ మూడు గణెశిష్, భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, సిపిఎం రాష్ట్ర నాయకుడు పోతినేని సుదర్శన్, జై భీమ్ రావు పార్టీ రాష్ట్ర నాయకుడు యెర్ర కామేష్, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ప్రజాపన్న నాయకులు మధు, సంజీవ్, సురేందర్, కొత్తగూడెం మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ కాపు సీతాలక్ష్మి, భారతీయ జనతా పార్టీ నాయకుల తో పాటు పలు పార్టీలకు కార్మిక సంఘాలకు చెందినవారు మాట్లాడుతూ తమ సంపూర్ణ మద్దతును ప్రకటించారు. ఆర్టీసీ జేఏసీ నాయకులు బి.ఎన్.రావు, నజీర్, భాస్కర్, సరస్వతి, రేణుక, రహంతుల్లా, సైదులు, శేషు, రాటి పాల్గొన్నారు. కాగా మృతిచెందిన ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్‌కు నివాళులర్పిస్తూ ఆయన చిత్రపటాన్ని ప్రదర్శించారు.

# శంకర్ గౌడ్ ఆత్మహత్య బాధాకరం

## ఇది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే

## కేంద్రమంత్రి బండి సంజయ్ వ్యాఖ్య

కరీంనగర్, అక్షరకలం ప్రతినిధి

ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ ఆత్మహత్య బాధాకరమని కేంద్ర మంత్రి బండి సంజయ్‌అన్నారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ... 'ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే కార్మికుడి ఆత్మహత్య.. ఇది ప్రభుత్వ హత్య' అంటూ వ్యాఖ్యానించారు. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వం బెదిరిస్తోందని ఆరోపించారు. ఇంత పెద్ద సమ్మె జరిగితే.. ప్రభుత్వం పట్టించుకోవడం లేదంటూ మండిపడ్డారు. గతంలో బీఆర్‌ఎస్ సర్కార్ చేసిన తప్పే.. కాంగ్రెస్ చేస్తోందని విమర్శించారు. గత ప్రభుత్వంలో కూడా ఆర్టీసీ కార్మికులు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. కాంగ్రెస్ మేనిఫెస్టో 28వ పేజీలో ఆర్టీసీని విలీనం చేస్తామని చెప్పారని గుర్తు చేశారు. రెండు పీఆర్‌సీలు చెల్లిస్తామని హామీ ఇచ్చారంటూ కాంగ్రెస్ మేనిఫెస్టోను కేంద్ర మంత్రి చదివి వినిపించారు. ఆర్టీసీ సమస్యలపై బీజేపీ పోరాడితే.. ఓటు కాంగ్రెస్‌కు వేశారని అన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేల జీతాల్లో కోత విధిస్తే ఎంత వస్తుంది. ఆ డబ్బులు బఠానీలు కొనుక్కోవడానికి కూడా సరిపోవు. ఢిల్లీకి పైసల మూటలు పంపడం ఆపితే కార్మికులకు డబ్బులు ఇవ్వొచ్చు' అంటూ సర్కార్‌కు కేంద్ర మంత్రి హితవుపలికారు. ఎన్నికలు జరిగే రాష్ట్రాలకు తెలంగాణ నుంచే డబ్బులు వెళ్తున్నాయని ఆరోపించారు. మేనిఫెస్టోను ప్రధాని మోదీని అడిగి తయారు చేశారా అంటూ కాంగ్రెస్‌పై బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ముత్తోజిపేటలో తీవ్ర ఉద్రిక్తత

## శంకర్ గౌడ్ మృతదేహాన్ని డిపోకు తీసుకెళ్లకుండా అడ్డంకులు

## పోలీసుల తీరుపై మండిపడ్డ ఆర్టీసీ కార్మికులు

## డిపోకు తీసుకెళితే నష్టమేంటని బండి సంజయ్ ప్రశ్న

వరంగల్, అక్షరకలం ప్రతినిధి

వరంగల్ జిల్లా నర్సంపేట మండలం ముత్తోజిపేటలో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఆత్మహత్య చేసుకున్న ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతదేహాన్ని డిపో వరకు తీసుకెళ్లేందుకు కార్మికులు యత్నించారు. నర్సంపేట డిపో వద్ద మృతదేహానికి నివాళులర్పిస్తామని చెప్పారు. అందుకు పోలీసులు అంగీకరించలేదు. మృతదేహాన్ని తీసుకెళ్లకుండా అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు, కార్మికులకు మధ్య వాగ్వాదం, తోపులాట చోటుచేసుకున్నాయి. ప్రభుత్వానికి, పోలీసులకు వ్యతిరేకంగా కార్మికులు నినాదాలు చేశారు. శంకర్‌గౌడ్ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో శంకర్ గౌడ్ మృతదేహాన్ని నర్సంపేట డిపోనకు తీసుకెళ్లేందుకు బీఆర్‌ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి యత్నించారు. దీంతో పోలీసులను వారిని అడ్డుకుని అరెస్టు చేశారు. వారిని పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్తుండగా మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ సహా బీఆర్‌ఎస్ నాయకులు, కార్మికులు అడ్డుకుని వాగ్వాదానికి దిగారు. దీంతో అక్కడ ఉద్రిక్తత కొనసాగుతోంది. ఈ సందర్భంగా ఆర్టీసీ కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. నర్సంపేట డిపోకు తీసుకెళ్లకుంటే శంకర్ గౌడ్ ఆత్మ శాంతించదని అన్నారు. నర్సంపేట ఆర్టీసీ డిపోకి శంకర్‌గౌడ్ మృతదేహాన్ని తరలించేదాకా కదిలేది లేదని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. శంకర్‌గౌడ్ మృతదేహాన్ని నర్సంపేట డిపోకు తీసుకెళితే అభ్యంతరం ఏంటని పోలీసులను ప్రశ్నించారు. పోలీసులు అనవసరంగా అడ్డుకుని ఎందుకు శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని మండిపడ్డారు. శంకర్ గౌడ్ కుటుంబ సభ్యుల విజ్ఞప్తి మేరకు ఆర్టీసీ డిపోకు తరలించాలని పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మికులు ఆయనను కడసారిగా చూసి నివాళి అర్పిస్తే నష్టమేంటన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్‌కి వరంగల్ పోలీస్ కమిషనర్ ఫోన్ చేసి మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాలను వివరించారు. అయితే శంకర్‌గౌడ్ కుటుంబ సభ్యులు, ఆర్టీసీ కార్మికుల విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకోవాలన్న కేంద్ర మంత్రి సూచించారు. 22 ఏళ్లపాటు నర్సంపేట ఆర్టీసీ డిపోలో శంకర్‌గౌడ్ సేవలందించారని, అక్కడికి తీసుకెళితేనే ఆయన ఆత్మకు శాంతి చేకూరుతుందని ఆర్టీసీ కార్మికులు, కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

# వందేమాతరం సామూహిక గీతాలపన

## మోడీని ఆహ్వానించేందుకు బిజెపి ఆఫీస్‌కు వెళ్లా

## మాజీ మంత్రి మల్లారెడ్డి కోడలు ప్రీతి రెడ్డి

హైదరాబాద్ అక్షరకలం ప్రతినిధి

గత కొంతకాలంగా మాజీ మంత్రి మల్లారెడ్డి బీజేపీలో చేరతారంటూ వస్తున్న వార్తలకు కోడలు ప్రీతి రెడ్డి చెక్ పెట్టారు. శుక్రవారం ఉదయం ప్రీతి రెడ్డి బీజేపీ కార్యాలయానికి వెళ్లారు. అనంతరం ప్రీతి మాట్లాడుతూ.. తాను కేంద్ర మంత్రి బండి సంజయ్‌తో టచ్‌లో ఉన్నది వాస్తవమే అని అన్నారు. అయితే బీజేపీలో చేరతానంటూ వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని స్పష్టం చేశారు. సామూహిక వందేమాతర గీతాలాపన కోసం మోదీని కలిసి ఆహ్వానించినట్లు చెప్పారు. మోదీ వస్తే పెద్ద ఈవెంట్ అవుతుందన్నారు. అందులో భాగంగానే శుక్రవారం బీజేపీ కార్యాలయంలో చంద్ర శేఖర్ తివారీని కలిసి ఆహ్వానించినట్లు తెలిపారు. 'మా మామ మల్లారెడ్డి బీఆర్‌ఎస్‌లోనే ఉంటారు' అంటూ ప్రీతి రెడ్డి తేల్చిచెప్పారు. ఇటీవల కుటుంబసభ్యులతో సహా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని మల్లారెడ్డి కలిసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి మల్లారెడ్డి బీజేపీలో చేరబోతున్నారంటూ జోరుగా ప్రచారం జరిగింది. తాజాగా బీజేపీ కార్యాలయానికి ప్రీతి రెడ్డి రావడం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే ప్రధానిని ఎందుకు కలిశారో చెప్పి.. ఈ ప్రచారానికి మల్లారెడ్డి కోడలు ప్రీతి రెడ్డి ఫుల్‌స్టాప్ పెట్టేశారు.

# ఆర్టీసీ సమ్మెకు బలయిన శంకర్‌గౌడ్

## పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం

## చికిత్స పొందుతూ హైదరాబాద్‌లో మృతి

## సిఎం రేవంత్ సంతాపం, మంత్రి పొన్నంల సంతాపం

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

ఆర్టీసీ సమ్మెపై ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరసనగా పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డ నర్సంపేట డిపో ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి చెందారు. హైదరాబాద్ అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. అపోలో ఆస్పత్రిలో శంకర్ గౌడ్ మృతదేహానికి పోస్టుమార్టం పూర్తైంది. బంధువులకు శంకర్ గౌడ్ మృతదేహాన్ని అప్పగించారు. స్వస్థలానికి శంకర్ గౌడ్ మృతదేహం తరలించారు. గురువారం ఆర్టీసీ డ్రైవర్ పెట్రోల్ పోసుకొని నిప్పంటిచుకున్న విషయం తెలిసిందే. గత రెండ్రోజులుగా ఆర్టీసీ కార్మికులు సమ్మెకు దిగిన విషయం తెలిసిందే. ఈ సమ్మెలో భాగంగా గురువారం రాష్ట్రంలోని అనేక చోట్ల కార్మికులు నిరసనలు చేపట్టారు. ఈ క్రమంలోనే వరంగల్ జిల్లా నర్సంపేట ఆర్టీసీ డిపో ఎదుట కార్మికులు నిరసన చేపట్టారు. ఈ సమ్మెలో పాల్గొన్న శంకర్‌గౌడ్(55) పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఆయనను వెంటనే వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. అప్పటికే 80 శాతం కాలినగాయాలు కావడంతో హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారు జామున మృతి చెందారు. అత్యక్రియలకు ప్రముఖ రాజయకీయ నాయకులు హాజరుకానున్నారు. మరోవైపు.. ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ బలవన్మరణం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శంకర్ గౌడ్ కుటుంబానికి అండగా ఉంటామని, ప్రభుత్వం తరఫున అన్ని విధాలుగా ఆదుకుంటామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. శంకర్ గౌడ్ ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ధైర్యం, మనోబలం కలగాలని ప్రార్థించారు. క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయం ఆ కుటుంబాన్ని దు:ఖసాగరంలో ముంచిందని తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆర్టీసీ కార్మికులతో ప్రభుత్వం చర్చలు జరుపుతుందని, వారి సమస్యలను పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో ప్రయత్నాలు చేస్తుందని గుర్తు చేశారు. ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి పట్ల మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శంకర్ గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

# శంకర్ గౌడ్ మృతి విషాదకరం

## ఈ బలిదానం తీవ్రంగా కలచివేసింది

## మాజీమంత్రి హరీష్ రావు ఆవేదన

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

ఆర్టీసీ కార్మికుడు శంకర్ గౌడ్ మృతిపై మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు స్పందించారు. శంకర్ గౌడ్ ఆత్మ బలిదానం తీవ్రంగా కలిచివేసిందంటూ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా మాజీ మంత్రి పోస్ట్ చేశారు. శంకర్ గౌడ్ మృతికి సీఎం రేవంత్ రెడ్డిదే బాధ్యత అని అన్నారు. శంకర్ గౌడ్ అమరుడైన రోజును 'అపాయింటెడ్ డే'గా ప్రకటించాలని మాజీ మంత్రి డిమాండ్ చేశారు. 'ఆర్టీసీ కార్మిక సోదరుడు శంకర్ గౌడ్ ఆత్మబలిదానం మా హృదయాలను తీవ్రంగా కలిచివేసింది. సంస్థను కాపాడేందుకు, కార్మికుల హక్కుల కోసం ప్రాణత్యాగం చేసిన శంకర్ గౌడ్‌కు మా ఘన నివాళులు. హక్కుల సాధన కోసం సంఘటితంగా పోరాడాలి తప్ప, ఇలాంటి ఆత్మబలిదానాలకు ఎవరూ ఒడిగట్టవద్దని హృదయపూర్వకంగా మనవి చేస్తున్నాం. శంకర్ గౌడ్ మృతికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిదే బాధ్యత. ప్రభుత్వ అలసత్వం, నిర్లక్ష్యం వల్ల ఇలాంటి పరిస్థితి వచ్చింది. అధికారంలోకి రాగానే ఆర్టీసీ విలీన ప్రక్రియను పూర్తి చేస్తామని, ఇతర అన్ని సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి మాట తప్పడం వల్లనే ఈ దుస్థితి. మేనిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానాలు కూడా అమలు చేయకుండా ఇంకెన్నాళ్లు కాలం గడుపుతావు రేవంత్ రెడ్డి? ఇలా ఎంతమందిని బలి తీసుకుంటావు? ఆర్టీసీ కార్మికుల న్యాయమైన ఆవేదనను పరిగణలోకి తీసుకొని, ప్రభుత్వం తక్షణమే సమస్యల పరిష్కారానికి చర్యలు ప్రారంభించి, కార్మికుల్లో విశ్వాసం కల్పించాలి. శంకర్ గౌడ్ అమరుడైన రోజును 'అపాయింటెడ్ డే'గా ప్రకటించి, ఆయన త్యాగానికి తగిన గౌరవం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. ఆర్టీసీ కార్మిక సోదరుల్లారా, మీరు చేస్తున్న పోరాటానికి మేమంతా అండగా ఉన్నాం. అధైర్యానికి లోనుకాకండి. కలిసికట్టుగా, న్యాయబద్ధంగా పోరాడి మన హక్కులను సాధించుకుందాం. ఎలాంటి తొందరపాటు చర్యలకు పాల్పడవద్దని మరోసారి మనవి చేస్తున్నాం. జోహార్ శంకర్ గౌడ్' అంటూ హరీశ్ రావు ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

# ఆర్టీసీ కార్మికులకు రేవంత్ తీరని ద్రోహం

## రేవంత్ నిర్లక్ష్యమే శంకర్ గౌడ్‌ను బలితీసుకుంది

## బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

వరంగల్ జిల్లా నర్సంపేట ఆర్టీసి డ్రైవర్ శంకర్ గౌడ్‌ది ఆత్మహత్య కాదు.. అది ముమ్మాటికీ రేవంత్ సర్కారు చేసిన హత్యే అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రెండున్నరేళ్లుగా సీఎం రేవంత్ ఆర్టీసి కార్మికులకు చేస్తున్న తీరని ద్రోహాన్ని తట్టుకోలేకే శంకర్ గౌడ్ బలవన్మరణానికి పాల్పడ్డారని అన్నారు. ఆర్టీసీ సంస్థ పరిరక్షణకు, తోటి కార్మికుల హక్కుల సాధనకు ప్రాణత్యాగానికి సిద్ధపడ్డ శంకర్ గౌడ్ పార్థివదేహాన్ని నర్సంపేట డిపో వద్దకు తీసుకెళ్లి నివాళులు అర్పించేందుకు కూడా అనుమతించకపోవడం అత్యంత దుర్మార్గమైన చర్య అని కేటీఆర్ మండిపడ్డారు. పు÷–టటెడు దుఖంలో ఉన్న శంకర్ గౌడ్ కుటుంబ సభ్యులకు అండగా నిలిచిన బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డితోపాటు, బీఆర్‌ఎస్ నేతలు, ఆర్టీసీ కార్మికులు, కార్మిక సంఘాల నేతలను నర్సంపేటలో అరెస్టుచేయడం చాలా దారుణమని అన్నారు. రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో అక్రమంగా అరెస్టు చేసిన వారందరినీ బేషరతుగా విడుదల చేయడంతోపాటు, శంకర్ గౌడ్ కుటుంబసభ్యులు, ఆర్టీసి కార్మికుల విజ్ఞప్తిమేరకు ఆర్టీసి డిపో వద్ద నివాళులు అర్పించే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ సర్కారు రాక్షసత్వం వల్ల కుటుంబ పెద్దను కోల్పోయి పుట్టెడు దుఖంలో ఉన్న శంకర్ గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం కోటి రూపాయల పరిహారం చెల్లించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. అలాగే శంకర్ గౌడ్ గారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించి అన్నివిధాలా ఆదుకోవాలని బీఆర్‌ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికులు సమ్మె చేస్తున్నా, కనీసం సోయి లేని సర్కారు అంతులేని నిర్లక్ష్యం వల్లే ఇవాళ ఉద్యమం నాటి దృశ్యాలు, ఆత్మబలిదానాలు చేసుకునే పరిస్థితులు చూస్తున్నామని మండిపడ్డారు. అసెంబ్లీ ఎన్నికల వేళ సవాలక్ష హామీలిచ్చిన రేవంత్ రెడ్డి కనీసం ఒక్కటంటే ఒక్కటి కూడా ఇప్పటికీ నెరవేర్చకపోవడంతోనే ఆర్టీసీ కార్మిక లోకం ఇవాళ తీవ్ర నిరాశ నిస్పృహల్లో కొట్టుమిట్టాడుతోందని కేటీఆర్ అన్నారు. ఆర్టీసీని నిర్వీర్యం చేసే కుట్రలను ఇకనైనా మానుకుని ఆర్టీసీ కార్మికులతో చర్చలు జరిపి, ఇచ్చిన హామీలను, న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. రాష్ట్రంలో ఒకేరోజు ముగ్గురు ఆర్టీసీ డ్రైవర్లు ఆత్మహత్య ప్రయత్నాలు చేసిన సంఘటన తెలంగాణ చరిత్రలో ఓ చీకటి రోజుగా మిగిలి ఉంటుందని కేటీఆర్ అన్నారు. తెలంగాణలో ఏకకాలంలో ఇన్ని బాధాకరమైన సంఘటనలు జరిగినా మానవత్వం లేని కాంగ్రెస్ సర్కారులో కనీసం చలనం లేకపోవడం సిగ్గుచేటు అని విమర్శించారు. ఆర్టీసీ కార్మిక సోదరుల్లారా.. దయచేసి మనోధైర్యాన్ని కోల్పోకండి. మీ పోరాటాలకు బీఆర్‌ఎస్ పార్టీ పూర్తిస్థాయిలో అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ నిరంకుశ కాంగ్రెస్ సర్కారు, ఈ అసమర్థ ముఖ్యమంత్రి మెడలు వంచి ఆర్టీసీ కార్మికుల న్యాయమైన హక్కులను సాధించే వరకూ మనమంతా కలిసి సంఘటితంగా ఉద్యమిద్దామని పిలుపునిచ్చారు.

# తెలంగాణలో మరో కొత్త పార్టీ

## నేడు పార్టీపేరును ప్రకటించనున్న కవిత

## కార్యకర్తల సమక్షంలో జెండా, ఎజెండా వెల్లడి

## తెలంగాణ ప్రజా జాగృతి అంటూ ప్రచారం

హైదరాబాద్,

తెలంగాణలో మరో కొత్త పార్టీ పురుడుపోసుకుంటుంది. శనివారం కవిత కొత్త పార్టీ ప్రకటించబోతున్నారు. పార్టీ పేరు ప్రకటన విడుదల కాబోతున్నది. శనివరాం ఉదయం 10 గంటలకు.. కవిత తన పార్టీ పేరును ప్రకటించబోతున్నారు. జెండా, ఎజెండా విడుదల చేయబోతున్నారు. తెలంగాణ రాజకీయాల్లో కీలక మలుపు కాబోతున్నది. కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ, కామ్రేడ్ పార్టీలకు ధీటుగా పోరాటానికి సిద్ధం అవుతున్న కవిత పార్టీ ప్రకటన ఎలా ఉండబోతుంది అనేది ఉత్కంఠ రేపుతోంది. కవిత పార్టీకి సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. మేడ్చల్ అద్వయ కన్వెన్షన్ సెంటర్ వేదికగా బహిరంగ సభలో కవిత తన పార్టీ పేరును ప్రకటించబోతున్నారు.

# చండీగఢ్ కు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్..

ఈనెల 26న "చింతన్ శివిర్" లో పాల్గొన్న మంత్రి అడ్లూరి..

హైదరాబాద్ : ఏప్రిల్ 24,( అక్షర కలం న్యూస్ ):



తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమం, దివ్యాంగులు, వయోవృద్ధుల మరియు ట్రాన్స్‌జెండర్ల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఈ నెల 25న చండీగఢ్ కు వెళ్లనున్నారు.కేంద్ర సామాజిక న్యాయం మరియు సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఏప్రిల్ 26న నిర్వహించనున్న "చింతన్ శివిర్" కార్యక్రమంలో మంత్రి పాల్గొంటారు. ఈనెల 25వ హైదరాబాద్ లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుండి రాత్రి 7-30 గంటలకు మంత్రి బయలుద్దేరి రాత్రి 10:15 గంటలకు చండీగఢ్‌లోని షహీద్ భగత్ సింగ్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకుంటారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన సంక్షేమ శాఖ మంత్రులతో పాటు న్యాయ శాఖ మంత్రులు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. తెలంగాణ రాష్ట్రం తరపున రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ "చింతన్ శివిర్" కార్యక్రమంలో పాల్గొని తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారి ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను మంత్రి వివరించనున్నారు. మంత్రి పర్యటన దృష్ట్యా తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి చండీగఢ్ ప్రభుత్వానికి మరియు సంబంధిత అధికారులకు సమాచారాన్ని అందజేశారు. చండీగఢ్ పర్యాటక ముగించుకొని ఈనెల 28వ తేదీన తిరిగి మంత్రి లక్ష్మణ్ కుమార్ హైదరాబాద్ చేరుకుంటారు.

# చిన్నారుల్లో నైతిక విలువలు పంచే విధంగా ఒకేషనల్ బైబిల్ స్కూల్..

అక్షర కలం నాగార్జునసాగర్ / నందికొండ ..



మున్సిపాలిటీ స్థానిక హిల్ కాలనీలోని క్రీస్తు లూథరన్ దేవాలయంలో నిర్వహిస్తున్న వి.బి.ఎస్ (వేకేషనల్ బైబిల్ స్కూల్) కార్యక్రమం శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని రెవరెండ్ ఫాదర్ ఎడ్ల రాజేశ్వరరావు, రెవరెండ్ ఫాదర్ ఎడికేవి ప్రసాద్ ఆధ్వర్యంలో సంఘ పెద్దల సమక్షంలో ప్రారంభించారు. మొదటి రోజు నిర్వహించిన ఈ శిక్షణ కార్యక్రమంలో సుమారు 60 మంది చిన్నపిల్లలు ఉత్సాహంగా పాల్గొన్నారని వేసవి సెలవులను సద్వినియోగం



చేసుకునే ఉద్దేశంతో ఈ వి.బి.ఎస్ కార్యక్రమాన్ని ప్రత్యేకంగా నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమంలో భాగంగా పిల్లలకు బైబిల్ కథలు, ఆధ్యాత్మిక పాటలు, వినోదాత్మక కార్యాచరణల ద్వారా క్రైస్తవ ధర్మంలోని నైతిక విలువలను సులభంగా అర్థమయ్యేలా బోధిస్తున్నామని రెవరెండ్ ఫాదర్ ఎడ్ల రాజేశ్వరరావు తెలిపారు. పిల్లల్లో మంచి ప్రవర్తన, ప్రేమ, క్రమశిక్షణ వంటి గుణాలను పెంపొందించడం ఈ శిక్షణ ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు పేర్కొన్నారు.ఇలాంటి కార్యక్రమాలు పిల్లల ఆత్మీయ, మానసిక అభివృద్ధికి దోహదం చేస్తాయని సంఘ పెద్దలు అభిప్రాయపడ్డారు.

# మిల్లుల వద్ద రైతులకు ఇబ్బందులు కలగకూడదు : ఆర్డీవో అశోక్ రెడ్డి కీలక ఆదేశాలు

## రోజుకు 54 లారీలను అన్‌లోడ్ చేయాలని ఆర్‌డీఓ ఆదేశం

అక్షర కలం ; చిట్యాల

నల్గొండ ఆర్డీవో అశోక్ రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం చిట్యాల తహశీల్దార్ కార్యాలయంలో వరి ధాన్యం సేకరణపై కీలక సమీక్షా సమావేశం నిర్వహించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయడం మరియు లారీల అన్‌లోడింగ్‌లో జాప్యాన్ని నివారించడంపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ మిల్లులకు వచ్చే




ధాన్యం లారీలను ఎప్పటికప్పుడు అన్‌లోడ్ చేయాలని ఆర్‌డీఓ మిల్లర్లను ఆదేశించారు. చిట్యాల మండల వ్యాప్తంగా రోజుకు కనీసం 54 లారీలను ధాన్యాన్ని అన్‌లోడ్ చేయాలని స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించారు. ప్రతి మిల్లు వద్ద జీపీఓ లను నియమించి, లారీలను సీరియల్ పద్ధతిలో అన్‌లోడ్ చేసేలా చూడాలని అధికారులను ఆదేశించారు. దీనివల్ల రవాణాలో గందరగోళం తగ్గుతుందని పేర్కొన్నారు. చిట్యాల మండలంలోని 15 పీఏసీ కేంద్రాల పరిధిలో ఎక్కడా లారీల కొరత రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు ?రైతులు మిల్లుల వద్దకు వచ్చి ఎటువంటి ఇబ్బందులు పడకుండా, ధాన్యం సేకరణ సజావుగా సాగేలా చూడటమే ఈ చర్యల ముఖ్య ఉద్దేశమని అధికారులు తెలిపారు. ?ఈ కార్యక్రమంలో డిప్యూటీ సివిల్ సప్లై అధికారి దీపక్ , వెహికల్ ఇన్స్పెక్టర్ సోనీ, ఏఎంసీ చైర్మన్, నర్రా వినోదమోహన్ రెడ్డి , ఏఎంవీఐ, మిల్లర్లు, లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు, పీఏసీ సెక్రటరీలు మరియు పిపిసి సెంటర్ల ఇన్‌ఛార్జులు తదితరులు పాల్గొన్నారు ..



# మహిళ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ

## మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి, నాగర్ కర్నూల్ జిల్లా ఎమ్మెల్యేలు పంపిణీ

అక్షర కలం నాగర్ కర్నూల్



శుక్రవారం నాగర్ కర్నూల్ కలెక్టరేట్ ఆవరణలో రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన జిల్లా మహిళ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీ కార్యక్రమం



ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖ్య అతిథిగా హాజరై, ఎంపీ డాక్టర్ మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ వీరయ్య , అధికారులు,ప్రజాప్రతినిధులు,లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ఈ సందర్భంగా 44 మంది దివ్యాంగులకు వాహనాలను పంపిణీ చేశారు. అలాగే డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు 17 ల్యాప్‌టాప్‌లు, 2 సెల్‌ఫోన్లు అందజేశారు. అదనంగా, 20 మంది బాలికలకు సైకిళ్లు, 6 మోటార్ వీల్‌చైర్లు, 10 బ్యాటరీ ట్రైసైకిళ్లు, ఒక బ్యాటరీ ఆటోను లబ్ధిదారులకు అందించారు. ప్రభుత్వం దివ్యాంగుల జీవనోపాధిని మెరుగుపర్చడం,వారి స్వయం ఆధారిత జీవనానికి తోడ్పడడం లక్ష్యంగా ఈ ఉపకరణాలను అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీ డాక్టర్ మల్లు రవి మాట్లాడుతూ దివ్యాంగులను వ్యక్తిగతంగా పలకరించి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, వారికి అవసరమైన అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా అర్హులైన ప్రతి దివ్యాంగుడికి అవసరమైన ఉపకరణాలు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువ అవుతున్నాయని, క్షేత్రస్థాయిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూర్చడమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు.ఈ సందర్భంగా ఆయన ప్రధానంగా దివ్యాంగుల సంక్షేమ పథకాల అమలులో పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నామని, దివ్యాంగులు సమాజంలో ఎవరికీ తీసిపోరని, వారికి అందరితో సమానంగా గౌరవం, అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. దివ్యాంగుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందని, వారిని స్వయం సమృద్ధి సాధించేలా ప్రోత్సహించేందుకు మరిన్ని వినూత్న పథకాలను ప్రవేశపెడతామని , ప్రభుత్వం అందిస్తున్న పెన్షన్లు, సాయం నేరుగా లబ్ధిదారులకు అందుతున్నాయని, ప్రజల అవసరాలకు అనుగుణంగా పాలన సాగిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

# గ్రీన్ ఎనర్జీతోనే ఏపీకి భవిష్యత్తు

## మరో రంగారెడ్డి కానున్న అనకాపల్లి

## పరిశ్రమల రాకతో మెండుగా ఉద్యోగావకాశాలు

## ఉపాధి కోసం హైదరాబాద్ వెళ్లాల్సిన పనిలేదు

## రెన్యూ ఎనర్జీ ప్లాంట్‌కు శంకుస్థాపనలో సిఎం చంద్రబాబు

అనకాపల్లి,

విశాఖకు ఎక్కువ పరిశ్రమలు వస్తున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. ఇక్కడ పరిశ్రమలో ఈ ప్రాంతం అభివృద్ధికి అవకాశాలు పెరిగాయని, నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు వస్తున్నాయని సిఎం చంద్రబాబు నాయుడు అన్నారు. గురువారం అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో పర్యటించిన సీఎం.. రెన్యూ ఎనర్జీ ప్లాంట్‌కు శంకుస్థాపన చేశారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. గ్రీన్ ఎనర్జీతోనే ఏపీకి భవిష్యత్తు అని స్పష్టం చేశారు. ఆర్టీసీ బస్సులను ఎలక్ట్రిక్ బస్సులుగా మారుస్తామని.. అన్ని బస్సులను ఏసీ బస్సులుగా మారుస్తామని చెప్పారు. అనకాపల్లిని మరో రంగారెడ్డి జిల్లా చేస్తామని అన్నారు. ఈ జిల్లాను అదృష్టం వరించిందని.. భారీగా పెట్టుబడులు వస్తున్నాయని తెలిపారు. దేశంలోనే అనకాపల్లి నంబర్‌వన్ అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. భారీ పెట్టుబడులతో అనకాపల్లి జిల్లా అదరగొడుతోందని, దేశంలోనే నంబర్ వన్ జిల్లాగా తయారవుతుందని తెలిపారు. రాంబిల్లిలో రూ.5,400 కోట్ల పెట్టుబడితో రెన్యువబుల్ ఎనర్జీ సంస్థ నిర్మిస్తున్న క్లీన్ ఎనర్జీ ప్లాంట్‌కు సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ఇటీవలే రూ.1.36 లక్షల కోట్లతో ఆర్సెలర్ మిత్తల్ స్టీల్ కంపెనీకి శంకుస్థాపన చేసినట్లు గుర్తుచేశారు. క్లీన్ ఎనర్జీ ప్లాంట్ ప్రాజెక్టు ద్వారా 2,100 మందికి ప్రత్యక్ష ఉపాధి లభిస్తుంది. అత్యంత వెనుకబడిన తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా దేశంలో ధనిక జిల్లాగా మారింది. ఇప్పటికే విశాఖలో పూర్తిగా పరిశ్రమలు వచ్చాయి. ఇకపై ఏ పెట్టుబడులు వచ్చినా అనకాపల్లి జిల్లాకే వస్తాయి. అనకాపల్లిని మరో రంగారెడ్డి జిల్లాగా చేసే బాధ్యత నాది. రాష్ట్రంలో పెద్దఎత్తున అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. రాంబిల్లిలోని సోలార్ ఇన్‌ఫూట్ వేఫర్ ఉత్పత్తితో విదేశాలపై ఆధారపడే పరిస్థితి పోతుంది. ప్రధాని మోదీ ఆత్మనిర్భర్ భారత్ కలల సాకారానికి ఇదే నిదర్శనం అన్నారు. ఇటీవలే ఆర్సెలార్ స్టీల్ కంపెనీ వచ్చిందన్నారు. ఉత్తరాంధ్రకు ఎన్నో పరిశ్రమలు వస్తున్నాయని.. ఇక ఉద్యోగాల కోసం హైదరాబాద్ వెళ్లాల్సిన అవసరం ఉండదని సీఎం అన్నారు. ఉద్యోగాల కోసం ఏపీకి రావాల్సిన పరిస్థితి తీసుకొస్తామని తెలిపారు. ఏడాదిలోగా ఉత్తరాంధ్రకు గోదావరి




నీళ్లు తీసుకొస్తామన్నారు. జులైలో భోగాపురం ఎయిర్‌పోర్టును ప్రారంభిస్తామని సీఎం వెల్లడించారు. వైసీపీ పాలనలో ఎక్కడ చూసినా అవినీతే జరిగిందని ముఖ్యమంత్రి ఆరోపించారు. 2019-24 మధ్య ఏపీలో విధ్వంసం జరిగిందని విమర్శించారు. విద్యుత్ రంగాన్ని వైసీపీ కుప్పకూల్చిందని మండిపడ్డారు. జగన్ పాలనలో విద్యుత్ ఛార్జీలు పెంచారని.. ఉచితంగా కరెంట్ వచ్చే సోలార్‌ను వినియోగించుకోలేదన్నారు. విద్యుత్ సంస్థలపై రూ.12 వేల కోట్ల భారం మోపారన్నారు. వైసీపీ హయాంలో పరిశ్రమలు వెనక్కిపోయాయని సీఎం అన్నారు. సొంత బాబాయ్‌నే చంపిన చిల్లర పార్టీ వైసీపీ అంటూ మండిపడ్డారు. గుండెపోటుతో వివేకా చనిపోయారని చెప్పారని.. పోస్టుమార్టం తర్వాత గొడ్డలిపోటుగా తేలిందన్నారు. వాళ్లే నేరం చేసి.. ఆ పాపాన్ని తమపై మోపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మనం నేరస్తులతో రాజకీయం చేస్తున్నాం' అని సీఎం వ్యాఖ్యానించారు. 'ఏపీ పునర్‌నిర్మాణం చేస్తామని చెప్పాం.. చేస్తున్నాం' అని సీఎం చంద్రబాబు తెలిపారు. ప్రజలు తమపై నమ్మకంతో అత్యధిక మెజారిటీతో గెలిపించారన్నారు.

కరెంట్ ఛార్జీలు పెంచబోమని చెప్పామన్నారు. తక్కువ ఖర్చుతో కరెంట్ ఉత్పత్తి జరగాలని.. సోలార్ ఎనర్జీకి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. రైతులే కరెంట్ ఉత్పత్తి చేసుకునే పరిస్థితి రావాలని చెప్పుకొచ్చారు. రెండుమూడేళ్లలో 40 లక్షల ఇళ్లకు రూఫ్‌టాప్ కరెంట్ అందిస్తామని అన్నారు. భవిష్యత్తులో 5 వేల ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. ఏపీకి ఇప్పటికే రూ.5 లక్షల కోట్లకుపైగా పెట్టుబడులు వచ్చాయని.. 22 నెలల్లో 800కి పైగా ప్రాజెక్టులు వచ్చాయని సీఎం తెలిపారు. రూ.22 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు జరిగాయన్నారు. ఎస్సీ, ఎస్టీలకు 2 కిలోవాట్ల వరకు ఉచితంగా ఇస్తామని తెలిపారు. 'ప్రతి ఇంటిపై సోలార్ అమర్చుకోండి.. రాయితీ ఇస్తాం' అని ప్రకటించారు. 23 లక్షల మంది రైతులకు 9 గంటల ఉచిత విద్యుత్, 22 లక్షల మంది ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని చెప్పారు. రూ.4 వేల కోట్లకుపైగా ట్రూడౌన్ ఛార్జీల భారం తగ్గించామని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. 2000లోనే విద్యుత్ రంగ సంస్కరణలు మొదలుపెట్టాం. 2019-24 మధ్య కాలంలో విద్యుత్ రంగం కుప్పకూలింది. ఉచిత సోలార్ కరెంటు వాడకుండా రూ.9వేల కోట్లు చెల్లించారు. విద్యుత్ సంస్థలపై రూ.1.12 లక్షల కోట్లు భారం మోపారు. విద్యుత్ ఛార్జీలు తొమ్మిదిసార్లు పెంచి ప్రజలపై రూ.32వేల కోట్ల భారం మోపారు. కేంద్రం 500 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి లక్ష్యంగా సాగుతుంటే.. ఏపీ 160 గిగావాట్ల ఉత్పత్తి లక్ష్యంగా ముందుకెళ్తోంది. గ్రీన్ ఎనర్జీ వల్ల రూ.10 లక్షల కోట్ల మేర పెట్టుబడులు వస్తాయి. 22 నెలల వ్యవధిలో 117 ప్రాజెక్టులు క్లియర్ చేశాం. రూ.5.95 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. మొత్తం 4.76 లక్షల మందికి ఉపాధి లభిస్తుంది. ఇప్పటికే 160 గిగావాట్లలో 90 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ తయారీకి అనుమతులు మంజూరు చేశాం. గ్రీన్ ఎనర్జీలో ఎన్టీపీసీ రూ.1.85 లక్షల కోట్లు ఖర్చు పెట్టబోతోంది. వచ్చే ఏడాది ఈ పనులు కూడా ప్రారంభమవుతాయి. త్వరలో 1,050 ఎలక్ట్రిక్ బస్సులు తీసుకొస్తున్నాం. వెయ్యికిపైగా ఛార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేశాం. త్వరలో మరో 444 ఎలక్ట్రిక్ బస్సులు వస్తాయి. మూడేళ్లలో 5 వేలకుపైగా ఛార్జింగ్ స్టేషన్లు వస్తాయి. రాబోయే రోజుల్లో ఆర్టీసీ బస్సులన్నీ ఎలక్ట్రిక్‌వే వస్తాయని చంద్రబాబు అన్నారు.

# మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయండి

## రైతులను ఆదుకోవాలంటూ చంద్రబాబుకు వివిఎస్ లేఖ

అమరావతి,

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, రైతులను ఆదుకోవాలని కోరుతూ ? ముఖ్యమంత్రి చంద్రబాబుకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు లేఖ రాశారు. రాష్ట్రంలో మొక్కజొన్న పండించిన రైతులు దైన్యమైన స్థితిలో ఉన్నారని తెలిపారు. సుమారు 11 లక్షల ఎకరాలకు పైగా ఈ సంవత్సరం మొక్కజొన్న సాగు చేశారని, గత సంవత్సరం పొగాకు, పత్తి, మిర్చి వంటి పంటలకు సరైన ధర లేకపోవడంతో రాష్ట్రంలో రైతులు మొక్కజొన్న సాగు వైపు వెళ్లారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా బర్లి పొగాకు స్థానంలో ఇతర పంటలను ప్రోత్సహించిందన్నారు. ప్రభుత్వ ప్రోత్సాహం, పొగాకు, పత్తి, మిర్చి వంటి పంటలకు ధరలు పడిపోవడంతో మొక్కజొన్న సాగు సుమారు మూడు లక్షల ఎకరాలకు పైగా పెరిగిందని వివరించారు. రైతుకు ఎకరా మొక్కజొన్న సాగు చేసేందుకు సుమారు 40 వేల రూపాయలు ఖర్చు అవుతుందని, 30 క్వింటాళ్లు దిగుబడి వస్తుందని అంచనా అని తెలిపారు. వాతావరణ ప్రతికూల పరిస్థితులు, అధిక వర్షాలు, అకాల వర్షాలు, పెరిగిన సాగు ఖర్చులను తట్టుకొని రైతులు మొక్కజొన్న సాగు చేసినప్పటికీ మార్కెట్లో ప్రభుత్వం ప్రకటించిన క్వింటాలుకు రూ.2,400 లు మద్దతు ధర లభించడం లేదు అని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించక పోవడంతో మార్కెట్లో దళారులు మొక్కజొన్న ధరలను క్వింటాలుకు రూ.1400 నుండి రూ.1800ల మధ్య కొనుగోలు చేస్తూ రైతులను దోచుకుంటున్నారని తెలిపారు. మొక్కజొన్న పండించిన రైతులు ఎకరానికి రూ.20 వేల నుండి 30వేలు నష్టపోతున్నాడు. కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించినప్పటికీ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించక పోవడంతో రైతులు అనివార్యంగా మధ్య దళారులకు అమ్ముకోవాల్సి వస్తున్నదన్నారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాసి నెల రోజులు అవుతున్నా కేంద్రం నుండి ఎలాంటి స్పందనా రాకపోవడంతో ఎన్‌డిఏలో భాగస్వామిగా ఉన్న సిఎం కేంద్రంపై ఒత్తిడి తెచ్చి తక్షణమే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేలా చూడాలని కోరారు. ఈలోగా కేంద్రం అనుమతి కోసం ఎదురు చూడకుండా రాష్ట్ర ప్రభుత్వమే మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు వి.శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు.

అక్షరకలం
తెలుగు దినపత్రిక

సంపాదకీయం...

# ప్రగతి చక్రంపై నిర్లక్ష్యపు చీడ !

**అధికారంలోకి రావడానికి అనేక హామీలు గుప్పించడం, తరవాత వాటిని విస్మరించడం పరిపాటిగా మారింది. అలవికాని హామీలు ఇవ్వడం, ప్రజలను మోసం చేయడం అలవాటు చేసుకున్నారు. బిఆర్ఎస్ బాటలోనే ఇప్పుడు కాంగ్రెస్ కూడా మోసాల దారిలో నడుస్తోంది. ఇచ్చిన హామీలను అమలు చేయలేక చతికిల పడింది.రాష్ట్ర ఆదాయం మొత్తాన్ని వడ్డీలు కట్టడానికే అన్నట్లుగా అప్పులు చేసి చూపారు. అప్పులతో తెలంగాణ చితికి పోతోంది. ఇందులో అన్ని పార్టీలతది ఒకటే దారిగా ఉంది. తెలంగాణ ఏర్పడ్డాక కెసిఆర్ ప్రభుత్వ హాయంలో ఆర్టీసి దాదాపు రెండునెలల పాటు సమ్మెకు దిగింది. వారిని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. ఆర్టీసిని ప్రభుత్వంలో విలీనం చేస్తామన్న హామీని ఆనాడు కెసిఆర్, ఈనాడు రేవంత్ రెడ్డి ఇద్దరూ నిలబెట్టుకోలేక పోయారు. దూరదృష్టి లేక రవాణా శాఖ.. సమ్మెకు కారణమయ్యారు. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం, వేతన సవరణ, బకాయిల చెల్లింపు సహా మొత్తం 32 అంశాలపై కార్మిక సంఘాల జేఏసీ ఏడాది కాలంగా ప్రభుత్వ పెద్దలకు, ఆర్టీసీ యాజమాన్యానికి వినతిపత్రాలు ఇచ్చింది.. విజ్ఞాపనలు చేసింది.**

సమ్మెకు వేళయిన తరుణంలో మంగళవారం ఆగమేఘాలపై అధికారుల కమిటీ పేరుతో ప్రభుత్వం ఓ కంటి తుడుపు ప్రతిపాదనను తెరపైకి తెచ్చింది. ఏడాదిగా పట్టింపులేనితనం ప్రదర్శించి, ఇప్పుడు నాలుగు వారాల గడువు కోరటం విడ్డూరం.ఇలాంటి కాలయాపన కమిటీతో ఒరిగేదేమీ లేదని భావించిన కార్మికులు, సమస్యలు పరిష్కరించే వరకు వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని తేల్చిచెప్పి, మంగళవారం అర్ధరాత్రి నుంచే సమ్మెకు వెళ్లారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ బస్సు చక్రాలు ఆగిపోయాయి. 6,000 బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. ప్రతి రోజూ 60 లక్షల మంది ప్రయాణించే ఆర్టీసీలో సమ్మెతో ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఓ వైపు ఎండలు మండిపోతుంటే ప్రైవేటు వాహనాలు అందుబాటులో లేక ప్రయాణాలు ప్రయాసగా మారాయి. విద్యార్థులు, రోజువారీ, కూలీలు, ఉద్యోగులు, తక్కువ ఖర్చుతో కూడిన ప్రజా రవాణాను ఆశ్రయించే ఇతర ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. డిపోల వద్ద కార్మికుల ధర్నాలు, పోలీసులు అడ్డుకోవడంతో పలుచోట్ల ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది.మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీ నష్టాల్లో సాగుతోంది. ఆర్టీసీ కార్మికులను ఒప్పించలేక, మెప్పించలేక చతికిలపడిన తీరు రేవంత్ సర్కార్ అసమర్థతకు నిదర్శనంగా చూడాలి. మాటలు, ఆవేశంతో కూడిన ప్రసంగాలతో ప్రజలను ఎల్లకాలం బురిడీ కొట్టించలేమని అధికార కాంగ్రెస్ నేతలు గుర్తించాలి. నిత్యం అరకోటి మందికి పైగా ప్రయాణించే ప్రజారవాణా వ్యవస్థలో సమస్యల పరిష్కారం చూపడంలో రెండున్నరేళ్లుగా నిర్లక్ష్యం వహించారు. ప్రభుత్వం ఇంకా దాటవేత ధోరణి అవలంబించి సమస్యను జటిలం చేయకుండా సమ్మెకు కారణాలను గుర్తించి పరిష్కరించాలి. ఆర్టీసీ కార్మికుల,రాష్ట్ర ప్రజల విస్తృత ప్రయోజనాల దృష్ట్యా సమ్మెకు సత్వరమే పరిష్కారం కనుగొనాలి. ఈ దిశగా సర్కార్ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. ఎన్నికల్లో డిక్లరేషన్లు, మ్యానిఫెస్టోలో హామీలు గుప్పించి, ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన హస్తం నేతలు పాలనను గాలికి వదిలేసి రాష్ట్రాన్ని అల్లకల్లోలం చేస్తున్నారు. ఇప్పుడు ప్రజా రవాణా వ్యవస్థ కూడా ఆ జాబితాలో చేరిపోయింది. హామీల అమలు, సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ కార్మిక సంఘాలు సమ్మెబాట పట్టాయి. అధికారంలోకి రావటానికి కాంగ్రెస్ నేతలు ఇచ్చిన హామీలను ఇప్పుడు మరచిపోయి మాట్లాడుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం కోసం ప్రణాళికను ప్రకటించినా ఆచరణలో పెట్టలేకపోయింది. తాము అధికారంలోకి వస్తే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతో పాటు పీఆర్సీ పరిధిలోకి తీసుకొస్తామని, ఉద్యోగాలను క్రమబద్ధీకరిస్తామని, ఖాళీలను భర్తీ చేస్తామని కాంగ్రెస్ హామీల మీద హామీలు గుప్పించింది. దీంతో ఆర్టీసీ కార్మికులు కాంగ్రెస్ మాటలనునమ్మారు. రెండున్నరేండ్లు గడిచినా కాంగ్రెస్ సర్కార్ ఆర్టీసీ గురించి పట్టించుకోవట్లేదు. ఆరు గ్యారెంటీల్లోని ఒక గ్యారెంటీ అయిన మహాలక్ష్మి పథకంలో ఒక భాగమైన 'మహిళలకు ఆర్టీసీలో బస్సుల్లో ఉచిత ప్రయాణ పథకం' తీసుకొచ్చింది. కానీ ఆర్టీసీకి ప్రభుత్వం నిధులు ఇవ్వటంలేదు. ఇప్పుడు కార్మిక సంఘాల జేఏసీ అడుగుతున్న డిమాండ్లలో ఫ్రీ బస్ పథకం నిధుల విడుదల అంశం కీలకమైనది కావడం గమనార్హం. మహిళలకు ఉచిత ప్రయాణంతో ఆర్టీసీ లాభాల్లోకి దూసుకెళ్లిందని చెప్పుకొంటున్న ప్రభుత్వ పెద్దలు.. కార్మికుల సమస్యలు



ఎందుకు పరిష్కరించటంలేదో చెప్పాలి. ఇకపోతే ఎన్నికల ముందు కాంగ్రెస్ నిరుద్యోగ మ్యానిఫెస్టోను ప్రకటించింది. తమ ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోగా 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీని చిక్కడపల్లి లైబ్రరీకి తీసుకువచ్చి నిరుద్యోగుల్లో ఆశలు పెంచింది. ప్రియాంక గాంధీతో సరూర్‌నగర్ స్టేడియంలో యూత్ డిక్లరేషన్ ప్రకటించి నిరుద్యోగులను తమ వైపు తిప్పుకున్నది. 2 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని నిరుద్యోగుల్లో ఆశలు కల్పించారు. అది నిజమని నమ్మిన ఎంతోమంది బస్సు యాత్రలు నిర్వహించి ఆ పార్టీకి అనుకూలంగా ప్రచారం నిర్వహించారు. ఎన్నికల్లో ఆ పార్టీకి ఓటు వేయడమే కాదు, ఏకంగా పత్తి చేలు, వ్యవసాయ బావుల వద్ద కూలీలు, రైతులను కలిసి, కాళ్లు మొక్కి కాంగ్రెస్‌కు ఓట్లు వేయించేలా తమ వంతు ప్రయత్నించారు. పదేండ్లపాటు అధికారానికి దూరంగా ఉన్న కాంగ్రెస్ నాయకులకు ఉద్యోగాలు వచ్చాయి తప్ప నిరుద్యోగులకు ఒక్క ఉద్యోగమూ రాలేదు. ఇలా అనేక హామీలను ఇచ్చి, వాటిని మరిచారు. ఇప్పుడు గత ప్రభుత్వాన్ని తిట్టడం తప్ప రెండున్నరేళ్లుగా గట్టిగా చేసిన కార్యక్రమం ఒక్కటీ లేదు. హామీల అమలులో నిజాయితీ లేకుంటా గత బిఆర్ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కు పడుతుంది. పదేళ్లపాటు అధికారంలో ఉంటామన్న భరోసాకు ప్రజలు చెల్లచీటీ పలుకుతారని గుర్తించాలి.

# ఇది ప్రజా పాలన కాదు బలి పాలన

**అక్షర కలం సిద్దిపేట ఏప్రిల్ 24:**

దివ్యాంగుల స్వచ్ఛ సంఘం ఆగ్రహం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ పార్టీకి సూటి ప్రశ్న ఆర్టీసీ సమ్మె ఉందని మీకు ముందే తెలుసు కానీ ఆ సమ్మె ని తేలికగా తీసుకున్నారు సమ్మెలు మా ప్రభుత్వాన్ని ఏం చేస్తాయిలే అనే ఒక ధోరణితో రెండున్నర ఏండ్లు మీరు మీ అధికారాన్ని విచ్చలవిడిగా నడిపిస్తున్నారు కానీ మీ మూర్ఖత్వం వలన ఒక నిండు ప్రాణం బలైపోయింది ఆ కుటుంబానికి దిక్కెవరు ఆ కుటుంబం పెద్ద చనిపోయాక నేను కుటుంబానికి అండగా ఉంటానని చెబుతున్న నీవు ఒక ముఖ్యమంత్రి వా ఒక మనిషివేనా మా దివ్యాంగులం ఆర్టీసీ సమ్మె లాగా చేయకపోవచ్చు ఎందుకంటే మాకు కాళ్లు చేతులు లేవు కాబట్టి కానీ ఆ కార్మికుని గుండెలో ఎంత బాధ రగిలితే కానీ పెట్రోల్ పోసుకొని నిప్పంచుకోలేడు కదా నిజంగా ఇది ప్రజా పాలన కాదు బలి పాలన అని చెప్పుకొని తిరగాలి మీరు ఒక మనిషి బలై పోతే గాని చర్చకు దిగని



మీరు మేము దివ్యాంగులం కాళ్లు రెక్కలు లేని వాళ్ళం మేము చనిపోతే గాని మీరు కూడా మాతోనే చర్చకు దిగరేమో మాకు ఇస్తానన్న హామీలు నైవేద్యలేరేమో కానీ మేము సైతం అలనాటి తెలంగాణ ఉద్యమంలో ఆంధ్ర పాలకుల వలన ఎలా విముక్తి చెంది తెలంగాణని సాధించుకున్నాము ఈనాడు ఈ కాంగ్రెస్ ప్రభుత్వం నుండి మీ మూర్ఖపు స్వార్థపూర్వక రాజకీయ లక్కీ విముక్తి చెందనికి మా దివ్యంగులం ఎంతమంది మైనా ప్రాణ తాగ్యానికి వెనకడబోమని తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వానికి సూటిగా చరిస్తున్నాం మాకు మాయమాటలు చెప్పి మీరు గద్దెనెక్కి దివ్యాంగులని కనీసం దివ్యాంగులు లాగా కూడా చూడలేని ఈ ప్రభుత్వం మాకు అవసరం లేదు ఇకనైనా కనులు తెరిచి దివ్యాంగులకు ఇస్తాను. అన్న 6, రూపాయల పింఛన్ వివిధ సంక్షేమ పథకాలు న్యాయబద్ధంగా మాకు నెరవేర్చలేని ఎడల ఆర్టీసీ సమ్మె లాగే మా దివ్యాంగుల సమ్మె కూడా ముందు ముందు రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగిస్తామని హెచ్చరిస్తూ మీకు సూటిగా హెచ్చరిస్తున్నాం.ఇట్లు దివ్యాంగుల స్వేచ్ఛ సంఘం సిద్దిపేట జిల్లా అధ్యక్షులు కెమ్మసారం అశోక్ రాష్ట్రంలో ఉన్న ప్రతి ఒక్క జిల్లా నాయకునికి జిల్లా అధ్యక్షుడికి పిలుపునిస్తూ ఈ ఉద్యమాన్ని కొనసాగిస్తామని తెలిపారు.

# నైపుణ్యాభివృద్ధితోనే భవిష్యత్ విజయం : అడిషనల్ కలెక్టర్ పాండు

**సంగారెడ్డి ప్రతినిధి,అక్షరకలం..**



ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న సంక్షేమ వారోత్సవాల్లో భాగంగా, కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు నైపుణ్య అభివృద్ధి శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ పాండు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి జీవితంలో ముందుగా తన లక్ష్యాన్ని స్పష్టంగా నిర్ణయించుకోవడం అత్యంత కీలకమని తెలిపారు. "మీరు ఏం కావాలనుకుంటున్నారు, ఏ రంగంలో రాణించాలనుకుంటున్నారు అనే ప్రశ్నలకు సమాధానం తెలుసుకుని, ఆ దిశగా క్రమశిక్షణతో పయనిస్తే విజయాన్ని అందుకోవడం సులభమవుతుందని సూచించారు.ప్రస్తుతం పోటీ ప్రపంచంలో కేవలం పాఠ్యపుస్తకాల జ్ఞానం సరిపోదని, నైపుణ్యాల అభివృద్ధి ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు. కమ్యూనికేషన్ స్కిల్స్, టెక్నికల్ నైపుణ్యాలు, సమస్యలను పరిష్కరించే సామర్థ్యం వంటి అంశాలు విద్యార్థులను మరింత ముందుకు తీసుకెళ్తాయని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ తరహా శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని, తమ భవిష్యత్తుకు బాటలు విద్యార్థులను ప్రోత్సహించారు.విజయం ఒక్కరోజులో సాధ్యంకాదని, నిరంతర శ్రమ, పట్టుదల, క్రమశిక్షణ ఉంటే ఏ లక్ష్యాన్నైనా చేరుకోవచ్చని ఆయన స్పష్టం చేశారు. వైఫల్యాలను భయపడకుండా వాటిని పాఠాలుగా తీసుకుని మరింత ధైర్యంగా ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. అలాగే, తమ సామాజిక నేపథ్యాన్ని అడ్డంకిగా కాకుండా, అవకాశంగా మలుచుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, శిక్షణ కార్యక్రమాలు అందరికీ అందుబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవడమే విజయానికి మొదటి అడుగని అన్నారు.ఈ కార్యక్రమంలో డీడీ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ అకిలేష్ రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడి రామాచారి, జిల్లా బీసీ సంక్షేమ అధికారి జగదీష్, ూజు డైరెక్టర్ రాజేశ్ కుమార్, ట్రైనర్ అరవింద, స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనర్ కె. కృష్ణ కుమార్, మోటివేటర్ శ్రీ కూన వేణు, రాజు రాథోడ్ తదితరులు పాల్గొని విద్యార్థులకు నైపుణ్య శిక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమం లో బీసీ, ఎస్సీ, ఎస్టీ హాస్టళ్లలోని డిగ్రీ విద్యార్థులు, వివిధ సంక్షేమ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# దొడ్డి కొమురయ్య భవనాన్ని ప్రైవేట్ సంస్థలకు లీజుకు ఇవ్వాలని చూస్తే సహించాం

**రాష్ట్ర కురుమ సంఘం ప్యానల్ 2 అధ్యక్షులు దొడ్డి శ్రీనాథ్ హెచ్చరిక**

**సంగారెడ్డి ప్రతినిధి,అక్షరకలం..**

దొడ్డి కొమురయ్య ఆత్మగౌరవ భవనాన్ని ప్రైవేటు సంస్థలకు లీజుకి ఇవ్వాలని చూస్తే సహించమని రాష్ట్ర కురుమ సంఘం ప్యానల్ 2 అధ్యక్షులు దొడ్డి శ్రీనాథ్ హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘం 15/1951 ప్యానెల్ 2 సంగారెడ్డి జిల్లా



పర్యటనలో భాగంగా సంగారెడ్డిలోని ఐబి లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం కురుమ విద్యార్థులను గుర్తించి 5 ఎకరాలు 7 కోట్లతో నిర్మించి ఇచ్చిన దొడ్డి కొమరయ్య ఆత్మ గౌరవ భవనం కురుమ విద్యార్థులకు ఇవ్వకుండా ప్రైవేట్ సంస్థ అయిన నారాయణ స్కూల్స్ కి లీస్ కి ఇవ్వాలని కురుమ సంఘం ప్రెసిడెంట్ ఎగ్గ మల్లేశం, ఎమ్మెల్యే బీర్ల ఐలన్న చూస్తున్నారని అలాగే కురుమ సంఘం ఎన్నికలు జరుగుతున్న గ్రామాలు మండలాల వారీగా సభ్యత్వం నమోదు పుస్తకాలు ఇవ్వకుండా సంఘం ఎన్నికలు జరుపడానికి ప్రయత్నం చేస్తున్నారని ఎగ్గా మల్లేశం, క్యామా మల్లేశం బీర్ల ఐలన్న చేస్తున్న మోసలను అవినీతిని కురుమ కులస్థులకు అవగాహన కలిపేంచెందుకు ప్యానెల్ 2 నుండి రాష్ట్ర అధ్యక్షులు గా దొడ్డి శ్రీనాథ్ కురుమ, ప్రధానకార్యదర్శి గా కారికే సత్యనారాయణ కురుమ, ఉపాధ్యక్షులుగా మాదారం కృష్ణ కురుమ, హైదరాబాద్ అధ్యక్షులు చిల్లంపల్లి సురేష్ కురుమ, యువత అధ్యక్షులుగా ఆడికే సంతోష్ కురుమ,సంగారెడ్డి జిల్లా గొర్రెల కాపార్ల అధ్యక్షులు బాధంపేట మల్లేశం కురుమ, వెళ్తూరి మల్లేశం కురుమ, రవీందర్ కురుమ, సతీష్ కురుమ, సంగారెడ్డి జిల్లా కురుమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

# వాసవి మాత జయంతిని అధికారికంగా నిర్వహించడం హర్షనీయం

**ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు తోపాజి అనంత కిషన్**

**సంగారెడ్డి ప్రతినిధి,అక్షరకలం..**

వాసవి కన్యకా పరమేశ్వరి జయంతిని అధికారికంగా ప్రకటించడంతో ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు తోపాజి అనంత కిషన్ ఆధ్వర్యంలో సంగారెడ్డిలోని ఐబీలో కృతజ్ఞత సభ శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా



హాజరైన మున్సిపల్ చైర్పర్సన్ కూన వనిత సంతోష్ మాట్లాడుతూ వాసవి కన్యకాపరమేశ్వరి జయంతి అధికారకంగా ప్రకటించడం హర్షనీయమని చెప్పారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాసవి మహా సంస్థాన్ చైర్మన్ తోపాజి అనంత కిషన్ మాట్లాడుతూ వాసవి కన్యకా పరమేశ్వరి జయంతిని ప్రభుత్వం అధికారికంగా ప్రకటించడానికి స్వాగతిస్తున్నట్లు చెప్పారు. 26వ తేదీన ఉదయం 10 గంటలకు ప్రభుత్వ అత్యధిక నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ జరుగుతుందని పేర్కొన్నారు. కలెక్టర్ కార్యాలయంలో సభ జరుగుతుందని చెప్పారు. వాసవి జయంతిని అధికారికంగా ప్రకటించేందుకు కృషిచేసిన ఆర్యవైశ్య కార్పొరేషన్ కాల్వ సుజాతకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బెజగం శ్రీనివాస్, కౌన్సిలర్ తోపాజి వీణ, టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి, కిరాణ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు మిర్యాల పాండురంగం, ప్రధాన కార్యదర్శి అక్షంతల మదన్మోహన్, మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనుముల సంతోష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మ్యాడం రాధా కిషన్, జూలకంటి బుచ్చిలింగం, వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ పుల్లూరి ప్రకాష్, వాసవి మహాసంస్థాన్ ప్రధాన కార్యదర్శి ఇల్లింతల రాజు, కోశాధికారి జూలకంటి మల్లేశం, ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు కొంపల్లి విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి నామ భాస్కర్, యువజన విభాగం అధ్యక్షుడు తోపాజి హరీష్, మహిళా విభాగం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు తోపాజీ తేజవతి, పాల్గొన్నారు.

# చదువుతోపాటు నైపుణ్య అభివృద్ధి అవసరం


**గద్వాల్ అక్షర కలం**

యువత తాము ఎంచుకున్న రంగంలో రాణించాలంటే చదువుతోపాటు ఆయా రంగాలపై నైపుణ్య అభివృద్ధి ఎంతో అవసరమని అదనపు కలెక్టర్ (రెవిన్యూ) లక్ష్మీనారాయణ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న సంక్షేమ వారోత్సవాల్లో శుక్రవారం గద్వాల ఏటిసి (అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్) వద్ద విద్యావంతులైన నిరుద్యోగ యువతకు నైపుణ్య అభివృద్ధిపై ఇస్తున్న శిక్షణ, ఉపాధి అవకాశాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) నర్సింగరావు తో కలిసి లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులు చేస్తున్న వృత్తులు, వ్యవసాయం, తదితర పనులకు ఖాళీ సమయాల్లో సహకరిస్తే వారికి ఆయా రంగాలపై పట్టు రావడమే కాక సామాజిక పరిస్థితులపై అవగాహన కలుగుతుందన్నారు. ఏటిసిలో ఇస్తున్న శిక్షణను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉన్నత చదువుల అనంతరం విద్యార్థులు ఉద్యోగాలు వచ్చే వరకు ఖాళీగా ఉండకుండా ఏదో ఒక పని చేస్తూ ఉంటేనే మెదడు చురుగ్గా పనిచేస్తుందని, తద్వారా ఎల్లప్పుడూ ఉత్సాహంగా ఉండవచ్చన్నారు. ప్రభుత్వం యువతకు ఉపాధి చూపేందుకు కల్పిస్తున్న వివిధ అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగడమే కాక మంచి పౌరులుగా పేరు తెచ్చుకోవాలని అదనపు కలెక్టర్ ఆకాంక్షించారు. అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) నర్సింగరావు మాట్లాడుతూ సంక్షేమ వారోత్సవాల్లో భాగంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న నైపుణ్య అభివృద్ధి శిక్షణ కార్యక్రమాలపై విద్యార్థులకు పెద్ద ఎత్తున అవగాహన కల్పిస్తున్నామన్నారు. గద్వాలలో ఏర్పాటు చేసిన ఏటీసీలో 172 సీట్లు భర్తీ చేయడం జరుగుతుందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలంపూర్ నియోజకవర్గంలో కూడా త్వరలో ఏటిసి ఏర్పాటుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందన్నారు. ఒకప్పుడు ఇంజనీరింగ్ చదువులకు డిమాండ్ ఎక్కువగా ఉండేదని ప్రస్తుతం పాలిటెక్నిక్ కోర్సులతోనూ మంచి ఉద్యోగ అవకాశాలు పొందే అవకాశం ఉండడంతో విద్యార్థులు పెద్ద ఎత్తున చేరుతున్నారన్నారు. యువత ఏఐ టెక్నాలజీపై కూడా అవగాహన పెంపొందించుకుంటే సృజనాత్మకతతో నూతన ఆవిష్కరణలు చేసేందుకు అవకాశం ఉందన్నారు. తాము ఒకరి వద్ద పనిచేయడమే కాక సబ్సిడీ రుణాలతో సొంతంగా వ్యాపారాలు చేస్తూ, పరిశ్రమలు స్థాపిస్తూ ఎంతోమందికి ఉపాధి కల్పించేలా విద్యార్థులు ఎదగాలన్నారు. అంతకుముందు ఏటీసీలో వివిధ అంశాలపై ఇస్తున్న శిక్షణ గురించి విద్యార్థులకు అక్కడి ట్రైనర్స్ అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి నుషిత, బీసీ సంక్షేమ శాఖ అధికారి అక్బర్ బాషా, డీఈవో విజయలక్ష్మి, డిడబ్ల్యూఓ సునంద, ఉపాధి కల్పనాధికారి చరణ్ దీప్, జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ రామలింగేశ్వరగౌడ్, డిఐఈఓ హృదయ రాజ్, ప్రత్యేక అధికారి నూకరాజు, ఏఎస్పిడిఓ నాగరాజు, వివిధ కళాశాలల ప్రధానాచార్యులు, వసతి గృహ వార్డెన్లు, తదితరులు పాల్గొన్నారు.



అక్షరకలం
తెలుగు దినపత్రిక

# ఆట









## క్రికెట్‌లో బిష్ణోయ్ గ్యాంగ్ కలకలం

క్రికెట్ ప్రపంచంలో మరో కలకలం రేగింది. పవిత్రమైన క్రీడగా భావించే క్రికెట్‌లో మాఫియా అడుగుపెట్టిందన్న వార్త క్రీడాభిమానులను దిగ్భ్రాంతికి గురిచేస్తోంది. టీ20 వరల్డ్ కప్ 2026 వేదికగా సాగుతున్న ఈ కుంభకోణంలో కెనడా జాతీయ జట్టు కెప్టెన్ దిల్‌ప్రీత్ బజ్వా పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. అయితే ఇక్కడ విస్తుపోయే విషయం ఏమిటంటే... ఈ ఫిక్సింగ్ వెనుక భారత మోస్ట్ వాంటెడ్ గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ ముఠా హస్తం ఉందని అంతర్జాతీయ మీడియా కోడై కూస్తోంది. ఐసీసీ యాంటీ కరప్షన్ యూనిట్ ఇప్పటికే రంగంలోకి దిగి విచారణను వేగవంతం చేసింది.కెనడియన్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్ కథనం ప్రకారం.. జూలై 2025లో బ్రిటిష్ కొలంబియాలోని ఒక రెస్టారెంట్‌లో జరిగిన సంఘటన ఈ కుంభకోణానికి పునాది వేసింది. అక్కడ భోజనం చేస్తున్న కెనడా జాతీయ జట్టు స్టార్ ప్లేయర్ దగ్గరకు ఇద్దరు వ్యక్తులు వచ్చి, తాము బిష్ణోయ్ గ్యాంగ్ ప్రతినిధులమని పరిచయం చేసుకున్నారట. దిల్‌ప్రీత్ బజ్వాను జట్టులోకి తీసుకోవడమే కాకుండా, అతన్ని కెప్టెన్‌గా నియమించడానికి మద్దతు ఇవ్వాలని, లేదంటే అతని కుటుంబ సభ్యులను చంపేస్తామని బెదిరించినట్లు సమాచారం.

## ఐపీఎల్‌లో క్షుద్రపూజల కలకలం..


హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలో సన్‌రైజర్స్ హైదరాబాద్, చెన్నై సూపర్ కింగ్స్ మధ్య జరిగిన మ్యాచ్ సందర్భంగా ఒక వింత సంఘటన చోటు చేసుకుంది. సీఎస్‌కే బ్యాటర్ అవుట్ కావడానికి సరిగ్గా కొన్ని సెకన్ల ముందు, ఒక ఎస్‌ఆర్‌హెచ్ అభిమాని నిమ్మకాయతో ఏదో తంత్రం చేస్తున్నట్టుగా ఉన్న వీడియో సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయ్యింది. ఇది చూసిన క్రికెట్ ఫ్యాన్స్ షాక్ అయ్యారు. దీనిపై చెన్నై సూపర్ కింగ్స్ యాజమాన్యం బీసీసీఐకి అధికారికంగా ఫిర్యాదు చేసినట్టు ఒక లేఖ కూడా బయటకు వచ్చింది. అయితే, ఆ లేఖ ఏఐ సృష్టించిన ఫేక్ లెటర్ అని తేలినా, చర్చ మాత్రం ఆగలేదు. ఈ వివాదంపై ఐపీఎల్ వ్యవస్థాపక ఛైర్మన్ లలిత్ మోదీ స్పందిస్తూ ఒక పెద్ద బాంబు పేల్చారు. సీఎస్‌కే లేఖ ఫేక్ కావొచ్చు కానీ, ఐపీఎల్‌లో క్షుద్రపూజలు జరగడం మాత్రం పచ్చి నిజమని ఆయన ట్వీట్ చేశారు. “గతంలో ఒక టీమ్ ఓనర్ ప్రత్యర్థి జట్టు డ్రెస్సింగ్ రూమ్‌లో ఇలాంటి పూజలు చేయించిన విషయం నాకు తెలుసు. 2011 సీజన్‌లోనే దీనిపై ఆధారాలతో సహా సదరు టీమ్ ఓనర్లను హెచ్చరించాను” అని మోదీ పేర్కొన్నారు. అంతేకాదు, ఈ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడింది ఎవరో త్వరలో తాను తీయబోయే సినిమా లేదా టీవీ సిరీస్‌లో బయటపెడతానని ఒక క్లిఫ్ హ్యాంగర్ ఇచ్చారు. క్షుద్రపూజల గోల ఇలా ఉంటే, మైదానంలో ఆట మాత్రం జోరుగా సాగుతోంది. శ్రేయస్ అయ్యర్ నేతృత్వంలోని పంజాబ్ కింగ్స్ ప్రస్తుతం 11 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఆరు మ్యాచ్‌ల్లో ఐదు విజయాలతో వారు దుమ్మురేపుతున్నారు. ఇక సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆరు మ్యాచ్‌ల్లో మూడు గెలిచి నాలుగో స్థానంలో ఉండగా.. ఐదుసార్లు ఛాంపియన్ అయిన ముంబై ఇండియన్స్ కేవలం ఒకే విజయంతో పట్టికలో అట్టడుగున ఉండటం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది.



## చెన్నై సూపర్ కింగ్స్ జట్టుకు భారీ ఎదురుదెబ్బ


ఐదుసార్లు ఛాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ జట్టుకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఈ సీజన్‌లో నిలకడగా రాణిస్తున్న యువ బ్యాటర్ ఆయుష్ మాత్ర గాయం కారణంగా ఐపీఎల్ 2026 మొత్తానికి దూరమయ్యాడు. ఈ విషయాన్ని ఫ్రాంచైజీ అధికారికంగా ధృవీకరించడంతో సీఎస్‌కే అభిమానులు తీవ్ర నిరాశకు లోనవుతున్నారు. టోర్నీ కీలక దశకు చేరుకుంటున్న తరుణంలో ఇది జట్టుకు పెద్ద లోటుగా మారింది.ఏప్రిల్ 18న సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన ఉత్కంఠభరిత పోరులో ఆయుష్ మాత్రే బ్యాటింగ్ చేస్తుండగా కండరాల గాయానికి (హ్యామ్‌స్ట్రింగ్) గురయ్యాడు. క్రీజులో పరుగు తీస్తున్న సమయంలో ఒక్కసారిగా కుప్పకూలిన ఆయుష్, నొప్పితో విలవిలలాడుతూ మైదానాన్ని వీడాల్సి వచ్చింది. ప్రాథమిక చికిత్స అనంతరం పరీక్షలు నిర్వహించిన వైద్యులు, గాయం తీవ్రత ఎక్కువగా ఉందని తేల్చారు. చెన్నై సూపర్ కింగ్స్ యాజమాన్యం తమ సామాజిక మాధ్యమ వేదిక ద్వారా ఈ విషయాన్ని వెల్లడించింది. “ఆయుష్ మాత్రే ఎడమ కాలు కండరాల గాయం కారణంగా ఈ సీజన్ నుంచి తప్పుకుంటున్నాడు. అతను కోలుకోవడానికి కనీసం 6 నుంచి 12 వారాల సమయం పడుతుంది. ఈ క్లిష్ట సమయంలో అతనికి అండగా ఉంటాం, ఆయుష్ త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నాం” అని జట్టు యాజమాన్యం పేర్కొంది.ప్రస్తుత సీజన్‌లో రుతురాజ్ గైక్వాడ్, సంజూ శామ్సన్ ఓపెనర్లుగా వస్తుండగా, మూడో స్థానంలో ఆయుష్ మాత్రే నమ్మదగ్గ ఆటగాడిగా ఎదిగాడు. కీలక సమయాల్లో ఇన్నింగ్స్‌ను నిర్మించడంలో అతను పోషించిన పాత్ర అమోఘం. ఇప్పుడు అతను అందుబాటులో లేకపోవడంతో, ఆ స్థానాన్ని భర్తీ చేసే సరైన ఆటగాడి కోసం కెప్టెన్, కోచింగ్ బృందం అన్వేషిస్తోంది. మిడిల్ ఆర్డర్‌లో అనుభవజ్ఞులైన ఆటగాళ్లపై ఇప్పుడు అదనపు భారం పడనుంది. ఆయుష్ స్థానంలో కొత్త ఆటగాడిని తీసుకునే అవకాశంపై సీఎస్‌కే ఇంకా స్పష్టత ఇవ్వలేదు. రీహాబిలిటేషన్ ప్రక్రియ పూర్తి కావడానికి సుమారు మూడు నెలలు పట్టే అవకాశం ఉండటంతో, అతను వచ్చే దేశవాళీ సీజన్ నాటికి సిద్ధమవుతాడని భావిస్తున్నారు. ప్లేఆఫ్స్ రేసులో ఉన్న చెన్నై జట్టుకు, ఈ మార్పులు ఏ మేరకు కలిసి వస్తాయో వేచి చూడాలి.

అక్షరకలం
తెలుగు దినపత్రిక











## పెద్ది మూవీలో శృతి స్పెషల్ డ్యాన్స్

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం 'పెద్ది'కి సంబంధించిన తాజా అప్‌డేట్ టాలీవుడ్‌లో చర్చనీయాంశంగా మారింది. ఈ సినిమాలోని స్పెషల్ సాంగ్ కోసం ప్రముఖ హీరోయిన్ శృతి హాసన్‌ని ఎంపిక చేసినట్లు సమాచారం. ఇప్పటికే పలువురు హీరోయిన్ల పేర్లు వినిపించినా? చివరకు ఈ అవకాశాన్ని శృతి హాసన్ దక్కించుకున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఈ స్పెషల్ సాంగ్ షూటింగ్ త్వరలోనే ప్రారంభమై, తక్కువ సమయంలో పూర్తయ్యేలా చిత్ర యూనిట్ ఎ÷-లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. సినిమాకు హైలైట్‌గా నిలిచే ఈ పాటలో శృతి హాసన్ గ్లామర్, స్టెప్పులు ప్రత్యేక ఆకర్షణగా ఉండబోతున్నాయని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇక శృతి హాసన్‌కు స్పెషల్ సాంగ్స్ కొత్తేమీ కాదు. గతంలోనే రామ్ చరణ్‌తో కలిసి 'ఎవడు' సినిమాలో 'పింపుల్ డింపుల్' పాటలో సందడి చేసిన విషయం తెలిసిందే. అలాగే మహేశ్ బాబు నటించిన 'ఆగడు' సినిమాలో కూడా ఆమె ప్రత్యేక గీతంలో మెరిసి ప్రేక్షకులను అలరించింది. ఇప్పుడు 'పెద్ది'లో మరోసారి స్పెషల్ సాంగ్‌తో రాబోతుండటంతో అభిమానుల్లో ఆసక్తి పెరిగింది. ఇప్పటికే ఈ సినిమా పై భారీ అంచనాలు ఉండగా? శృతి హాసన్ ఎంట్రీతో మరింత హైప్ పెరిగే అవకాశముంది.ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న 'పెద్ది' సినిమా నుంచి త్వరలోనే ఈ స్పెషల్ సాంగ్‌పై అధికారిక ప్రకటన వచ్చే అవకాశముంది. ఈ పాట ఎలా ఉండబోతుందో? శృతి హాసన్ ఏ రేంజ్‌లో ఆకట్టుకుంటుందో చూడాలని ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. 'ఉప్పెన' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత బుచ్చిబాబు తెరకెక్కిస్తున్న చిత్రం పెద్ది కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇందులో రామ్ చరణ్ సరసన బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఆమె తెలుగులో చేస్తున్న కీలక ప్రాజెక్టుల్లో ఇది ఒకటిగా నిలుస్తోంది.

## సల్మాన్, వంశీపైడిపల్ల మూవీకి క్లాప్

బాలీవుడ్ సూపర్ స్టార్ సల్మాన్ ఖాన్, టాలీవుడ్ సెన్సేషనల్ డైరెక్టర్ వంశీ పైడిపల్లి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ ప్రాజెక్ట్ ఎస్‌వి63 ముంబైలో ఘనంగా ప్రారంభమైంది. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై స్టార్ ప్రొడ్యూసర్ దిల్ రాజు నిర్మిస్తున్న ఈ సినిమాకు సంబంధించిన అధికారిక వీడియోను చిత్ర యూనిట్ విడుదల చేసింది. దిల్ రాజు, శిరీష్ ఈ చిత్రాన్ని అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఇది సల్మాన్ ఖాన్ కెరీర్‌లోనే ఒక ప్రత్యేకమైన యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఉండబోతోందని సమాచారం. ఇక మొదటిసారి సల్మాన్ ఖాన్‌ను వంశీ పైడిపల్లి డైరెక్ట్ చేస్తుండటంతో అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ఇందులో లేడీ సూపర్ స్టార్ నయనతార హీరోయిన్‌గా నటిస్తోంది.







## సిటాడెల్-2 సీజన్‌లో ప్రియాంక చోప్రా

గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా, హాలీవుడ్ నటుడు రిచర్డ్ మాడెన్ ప్రధాన పాత్రల్లో నటించిన యాక్షన్ స్పై థ్రిల్లర్ సిరీస్ 'సిటాడెల్' రెండో సీజన్‌కు సంబంధించి అదిరిపోయే అప్‌డేట్ వచ్చేసింది. అమెజాన్ ప్రైమ్ వీడియో ఈ సిరీస్ అధికారిక ట్రైలర్‌ను విడుదల చేస్తూ.. ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న స్ట్రీమింగ్ తేదీని ప్రకటించింది. ఈ సిరీస్‌ను మే 6 నుంచి స్ట్రీమింగ్ చేయబోతున్నట్లు ప్రకటించింది. ఇంగ్లీష్‌తో పాటు తెలుగు, హిందీ, తమిళం, మలయాళ భాషల్లో ఈ సిరీస్ అందుబాటులోకి రాబోతోంది. ఈ రెండో సీజన్ ట్రైలర్ గమనిస్తే.. ఫస్ట్ పార్ట్ కంటే ఇందులో మరింత యాక్షన్ ఉండబోతున్నట్లు తెలుస్తుంది. నాడియా సిన్ (ప్రియాంక), మేసన్ కేన్ (రిచర్డ్) మరియు బెర్నార్డ్ ఓర్లిక్ (స్టాన్లీ టుచి) తమ గతాన్ని గుర్తుకు తెచ్చుకుంటూనే, సిటాడెల్ సంస్థను నాశనం చేసిన క్రూరమైన 'మాంటికోర్' నెట్‌వర్క్ నుంచి ప్రపంచాన్ని రక్షించే భారీ మిషన్‌లో తలపడబోతున్నారు. హాలీవుడ్ ప్రముఖులు జాక్ రేనర్, మ్యాట్ బెర్రీ వంటి వారు కొత్తగా ఈ సీజన్‌లో భాగం కాగా, రూసో బ్రదర్స్ నిర్మాణ విలువలు ఈ సిరీస్‌ను మరో స్థాయికి తీసుకెళ్లాయి. ప్రస్తుతం రాజమౌళి ? మహేష్ బాబు కాంబినేషన్‌లో వస్తున్న 'వారణాసి' సినిమా షూటింగ్‌లో ప్రియాంక స్థాయిలో మరోసారి తన సత్తా చాటడానికి సిద్ధమైంది.

అక్షరకలం
తెలుగు దినపత్రిక
నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి

# ఆర్టీసీ కార్మికుల న్యాయబద్ధమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి

## ఆర్టీసీ కార్మికుల సమ్మె కు బి. ఎస్ .పి. సంపూర్ణ మద్దతు

యాదాద్రి భువనగిరి అక్షర కలం

బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు శుక్రవారం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కార్మికులు యాదగిరిగుట్ట లో చేపట్టిన ధర్నా కి యాదాద్రి భువనగిరి జిల్లా బీ ఎస్ పి పార్టీ సంపూర్ణ మద్దతు తెలియజేసింది. ఈ సందర్భంగా నాయకులు ధర్నా లో పాల్గొని, అమరుడైన ఆర్టీసీ కార్మికుడు శంకర్ గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం బీ ఎస్ పి రాష్ట్ర మాజీ కార్యదర్శి బట్టు రామచంద్రయ్య మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల హక్కుల సాధనకై శంకర్ గౌడ్ ఆత్మహుతి చేసుకోవడం బాధాకరమన్నారు. శంకర్ గౌడ్ మరణం ప్రభుత్వం చేసిన హత్య గా మేము భావిస్తున్నామన్నారు. ప్రభుత్వం యొక్క అసమర్థతే కార్మికుల చావులకు కారణమన్నారు. ఎన్నికల సమయం లో ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలని లేదా సీఎం రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. చనిపోయిన శంకర్ గౌడ్ కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను సత్వరమే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా కార్యదర్శి మొరిగాడి శ్రీశైలం గౌడ్, జిల్లా కమిటీ సభ్యులు వడ్డేపల్లి దాస్ , భువనగిరి నియోజకవర్గం అధ్యక్షుడు బండారు జహంగీర్ , ఆలేరు కౌన్సిలర్ అభ్యర్థి అలుగుల శ్రీనివాస్, అలుగుల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు .



# డయాబెటిస్ రోగులకు 'మంచి వార్త'

కాలు తీసే పరిస్థితి రాకుండా కాపాడుకోవచ్చు

ప్రముఖ వాస్క్యులర్ సర్జన్ డాక్టర్ వినయ్ కుమార్




అక్షరకలం నల్గొండ

డయాబెటిస్ (చక్కెర వ్యాధి) ఉన్నవారిని వేధించే ప్రధాన సమస్యల్లో పెరిఫెరల్ ఆర్టీరియల్ డిసీజ్ (పి ఏ డి ) ఒకటి. దీనిపై అవగాహన కల్పించేందుకు యశోద హాస్పిటల్స్ (సికింద్రాబాద్) ప్రముఖ వాస్క్యులర్ సర్జన్ డాక్టర్ వినయ్ కుమార్ శుక్రవారం నల్లగొండలో ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాళ్లకు, పాదాలకు రక్తాన్ని తీసుకెళ్లే రక్తనాళాలు పూడుకుపోవడం లేదా ఇరుకుగా మారడం వల్ల రక్తప్రసరణ తగ్గిపోవడాన్ని పి.ఏ.డి అంటారు. డయాబెటిస్ ఉన్నవారిలో ఈ సమస్య మరీ ఎక్కువగా ఉంటుందని తెలిపారు.

-లక్షణాలు ఇవే..
నడిచేటప్పుడు కాళ్లలో విపరీతమైన నొప్పి రావడం.
కాళ్లు త్వరగా అలసిపోవడం.
పాదాలు ఎప్పుడూ చల్లగా ఉండటం.
చిన్న గాయాలు అయినా త్వరగా మానకపోవడం.
కాలి వేళ్లు నల్లబడటం (గ్యాంగ్రీన్ సూచన).

డయాబెటిస్ వల్ల నరాలు దెబ్బతినడం (చీవబతీశీజూఖ్థ్రవ) కారణంగా, కొందరికి కాళ్లలో రక్తప్రసరణ తగ్గినా కనీసం నొప్పి కూడా తెలియదు. ఇది మరింత ప్రమాదకరమని వెల్లడించారు. రక్తంలో చక్కెర శాతాన్ని ఎప్పుడూ అదుపులో ఉంచుకోవాలి. పొగతాగే అలవాటు ఉంటే వెంటనే మానేయాలి, ఇది రక్తనాళాలను మరింత దెబ్బతీస్తుంది. ప్రతిరోజూ రాత్రి పడుకునే ముందు పాదాలను స్వయంగా పరీక్షించుకోవాలి. ఎక్కడైనా ఎరుపుదనం లేదా చిన్న పుండు ఉన్నా నిర్లక్ష్యం చేయకూడదు. డాప్లర్ స్కాన్ వంటి చిన్న పరీక్షల ద్వారా రక్తప్రసరణ స్థితిని ముందే తెలుసుకోవచ్చు అని తెలిపారు. అవసరమైతే మందులు లేదా యాంజియోప్లాస్టీ ద్వారా మూసుకుపోయిన రక్తనాళాలను తెరిచి, కాలు తీసివేసే (ూఎజూఖ్ఖఅశీఅ) ప్రమాదం నుంచి బయటపడవచ్చు.నల్లగొండ జిల్లా వాసుల సౌకర్యార్థం డాక్టర్ వినయ్ కుమార్ ప్రతి నెల ప్రత్యేక ఓపి (ఒపీ ) నిర్వహిస్తున్నారు. ప్రతి నెల 3వ బుధవారం
ఉదయం 10:00 నుండి సాయంత్రం 5:00 వరకు
ఐకాన్ హాస్పిటల్, నల్లగొండ నందు అందుబాటులో ఉంటున్నట్లు పేర్కొన్నారు. ఈ సదుపాయాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని యశోద హాస్పిటల్స్ మార్కెటింగ్ మేనేజర్ కోక ప్రవీణ్ కుమార్, సహాయ మేనేజర్ ఈ. సురేష్ కోరారు.

# శ్రీ లక్ష్మి నర్సింహ స్వామిని దర్శించుకున్న ఐపిఎస్ అధికారి సజ్జన్నార్

## డీజీపీ గా పదోన్నతి లభించిన సందర్భంగా స్వామి వారికి మొక్కులు తీర్చుకున్న సజ్జన్నార్

యాదాద్రి భువనగిరి అక్షర కలం

తెలంగాణ రాష్ట్రం లో పేరుగాంచిన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారిని, తెలంగాణ ఐపిఎస్ అధికారి విశ్వనాథ్ చెన్నప్ప సజ్జన్నార్ (వి. సి. సజ్జన్నార్) శుక్రవారం కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. 1995 బ్యాచ్ కు చెందిన వి. సీ. సజ్జన్నార్, ప్రస్తుతం హైదరాబాద్ సిటీ పోలీస్ కమీషనర్ గా పని చేస్తున్నారు . ఇటీవలే సజ్జన్నార్ కు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం డీజీపీ హోదాను కల్పించింది . ఈ సందర్భంగా సజ్జన్నార్ కుటుంబ సభ్యులతో కలిసి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.



# ఆర్టీసీ కార్మికుల సమ్మె.. వివిధ పార్టీల నాయకుల మద్దతు..మాజీ ఎమ్మెల్యే భాస్కర్ రావు



మిర్యాలగూడ అక్షర కలం

మిర్యాలగూడలో ఆర్టిసి కార్మికుల సమ్మె శుక్రవారం మూడో రోజు నిర్వహించారు. డిపో ప్రధాన గేటు వద్ద ధర్నా నిర్వహించారు. వివిధ పార్టీల నాయకులు సంఘీభావం తెలిపారు. సంఘీభావం తెలిపిన వారిలో మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు, తిప్పన విజయసింహారెడ్డి, సిపిఐ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు, సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికారి మల్లేష్, ఎం సిపిఐయు పార్టీ రాష్ట్ర నాయకులు వసుకుల మట్టయ్య,బీ ఆర్ ఎస్ నాయకులు ఎడవెల్లి శ్రీనివాస్ రెడ్డి, గాయస్, చిట్టి బాబు, ఈశ్వరచారి, సిపిఐ పార్టీ మండల కార్యదర్శి అంజన్న, రామలింగం, సాలె జగన్, ఎం సి పి యు జిల్లా నాయకులు పోతుగంటి కాశి, వసుకుల కిరణ్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ఆర్టీసీ కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వ వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

# శంకర్ గౌడ్ మరణించిన రోజును 'అపాయింటెడ్ డే'గా ప్రకటించాలి: జనసేన నాయకుడు చందు నాయక్

అక్షరకలం దేవరకొండ



దేవరకొండ: ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ ఆత్మబలిదానం అత్యంత విచారకరమని, ఆయన మృతికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని జనసేన పార్టీ సీనియర్ నాయకులు చందు నాయక్ విమర్శించారు. శంకర్ గౌడ్ మృతికి సంతాపం తెలుపుతూ ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.సంస్థ కోసం ప్రాణత్యాగం చేసిన శంకర్ గౌడ్ స్మారకార్థం, ఆయన అమరుడైన రోజును 'అపాయింటెడ్ డే'గా ప్రకటించి ప్రభుత్వం గౌరవించాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి రాగానే ఆర్టీసీ విలీనం చేస్తామని, సమస్యలు తీరుస్తామని చెప్పి మాట తప్పడం వల్లే కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారని ధ్వజమెత్తారు.తెలంగాణ ఆర్టీసీ కార్మికుల గోసను పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లి, కార్మికులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.కార్మికులు ఎవరూ ఆత్మబలిదానాలకు పాల్పడవద్దని, కలిసికట్టుగా పోరాడి హక్కులు సాధించుకుందామని ఆయన పిలుపునిచ్చారు.

# శంకర్ గౌడ్ మృతి ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే: మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్

అక్షరకలం దేవరకొండ:



నర్సంపేటలో ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ ఆత్మహత్య చేసుకోవడం అత్యంత బాధాకరమని, ఇది ఆత్మహత్య కాదు.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేసిన 'ముమ్మాటికీ హత్యే' అని బీఆర్ఎస్ నల్గొండ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ ధ్వజమెత్తారు. శుక్రవారం దేవరకొండలో ఆయన మీడియాతో మాట్లాడారు.కుటుంబ పెద్దను కోల్పోయిన శంకర్ గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం రూ. 1 కోటి పరిహారం చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. 40 రోజుల ముందే సమ్మె నోటీసు ఇచ్చినా స్పందించకపోవడం వల్లే కార్మికులు ప్రాణాలు తీసుకుంటున్నారని, ఈ మరణాలకు ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఒక్క హామీని కూడా నెరవేర్చకుండా రేవంత్ సర్కారు ఆర్టీసీ కార్మికులను వంచిస్తోందని విమర్శించారు. ఒకే రోజు ముగ్గురు కార్మికులు ఆత్మహత్యాయత్నం చేయడం తెలంగాణ చరిత్రలో చీకటి రోజని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ఆర్టీసీ కార్మికులు ఎవరూ మనోధైర్యం కోల్పోవద్దని, బీఆర్ఎస్ పార్టీ కార్మికులకు అండగా ఉండి పోరాడుతుందని రవీంద్ర కుమార్ స్పష్టం చేశారు.

# బోర్డర్ చెక్‌పోస్టుల ఏర్పాటు: జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ,

(అక్షర కలం, నారాయణపేట జిల్లా రిపోర్టర్, ఏప్రిల్,24)




యాసంగి (రబీ) సీజన్‌లో వరి కొనుగోళ్ల సందర్భంగా పొరుగు రాష్ట్రాల నుండి తెలంగాణ రాష్ట్రానికి వరి ధాన్యం అక్రమంగా రాకుండా, అలాగే రాష్ట్రంలోన పిడిఎస్/ సిఎంఆర్ బియ్యం ఇతర రాష్ట్రాలకు తరలింపును నిరోధించేందుకు నారాయణపేట జిల్లా పరిధిలో మొత్తం 06 బోర్డర్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ తెలిపారు.

# ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాలని పీడీకి వినతి



అక్షరకలం దేవరకొండ

ఉపాధి హామీ పథకంలో ఇనాక్టివ్‌గా ఉన్న జాబ్ కార్డులను వెంటనే పునరుద్ధరించాలని, రెండు పూటల ఫోటోల విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా డిఆర్‌డిఓ శేఖర్ రెడ్డి కి వినతిపత్రం సమర్పించారు. చందంపేట మండలం మూడు దండ్ల గ్రామంలో ఉపాధి పనులను పీడీ పరిశీలించిన సందర్భంగా కంబాలపల్లి ఆనంద్ ఆధ్వర్యంలో కూలీలు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.సాఫ్ట్‌వేర్ సమస్యల వల్ల రెండు పూటల ఫోటోలు అప్‌లోడ్ కాక కూలీలు నష్టపోతున్నారని, పాత పద్ధతినే కొనసాగించాలని కోరారు.ఎండ తీవ్రత దృష్ట్యా పని ప్రదేశంలో టెంటు, మంచినీరు, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలని విన్నవించారు.రోజువారీ కూలీని రూ. 800లకు పెంచాలని, ఏడాదికి 200 రోజుల పని కల్పించాలని డిమాండ్ చేశారు.పని ప్రదేశం దూరాన్ని 5 కిలోమీటర్ల నుండి 3 కిలోమీటర్లకు తగ్గించాలని, పనిముట్లు (పారలు, గడ్డపారలు) ప్రభుత్వం సరఫరా చేయాలని కోరారు. కూలీల విజ్ఞప్తిపై పీడీ సానుకూలంగా స్పందిస్తూ, సమస్యల పరిష్కారానికి సంబంధిత ఎంపీడీఓలకు తక్షణ ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు కావలి కృష్ణయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ కృష్ణయ్య, మెట్లు కృష్ణారెడ్డి, జంగారెడ్డి, కేశవ పాల్గొన్నారు.

# త్రై- బజార్ పై అబద్ధపు ప్రచారాలు మానుకోవాలి

--టెండర్ దక్కలేదని అక్కసు తోనే ఆరోపణలు

--అవినీతి, అక్రమాలపై బహిరంగ విచారణకు సిద్ధం

యాదాద్రి భువనగిరి అక్షర కలం



గత కొన్ని ఏళ్లుగా భువనగిరి త్రై- బజార్ టెండర్ లో సిండికేటై , మున్సిపల్ ఆదాయానికి పెద్ద మొత్తంలో నష్టం చేసిన వారికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు గుమిడెల్లి రమేష్ అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. భువనగిరి మున్సిపల్ త్రై- బజార్ వేలం ప్రక్రియను మున్సిపల్ అధికారులు ప్రతి సంవత్సరం నోటిఫికేషన్ జారీ చేసి, టెండర్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తారని , కానీ కొన్ని సంవత్సరాలుగా కొందరు స్వార్థ రాజకీయ నాయకుల అండదండలతో టెండర్ ప్రక్రియ లో "సిండికేట్లు" గా మారి మున్సిపల్ ఆదాయానికి భారీ మొత్తంలో నష్టం కలిగించారని ఆయన అన్నారు. గత(2025బి 26) సంవత్సరంలో కేవలం 8 లక్షల 70 వేలకు టెండర్ దక్కించుకున్నారు. గత సంవత్సరం టెండర్ పొందిన వారు ఈసారి కూడా టెండర్ లో పాల్గొనడం జరిగింది. కానీ ఈసారి రూపాయల 12 లక్షలకు టెండర్ వేసి భువనగిరి మున్సిపాలిటీ కి ఆర్థికంగా అండగా నిలిచిన నూతన యాజమాన్యం పై అసత్య ఆరోపణలు చేయడం, త్రై- బజార్ లో పని చేసే సిబ్బందిని బెదిరించడం, సిబ్బందిని పనికి రాకుండా చేస్తున్నారని ఆయన అన్నారు. త్రై- బజార్ లో అవినీతి, అక్రమాలపై బహిరంగ చర్చకు సిద్ధంగా ఉండాలని ఆయన సూచించారు. అసత్య ప్రచారాలు మానుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు.

# ఆర్టీసీ కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలి

అక్షరకలం దేవరకొండ




తెలంగాణ ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేని పక్షంలో మరో భారీ ఉద్యమం తప్పదని జాతీయ బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి, సామాజికవేత్త డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. దేవరకొండ పట్టణంలో ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన మూడవ రోజు నిరసన ర్యాలీలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరంగల్ జిల్లా నర్సంపేట డిపో డ్రైవర్ శంకర్ గౌడ్ ఆత్మహత్య చేసుకోవడం అత్యంత బాధాకరమని, ఇది ప్రభుత్వ హత్యేనని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీలైన ఆర్టీసీ విలీనం, నూతన పీఆర్సీ ప్రకటన, కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ వంటి అంశాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడకుండా, సమస్యలపై ధైర్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ ఇరుగదిండ్ల శ్రీను, వైస్ చైర్మన్ ఓరుగంటి రమేష్ గౌడ్, రెడ్డి కోటేశ్వరరావు, గడ్డం రాజేందర్ గౌడ్, నాగమణి, యాదమ్మ, పుష్పలత, సుస్మిత, పున్న బిక్షమయ్య, యాదయ్య చారి, విజయమ్మ, రంజాన్ బేక్, చెరుకు అంజి తదితరులు పాల్గొన్నారు.

అక్షర కలం
తెలుగు దినపత్రిక
నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి

# చర్చలతోనే "సమస్యల" పరిష్కారం

## మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి

ఆర్టీసీ సమ్మె విరమించి ప్రజల పక్షాన ఆలోచించాలి

ఆర్టీసీ ఉద్యోగి శంకరయ్య ప్రాణాత్యాగం బాధాకరం

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

తాలు సమస్యపై అప్రమత్తత అవసరం

రైతుబంధు, బోనస్‌లలో ఏదో ఒక పథకాన్ని సంపూర్ణంగా అమలు చేయాలి

మీడియా సమావేశం శాసన మండలి చైర్మన్

ఉమ్మడి నల్లగొండ బ్యూరో అక్షరకలం

తెలంగాణ రాష్ట్ర శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి శుక్రవారం నల్గొండలోని తన క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆర్టీసీ సమ్మె, ధాన్యం కొనుగోళ్లు, రైతు సంక్షేమ పథకాలు, తాజా రాజకీయ పరిణామాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఆర్టీసీ కార్మికులు, ప్రభుత్వం పట్టుదలకు పోకుండా ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సమ్మె విరమించే



దిశగా ఆలోచన చేయాలని ఆయన కోరారు. సమస్యలు కేవలం చర్చల ద్వారానే పరిష్కారమవుతాయని ఆయన స్పష్టం చేశారు. ఇటీవల ఆర్టీసీ కార్మికుడు శంకరయ్య గౌడ్ ఆత్మహత్య చేసుకోవడం పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆత్మహత్యలు సమస్యకు పరిష్కారం కావని, దీనివల్ల కుటుంబాలే తీరని నష్టానికి గురవుతాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

### రైతు సంక్షేమం - ధాన్యం కొనుగోళ్లు...

యాసంగి ధాన్యం కొనుగోళ్లు వేగంగా సాగుతున్నాయని, అయితే ఈసారి 'తాలు' సమస్య ప్రధాన ఇబ్బందిగా మారిందని గుత్తా పేర్కొన్నారు. విత్తనాల (సీడ్స్) లోపం వల్లే ఈ తాలు సమస్య వస్తున్నట్లు అధికారులు గుర్తించారని తెలిపారు. అకాల వర్షాల ముప్పు పొంచి ఉన్నందున, రైతులు నష్టపోకుండా ధాన్యాన్ని మిల్లులకు తరలించే ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని అధికారులను కోరారు.

### -రైతుబంధు, బోనస్‌పై సూచన..

రైతుబంధు అందలేదనే అసంతృప్తి రైతాంగంలో ఉందని ఆయన గుర్తు చేశారు. రైతుబంధు, సన్నాలకు బోనస్.. ఈ రెండింటి వల్ల ప్రభుత్వంపై ఆర్థిక భారం పడుతున్న మాట వాస్తవమేనని, అందుకే ఈ రెండింటిలో రైతులకు ఏది ఎక్కువ మేలు చేస్తుందో ఆలోచించి, ఏదో ఒక పథకాన్ని సంపూర్ణంగా అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇతర రాష్ట్రాల రైతులు తెలంగాణలో ధాన్యం విక్రయించడం వల్ల స్థానిక రైతులకు నష్టం జరుగుతోందని, దీనిపై దృష్టి సారించాలని సూచించారు.

### కేంద్రం తీరు - రాజకీయ విమర్శలు..

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ధాన్యం కొనుగోలు విషయంలో కేంద్ర సహాయం కోరినప్పటికీ, కేంద్ర ప్రభుత్వం నుంచి ఆశించిన స్పందన లేకపోవడం దురదృష్టకరమన్నారు. ప్రతిపక్షాలు వాస్తవాలను విస్మరించి రాజకీయం చేయడం, ప్రజలను రెచ్చగొట్టడం సరికాదని హితవు పలికారు. కాళేశ్వరం ప్రాజెక్టు, పీసీ ఘోష్ కమిషన్ విషయంలో హైకోర్టు ఎవరికీ క్లీన్ చిట్ ఇవ్వలేదని, కేవలం సెక్షన్ 8 ప్రకారం నోటీసులు ఇవ్వనందున ప్రస్తుతానికి చర్యలు వద్దని మాత్రమే తెలిపిందని స్పష్టం చేశారు. చివరగా, యువత రాజకీయాల్లోకి రావాలని, వారికి మరిన్ని అవకాశాలు దక్కాలని తాను ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. తన రాజకీయ భవిష్యత్తు, పోటీకి సంబంధించి అప్పటి పరిస్థితులను బట్టి నిర్ణయం తీసుకుంటానని గుత్తా సుఖేందర్ రెడ్డి వెల్లడించారు.

# నేడు భువనగిరి లో డి లిమిటేషన్ పై చర్చ గోష్టి

యాదాద్రి భువనగిరి అక్షర కలం

కేంద్ర ప్రభుత్వం ఇటీవల పార్లమెంట్ లో ప్రవేశపెట్టిన "డి లిమిటేషన్ బిల్లు" అంశం పై భువనగిరి సుందరయ్య భవన్, విజ్ఞాన కేంద్రంలో (ఈనెల 25) శనివారం, సాయంత్రం 4 గంటలకు పీ. ఎస్. అధ్యయన వేదిక ఆధ్వర్యంలో చర్చా గోష్టి జరుగుతుందని నిర్వాహకులు కల్లూరి మల్లేశం ఒక ప్రకటనలో తెలిపారు. భువనగిరి పట్టణంలోని మేథావులు, ప్రజాస్వామ్య వాదులు, ప్రజా సంఘాల నాయకులు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సకాలంలో హాజరై డి లిమిటేషన్ పై అవగాహన పెంచుకోవాలని ఆయన కోరారు. పూర్తి వివరాలకు ఫోన్ నెంబర్ 99124 38221 ను సంప్రదించాలని ఆయన సూచించారు.

# ఆర్టీసీ కార్మికులు మనోధైర్యాన్ని కోల్పోవద్దు:కాసాల వెంకట్ రెడ్డి

## డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి పట్ల సంతాపం..

అక్షరకలం, చండూరు



ఆర్టీసీ ఉద్యోగులు ఆందోళన చెంది ఆత్మహత్యల వంటి తీవ్ర నిర్ణయాలు తీసుకోవద్దని, తమ న్యాయబద్ధమైన హక్కుల కోసం చట్టబద్ధంగా పోరాడి సాధించుకోవాలని భారతీయ జనతా కిసాన్ మోర్చా నల్గొండ జిల్లా ఉపాధ్యక్షులు కాసాల వెంకట్ రెడ్డి పిలుపునిచ్చారు. వరంగల్ జిల్లాలో ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి చెందిన ఘటన అత్యంత బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అహోరాత్రులు శ్రమిస్తూ ప్రజలకు సేవలందించే ఆర్టీసీ ఉద్యోగుల పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూడటం తగదని, వారి కష్టనష్టాలను గుర్తించి న్యాయబద్ధమైన డిమాండ్లను తక్షణమే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్మికులు ఎవరూ కూడా మనోధైర్యాన్ని కోల్పోవద్దని, పోరాట మార్గంలోనే విజయం సాధించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ప్రాణం కాపాడిన 'మాచన' మానవత్వం

## వడదెబ్బతో పడిపోయిన వ్యక్తికి సపర్యలు చేసిన సివిల్ సప్లైస్ డిటి రఘునందన్

అక్షరకలం, చండూరు



మునుగోడు-నల్లగొండ ప్రధాన రహదారిపై బుధవారం మధ్యాహ్నం పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిటి మాచన రఘునందన్ తన మానవత్వాన్ని చాటుకున్నారు. ధాన్యం సేకరణ కేంద్రాల తనిఖీ నిమిత్తం మునుగోడు వెళ్తున్న ఆయనకు, గుడాపూర్ సమీపంలో ఎండ తీవ్రతకు స్పృహ తప్పి రోడ్డు పక్కన పడి ఉన్న ఓ వ్యక్తి కనిపించాడు. వెంటనే స్పందించిన డిటి, వాహనాన్ని ఆపి బాధితుడి పరిస్థితిని గమనించారు. శ్వాస ఆడుతున్నా మాట్లాడలేని స్థితిలో ఉన్న సదరు వ్యక్తికి ప్రాథమిక చికిత్స అందించేందుకు హైదరాబాద్‌లోని తనకు తెలిసిన వైద్యునితో ఫోన్లో సంప్రదించారు. వైద్యుని సూచన మేరకు తన వద్ద ఉన్న ఉప్పు, చక్కెర కలిపిన నీటిని బాధితుడికి తాగించి సేదతీర్చారు. కాసేపటికి కోలుకున్న ఆ వ్యక్తి తన పేరు సైదులు అని, పులిపలుపుల గ్రామం నుండి నల్లగొండకు పని మీద వెళ్తున్నానని తెలిపాడు. అనంతరం అతనికి పండ్లు తినిపించి, పూర్తిస్థాయి చికిత్స కోసం ఒక ఆటోను మాట్లాడి స్వయంగా ప్రభుత్వ ఆసుపత్రికి పంపించి రఘునందన్ తన ఉదారతను చాటుకున్నారు. సమయస్ఫూర్తితో వ్యవహరించి ఒక ప్రాణాన్ని కాపాడిన అధికారిపై స్థానికులు ప్రశంసలు కురిపిస్తున్నారు.

# వడ్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన ఏఎంసి చైర్మన్ మీసం మహేందర్ యాదవ్

కొనుగోలు లో జాప్యం చేయొద్దు

అక్షర కలం సిద్దిపేట ఏప్రిల్ 24:

ఈ రోజు చిన్నకోడూరు మండలం మెట్ పల్లీ, మల్యాల, చంద్లపూర్ గ్రామాల్లో వడ్ల కొనుగోలు కేంద్రలు ప్రారంభించిన ఏఎంసి చైర్మన్ మీసం మహేందర్ యాదవ్ ఆయా గ్రామాల సర్పంచ్లతో కలిసి రిబ్బన్ కట్ చేసి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొనుగోలు లో ఎలాంటి జాప్యం జరుగకుండా చూసుకోవాలని అధికారుల ను అదేశించారు అంతేకాకుండా వర్షలు పడుతున్న సందర్భంగా వెంట వెంటనే రైతులకు టార్పాలిన్ కవర్లు అందజేయాలన్నారు. అనంతరం చిన్నకోడూరు రైతులతో కలిసి కొనుగోలు సెంటర్ ను పర్షిలించారు ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, సూర గోని శేఖర్ గౌడ్, రఘు, తిరుపతి రెడ్డి ఉప సర్పంచ్ లు కన్నా రెడ్డి, మహేష్, రాజి రెడ్డి మరియు వార్డ్ మెంబర్లు డైరెక్టర్లు వినోద్, రాజ వర్ధన్ రెడ్డి, మహేందర్ రెడ్డి, విజయ్ కుమార్, భూపతి రెడ్డి, దేవరాయల చంద్రశేఖర్, ఎండి సలీం, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు సందబోయిన పరుశురాం ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ పొన్నాల రాజేష్, మహిళా విభాగం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎదుగాని లహరి, యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ ఉడుత ప్రశాంత్, గ్రామ శాఖ అధ్యక్షులు గొట్టిపర్తి చందు, జక్కుల నాగరాజు, కొరిమి రాజు తదితరులు పాల్గొన్నారు.



# ఆర్టీసీ కార్మికుల సమ్మెకు సీపీఎం సంపూర్ణ మద్దతు

## కాంగ్రెస్ ప్రభుత్వం మొండివైఖరి వీడాలి

నల్గొండ జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి

కార్మికులు తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దు అని విజ్ఞప్తి

ఉమ్మడి నల్లగొండ బ్యూరో అక్షరకలం

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం కొనసాగుతున్న సమ్మెకు సీపీఐ(ఎం) నల్గొండ జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి ఒక ప్రకటన లో తెలిపారు. ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం, ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీ, బకాయి వేతనాల చెల్లింపు, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికుల క్రమబద్ధీకరణ వంటి 32 డిమాండ్ల పరిష్కారం కోసం కార్మికులు పోరాడుతుంటే, ప్రభుత్వం ఐఏఎస్ అధికారుల కమిటీ పేరుతో కాలయాపన చేస్తోందని విమర్శించారు. నాలుగు వారాల సమయం కోరడం అనేది సమ్మెను నీరుగార్చే ప్రయత్నమేనని ఆయన దుయ్యబట్టారు.

### ఎన్నికల వాగ్దానాలు ఏమయ్యాయి.



ఎన్నికల సమయంలో ఆర్టీసీని పరిరక్షిస్తామని, సంస్థను విలీనం చేసి ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తామని ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని వీరారెడ్డి గుర్తుచేశారు. రిటైర్ అయిన ఉద్యోగులకు రావాల్సిన రూ. 6,000 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేసి, ఆ కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మహిళలకు ఉచిత ప్రయాణ పథకాన్ని విజయవంతం చేసి ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చిన కార్మికుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం తగదని హితవు పలికారు.

### ప్రైవేటీకరణ కుట్రను ఛేదించాలి..

అద్దె బస్సుల ముసుగులో సంస్థను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టే ప్రయత్నం జరుగుతోందని ఆయన ఆరోపించారు. ఎలక్ట్రిక్ బస్సుల పేరుతో ఉన్న బస్సులను స్క్రాప్‌కు పంపిస్తూ, సంస్థను నిర్వీర్యం చేయాలని చూస్తున్నారని విమర్శించారు. కొత్తగా వచ్చే ఎలక్ట్రిక్ బస్సులను కూడా ఆర్టీసీ యాజమాన్యమే నడిపేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### అణిచివేత ధోరణి వీడాలి...

'ప్రజా పాలన" అని చెప్పుకుంటున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం, పోలీసు నిర్బంధంతో ప్రజా ఉద్యమాలను అణిచివేయాలని చూడటం దుర్మార్గమని వీరారెడ్డి అన్నారు. కార్మిక హక్కులపై దాడి చేస్తూ, ప్రయాణికులను కార్మికులకు వ్యతిరేకంగా రెచ్చగొట్టడం ప్రభుత్వానికి తగదు. వెంటనే కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికలు నిర్వహించి, ప్రజాస్వామ్య పద్ధతిలో సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

### కార్మికులకు పిలుపు...

సమ్మెను శాంతియుతంగా, ఐక్యంగా కొనసాగించాలని తుమ్మల వీరారెడ్డి కార్మికులకు పిలుపునిచ్చారు. ఎలాంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని, ఆత్మహత్యలకు పాల్పడి కుటుంబాలను రోడ్డున పడేయవద్దని ఆయన ఆవేదనతో కోరారు. ప్రభుత్వం వెంటనే జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేసి, చర్చల ద్వారా కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలని సీపీఐ(ఎం) డిమాండ్ చేస్తోందని ఆయన స్పష్టం చేశారు.

# కోటకొండ లో పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా గ్రామ సభ

(అక్షర కలం, నారాయణపేట జిల్లా రిపోర్టర్, ఏప్రిల్,24)

జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా ఈరోజు కోటకొండ గ్రామంలో గ్రామ సర్పంచ్ వెంకట రాములు గౌడ్ గారి అధ్యక్షతన, గ్రామ కార్యదర్శి చాణుక్య రెడ్డి ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించుకోవడం జరిగింది. ఈ గ్రామ సభలో పంచాయతీరాజ్ వ్యవస్థ నిర్మాణం గురించి, ప్రజాస్వామ్య వికేంద్రీకరణ గురించి, ప్రజల భాగస్వామ్యం, పారదర్శకత, బాధ్యతాయుత పరిపాలన గురించి, సమగ్ర సుస్థిరమైన గ్రామ అభివృద్ధి గురించి, గ్రామస్థాయిలో అభివృద్ధి ప్రణాళికను ఏర్పాటు చేసుకోవడం గురించి, బలమైన గ్రామపంచాయతీలే అభివృద్ధి సాధించగలవని అధికారులు తెలియజేశారు. గ్రామ అభివృద్ధిలో గ్రామపంచాయతీ పాలకవర్గము, గ్రామ ప్రజలు, గ్రామస్థాయి అధికారులు అందరూ కూడా తోడ్పడగలరని గ్రామ సభను ఉద్దేశించి సర్పంచ్ గారు తెలియజేశారు. ఈరోజు జరిగిన గ్రామసభలో వార్డు సభ్యులు గాజుల భగవాన్ శంకర్, అంగడెల్లి పరుశురాం, దాసరి అనితమ్మ, కమ్మరి మహేష్ మరియు మాజీ వార్డు సభ్యులు జ. మల్లేష్, అంగన్వాడి టీచర్లు వెంకటలక్ష్మి, అంజమ్మ, రుక్మిణి, నిర్మల, ఆరోగ్యశాఖ సిబ్బంది, ఐకెపి సిబ్బంది, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు..



అక్షరకలం
తెలుగు దినపత్రిక
నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి

# అక్రమ తవ్వకాలపై "ఉక్కుపాదం"

## జిల్లా కలెక్టర్ కఠిన ఆదేశాలు

### పర్మిషన్ లేకుండా ఇసుక, మట్టి తరలిస్తే వాహనాలు సీజ్

### రెవెన్యూ, పోలీస్ శాఖల సంయుక్త నిఘా

### ఎస్పీ తో కలిసి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్

ఉమ్మడి నల్లగొండ బ్యూరో అక్షరకలం

జిల్లాలో అక్రమ ఇసుక, చెరువుల మట్టి తవ్వకాలపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లాకలెక్టర్‌బి చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు.శుక్రవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ సంయుక్తంగా ఆర్డిఓలు, తహసిల్దారులు, డీఎస్పీలు, ఎంపీడీవోలు, ఎస్ఎస్‌వోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూజిల్లాలో ఎక్కడైనా పర్మిషన్ లేకుండా ఇసుక తవ్వకాలు నిర్వహిస్తే సంబంధిత వాహనాలను తక్షణమే సీజ్ చేయాలని స్పష్టం చేశారు. చెరువుల నుండి మట్టి తీస్తే కూడా అనుమతి లేకుండా చేస్తే వాహనాలను సీజ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ అవసరాల కోసం మట్టి



తీసుకోవాలంటే తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని పేర్కొన్నారు.ప్రజలకు అవసరమైన మేరకు ఇసుకను లీగల్‌గా అందుబాటులో ఉంచాలని, కొత్తగా అవసరమైన ప్రాంతాల్లో ఇసుక రీచ్‌లను ప్రతిపాదనలు సమర్పించాలని తెలిపారు. అనేశ్వరం గుట్ట చెరువు, కనగల్లు తిమ్మన్నగూడెం చెరువుల వద్ద అక్రమ తవ్వకాలపై ప్రత్యేక నిఘా ఉంచి కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుకను ప్రభుత్వ నిబంధనల ప్రకారం, రవాణాతో అందించే విధంగా చర్యలు చేపడతామని తెలిపారు. అలాగే వేములపల్లి మండలం బొమ్మకల్లు, రావులపెంట ప్రాంతాల్లో కొత్తగా రెండు ఇసుక రీచ్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. దేవరకొండ లో కూడా ఇసుక రీచ్ అవసరాన్ని పరిశీలించి ఏర్పాటు చేయాలని తెలిపారు. జిల్లా ఎస్పీ శరత్చంద్ర పవర్ మాట్లాడుతూఅక్రమ తవ్వకాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రోత్సహించవద్దని స్పష్టం చేశారు. ఎక్కడైనా అక్రమ ఇసుక రవాణా లేదా మట్టి తవ్వకాలు కనిపిస్తే వెంటనే పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు. సంబంధిత వాహనాలను సీజ్ చేసి, నిబంధనల ప్రకారం కేసులు నమోదు చేస్తామని తెలిపారు. డ్రైవర్లతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి లీగల్ విధానాలపై అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. రెండు మూడు రోజుల్లో జిల్లాలో పూర్తిగా అక్రమ తవ్వకాలను నియంత్రించేలా పోలీస్, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. జిల్లా అభివృద్ధి, ప్రజల అవసరాల దృష్ట్యా ఇసుక సరఫరా పూర్తిగా చట్టబద్ధంగా జరగేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, మైనింగ్ జిల్లా అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

# నేడు 'ప్రత్యేక ప్రజావాణి' రద్దు

### ఎండల దృష్ట్యా దివ్యాంగులు, వయోవృద్ధులు రావద్దు

### జిల్లా సంక్షేమ అధికారిణి శ్రీమతి కేవీ కృష్ణవేణి విజ్ఞప్తి

ఉమ్మడి నల్గొండ బ్యూరో అక్షరకలం

ప్రతినెల చివరి శనివారం దివ్యాంగులు, వయోవృద్ధుల సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే 'ప్రత్యేక ప్రజావాణి' కార్యక్రమాన్ని ఈసారి వాయిదా వేస్తున్నట్లు జిల్లా సంక్షేమ అధికారిణి శ్రీమతి కేవీ కృష్ణవేణి ఒక ప్రకటనలో తెలిపారు. ?ప్రస్తుతం వేసవి కాలం దృష్ట్యా జిల్లాలో ఉష్ణోగ్రతలు తీవ్రంగా నమోదవుతున్నాయని, ఈ ఎండల వల్ల దివ్యాంగులు, వయోవృద్ధులు ప్రయాణాలు చేసి ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆమె వివరించారు.నేడు కలెక్టరేట్‌లో ప్రత్యేక ప్రజావాణి నిర్వహించడం లేదు. కావున దివ్యాంగులు, వయోవృద్ధులు ఎవరూ కలెక్టరేట్ కార్యాలయానికి రావద్దని కోరారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ముఖ్యంగా వృద్ధులు తగిన ఆరోగ్య జాగ్రత్తలు పాటిస్తూ ఇంటి వద్దనే సురక్షితంగా ఉండాలని సూచించారు. ఈ నెలలో జరగాల్సిన ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం ఎండల తీవ్రత తగ్గాక లేదా తదుపరి ఆదేశాల మేరకు నిర్వహించబడుతుందని ఆమె పేర్కొన్నారు.అధికారులు తీసుకున్న ఈ నిర్ణయాన్ని గమనించి, ఎవరూ ఎండలో ప్రయాణించి ఇబ్బందులకు గురికావద్దని విజ్ఞప్తి చేశారు.

# ముందస్తు గుర్తింపు ద్వారా మలేరియాను నివారించవచ్చు

### -నేడు ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా డా.తారకేశ్వరి సూరపనేని

: హైదరాబాద్‌లో మలేరియా కాలానుగుణంగా ప్రజారోగ్యానికి ముప్పుగా మారుతున్న నేపథ్యంలో గర్భిణీలు, వారి కుటుంబ సభ్యులు అప్రమత్తంగా ఉండాలని ఫెర్నాండెజ్ హాస్పిటల్ చీఫ్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ తారకేశ్వరి సూరపనేని శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. నేడు(ఏప్రిల్ 25) ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భధారణ సమయంలో మలేరియా అనేది కేవలం మామూలు జ్వరం కాదని, దీనిని ముందే గుర్తించి చికిత్స అందించకపోతే తీవ్ర పరిణామాలకు దారితీస్తుందని తెలిపారు. సకాలంలో పరీక్షలు చేయించుకోవడం, సరైన చికిత్స తీసుకోవడం, నివారణ చర్యలు పాటించడం వల్ల తల్లికి, బిడ్డకు మెరుగైన ఆరోగ్యాన్ని అందించవచ్చని ఆమె పేర్కొన్నారు. మొదటిసారి గర్భం దాల్చిన వారు లేదా గర్భం దాల్చిన తొలి నెలల్లో ఉన్నవారు మలేరియా బారిన పడే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ఈ ఇన్ఫెక్షన్ వల్ల రక్తహీనత, ప్రసవ సమయంలో రక్తస్రావం పెరిగే ప్రమాదం ఉందన్నారు. సాధారణ లక్షణాలలో జ్వరం, చలి, తలనొప్పి, వికారం, వాంతులు, ఒళ్లు నొప్పులు ఉంటాయని అన్నారు. మలేరియాను మైక్రోస్కోపీ, రాపిడ్ డయాగ్నోస్టిక్ టెస్ట్‌ల వంటి రక్త పరీక్షల ద్వారా గుర్తించవచ్చని పేర్కొన్నారు. ఒకవేళ మొదటిసారి పరీక్ష చేసినప్పుడు నెగిటివ్ వచ్చినా లక్షణాలు తగ్గకపోతే, మరొకసారి పరీక్ష చేయించుకోవాలని సూచించారు.

# కేఎల్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ అడ్మిషన్-26కు కౌన్సెలింగ్

కేఎల్ డీమ్డ్ టు బీ యూనివర్సిటీ-2026 విద్యా సంవత్సరానికి సంబంధించిన వివిధ కోర్సుల్లో అడ్మిషన్‌ల కోసం కౌన్సెలింగ్ ప్రక్రియను ప్రారంభించినట్లు అడ్మిషన్స్ డైరెక్టర్ డా.జె.ఎస్.ఆర్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ విజయవాడ(వడ్డేశ్వరం)తో పాటు హైదరాబాద్‌లోని కేఎల్హెచ్ అజీజ్‌నగర్, కేఎల్ హెచ్ బాచుపల్లి, కేఎల్ హెచ్ గ్లోబల్ బిజినెస్ స్కూల్-కొండాపూర్ క్యాంపస్‌లలో ఈ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వివిధ అండర్‌గ్రాడ్యుయేట్ కోర్సుల్లో అడ్మిషన్‌ల కోసం విద్యార్థులకు సమగ్ర, క్రమబద్ధమైన విధానాన్ని యూనివర్సిటీ అందుబాటులోకి తీసుకువచ్చిందని అన్నారు. ఏప్రిల్ 26 నుంచి 30 వరకు కౌన్సెలింగ్ సెషన్‌లు జరుగనున్నాయని తెలిపారు. ప్రతిరోజూ ఉదయం, మధ్యాహ్నం రెండు విడతలుగా నిర్వహించి అన్ని వర్గాల అభ్యర్థులు సౌకర్యంగా పాల్గొనేలా ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. బీటెక్, బిబిఏ, బీకాం(ఏసీసీఏ), బిబిఏ-ఎల్.ఎల్.బి, బీసీఏ, బీఏ(ఎకానామిక్స్‌తో ఐఏఎస్ ఓరియెంటేషన్), బి ఫర్మసీ, ఫార్మ్ డి, బిఎస్సి(హానర్స్) అగ్రికల్చర్, బిఎస్సి(యానిమేషన్, గేమింగ్), ఫుడ్ టెక్నాలజీతో పాటు బి.టెక్ లాటరల్ ఎంట్రీ కోర్సులకు అడ్మిషన్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. కెఎల్‌ఈఈఈ, కె.ఎల్.హెచ్.ఏటీ, కెఎల్‌ఎస్‌ఏటీ, కెఎల్‌ఈసీఈటీ ర్యాంకులు, జేఈఈ మెయిన్స్ పర్సెంటైల్, ఇంటర్మీడియట్(10ం2) ప్రతిభ ఆధారంగా అడ్మిషన్‌లు కల్పించనున్నట్లు చెప్పారు.

# వన నర్సరీ తనిఖీ

మండల పరిధిలోని సింగారెడ్డిపాలెం గ్రామంలోని వన నర్సరీని ఏపిడీ పవన్ కుమార్ ఏపీవో రవి తో కలిసి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నర్సరీ నిర్వహణ,మొక్కల సంరక్షణపై చేపడుతున్న చర్యలను సమీక్షించారు. ప్రైమరీ బెడ్ల ఏర్పాటు, మొక్కలకు సమయానికి నీటిపారుదల,కలుపు తొలగింపు తదితర అంశాలపై సిబ్బందికి సూచనలు చేశారు. నర్సరీలో మొక్కల పెంపకంలోని నాణ్యతను మెరుగుపరచాలని, సరైన సంరక్షణతో మంచి ఫలితాలు సాధించాలని ఆయన తెలిపారు రానున్న వన మహోత్సవం నాటికి మొక్కలను నాటడానికి సిద్ధం చేయాలని అన్నారు వేసవికాలం కాబట్టి ప్రతిరోజు మొక్కలకు నీటిని అందించాలని చనిపోయిన మొక్కలు స్థానంలో నూతన మొక్కలను ఏర్పాటు చేయాలన్నారు ఈ తనిఖీలో స్థానిక సర్పంచ్ ఒగ్గు కిరణ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి ఎస్కే అఖిల్, ఫీల్డ్ అసిస్టెంట్ ఆర్. జ్యోతి తదితరులు పాల్గొన్నారు....



# ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచండి

### కలెక్టర్ చంద్రశేఖర్ ఆదేశం

### చామలపల్లి ఐకేపీ కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్

### రైతులతో ముఖాముఖి

### లారీల కొరత తీర్చి, రవాణాను వేగవంతం చేయాలని అధికారులకు దిశానిర్దేశం

ఉమ్మడి నల్గొండ బ్యూరో అక్షరకలం

నల్గొండ జిల్లా చందూరు మండలంలోని చామలపల్లి ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం జిల్లా కలెక్టర్ సందర్శించారు.ఈ సందర్భంగా కేంద్రాలలో జరుగుతున్న కొనుగోలు ప్రక్రియను పరిశీలించి, రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.కేంద్రాలలో లారీలు కొరత ఉన్నట్లు గుర్తించిన కలెక్టర్ వెంటనే అదనపు లారీలు ఏర్పాటు చేసి ధాన్యం రవాణాను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఒకే మిల్లు ద్వారా కొనుగోలు





జరుగుతుండటంతో ఆలస్యమవుతోందని గమనించి, మరిన్ని మిల్లులను కేటాయించాలని తహసిల్దార్ కు సూచించారు. సమీప మిల్లులకు ధాన్యాన్ని ట్యాగ్ చేసి త్వరగా తరలించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.ప్రతి మిల్లులో ఒక అధికారిని నియమించి కొనుగోలు ప్రక్రియను పర్యవేక్షించాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పారదర్శకంగా కొనుగోలు జరగాలని కలెక్టర్ స్పష్టం చేశారు. రైతులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలన్నారు.ఈ సందర్భంగా చమలపల్లి గ్రామ సర్పంచ్ ఆంజనేయులు తమ గ్రామంలోని శేషు లేటి ఫీడర్ వాగు సంబంధించిన నష్ట పరిహారంమాకు అందలేదు ల్యాండ్ సర్వే చేశారు కానీ అమౌంట్ ఇవ్వలేదు, ప్రాజెక్టును త్వరగా పూర్తిచేయాలని సర్పంచ్ కోరారు . స్పందించిన కలెక్టర్ వాటిని వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. చండూరు ఆర్డీవో శ్రీదేవి తహసిల్దార్ రవికాంత్ వర్మ ఎంపీడీవో బి యాదగిరి. సర్పంచ్ ఆంజనేయులు ఉపసర్పంచ్ వెంకన్న సెంట్రల్ . నిర్వాహకులు జ్వాలా వెంకన్న, ఏవో చరిత్ర, ఏఈఓ శోభ, ఆర్ఐ లక్ష్మి,తదితరులు కలెక్టరు వెంట ఉన్నారు.

# చిన్న పత్రికల హక్కుల కోసం పోరాడాలి

### అక్రిడేషన్ కమిటీ సభ్యుడు అశోక్‌కు ఘన సన్మానం

అక్షర కలం హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర మీడియా అక్రిడేషన్ కమిటీ సభ్యుడిగా నూతనంగా నియమితులైన జర్నలిస్టు అశోక్‌ను ఆయన స్వగృహంలో గోల్లా రమేష్ కలిసి శాలువాతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. చిన్న, మధ్యతరహా పత్రికల తరఫున అశోక్‌కు లభించిన ఈ ప్రాతినిధ్యం గర్వకారణమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ అక్రిడేషన్‌ల విషయంలో ఎలాంటి రాజీ పడకుండా ప్రభుత్వం జారీ చేసిన జీవోల ప్రకారం చిన్న పత్రికలకు, జర్నలిస్టులకు దక్కాల్సిన హక్కులు సాధించేందుకు అశోక్ కృషి చేయాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా చిన్న పత్రికల అక్రిడేషన్ సమస్యలను ప్రాధాన్యతగా తీసుకుని వాటి పరిష్కారానికి ముందుండాలని సూచించారు. అదేవిధంగా చిన్న పత్రికలు ఎదుర్కొంటున్న పెండింగ్ బిల్లుల చెల్లింపుల సమస్యలు, ప్రభుత్వ ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్లు) కేటాయింపులో ఎదురవుతున్న ఇబ్బందులు తదితర అంశాలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా చొరవ చూపాలని కోరారు. రాష్ట్ర అక్రిడేషన్ కమిటీలో మన చిన్న పత్రికల సంఘానికి ప్రాతినిధ్యం దక్కడం శు భపరిణామమని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని జర్నలిస్టుల హక్కుల పరిరక్షణకు అశోక్ కృషి చేస్తారనే నమ్మకం ఉందన్నారు. చిన్న పత్రికల అభివృద్ధి, సంక్షేమం కోసం సంఘం రాష్ట్ర అధ్యక్షులు యూసఫ్ బాబు నాయకత్వంలో అశోక్ తన వంతు పాత్రను సమర్థవంతంగా పోషిస్తూ సమస్యల పరిష్కారంలో మరింత బలంగా నిలవాలని ఆకాంక్షించారు. తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి కి , స్పెషల్ కమిషనర్ ప్రియాంక కి , డైరెక్టర్ కిషోర్ బాబు కి ,అడిషనల్ డైరెక్టర్ జగన్ కి, సంబంధిత అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఎల్లప్పుడూ అందరికీ మా చిన్న పత్రికలకు అండగా నిలిచి క్రియాశీలకంగా వ్యవరించిన టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ కి, తన ఆత్మీయుడు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యూసఫ్ బాబుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ పదవికి తగిన న్యాయం చేసి, చిన్న పత్రికల గొంతుకగా నిలిచి అందరి మన్ననలు పొందాలని తన ఆకాంక్ష అని పేర్కొంటూ అశోక్‌కు మరోసారి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.



# రైతుకు నమ్మకమైన విత్తనమే అందించడమే లక్ష్యం

## మృత్యువుతో రిషికేశ్వర్ పోరాటం

**కబళిస్తున్న క్యాన్సర్ మహమ్మారి**

**35 లక్షలు అప్పుచేసి వైద్యం... మరో 20 లక్షలు అవసరం**

**దాతలు స్పందిస్తే.. నిలబడనున్న రిషికేశ్వర్ ప్రాణాలు**





**మందమర్రి, ఏప్రిల్ 24 అక్షర కలం:**

ఆడుతూ పాడుతూ ఎదిగే వయస్సులో భయంకర క్యాన్సర్ మహమ్మారి మృత్యువు రూపంలో ఎదురవడంతో అభం శుభం తెలియని చిన్నారి రిషికేశ్వర్ మృత్యువుతో పోరాడుతున్నాడు. రిషికేశ్వర్ ను ఎలాగైనా బతికించాలని అతని తల్లిదండ్రులు తమ తహాతకు మించి అప్పులు చేసి ఇప్పటికే సుమారు 35 లక్షల రూపాయలు ఖర్చు చేసి, బాలుడికి వైద్య సహాయం అందించారు. అయినప్పటికీ రిషికేశ్వర్ ప్రాణాలు నిలబడ్డానికి మరో 20 లక్షల రూపాయలు అవసరం ఉంటుందని వైద్యులు తెలపడంతో ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో బాలుని తల్లిదండ్రులు దాతల సహాయం కోరుతున్నారు. శుక్రవారం పట్టణ ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బాలుడి తల్లిదండ్రులు వేనవంక నారాయణ - శ్రీలత లు మాట్లాడుతూ, దాతలు స్పందించి, తమ కుమారుడు రిషికేశ్వర్ వైద్యానికి ఆర్థిక సహాయం అందించాలని వేడుకున్నారు. పట్టణంలోని రెండవ జోన్ లో నివాసం ఉంటూ, పట్టణంలో ప్రైవేట్ ఉపాధ్యాయులుగా తమ జీవన ప్రయాణాన్ని కొనసాగిస్తున్న నారాయణ - శ్రీలత దంపతులకు కుమార్తె మనస్విత, కుమారుడు రిషికేశ్వర్ లు కలరు. మనస్విత పట్టణంలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతుండగా, రిషికేశ్వర్ మాంటిస్సోరి పాఠశాలలో నాలుగవ తరగతి చదువుతున్నాడు. ఉన్నంతలో సర్దుకుంటూ, పిల్లలను ప్రయోజకులను చేయాలని కోరుకున్న ఆ తల్లిదండ్రుల ఆకాంక్షలు అడ్డుకట్టగా, అనుకోని కష్టం ఎదురుకావడంతో, విధికి ఎదురీత ఈదే పరిస్థితి నెలకొంది. బడికి వెళ్లి చదువుకుంటూ, తోటి పిల్లలతో ఆడుకునే వయస్సులోనే క్యాన్సర్ మాయరోగం వారి కుమారుడిని వెంటాడడంతో ఆ కుటుంబం ఒక్కసారిగా అప్పుల ఊబిలో చిక్కుకొని, ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తున్నారు. గత నాలుగు నెలల క్రితం రిషికేశ్వర్ తోటి పిల్లలతో ఆడుకుంటూ ఒక్కసారిగా అస్వస్థతకు గురి కావడంతో ఆందోళన చెందిన అతని కుటుంబ సభ్యులు రిషికేశ్వర్ ను మంచిర్యాల, కరీంనగర్, వరంగల్ , హైదరాబాద్ లాంటి ఆసుపత్రిలో వైద్య చికిత్స అందించారు. హైదరాబాద్ లోని ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు బ్లడ్ క్యాన్సర్, ఏఎంఎల్ గా నిర్ధారించడంతో ఒకేసారిగా బాలుడి తల్లిదండ్రులు కృంగిపోయారు. ఆడి పాడే వయస్సులో కుమారుడికి ప్రాణాంతకమైన వ్యాధి రావడంతో, దయానీయ స్థితిని చూసి మౌనంగా రోదిస్తున్న తీరు అందరిని కలిచివేసింది. పది సంవత్సరాల వయసున్న కొడుకును కాపాడుకునేందుకు ఆ తల్లిదండ్రులు ఎక్కాని గడప, మొక్కని దేవుడు లేడు. దొరికిన చోటల్లా స్తోమతకు మించి 35 లక్షల రూపాయలు అప్పు చేసి మరి నాలుగు నెలలుగా కుమారుడికి వైద్యం అందిస్తున్నారు. తన తమ్ముణ్ణి రక్షించేందుకు రిషికేశ్వర్ అక్క మనస్విత తన బోన్ మారో అందించింది. ప్రస్తుతం పూర్తి వైద్యం అందించి, బాబు ప్రాణాలు నిలబడాలంటే మరో 20 లక్షలు అవసరం ఉందని వైద్యులు తెలిపారు. ఇప్పటికే కుమారుని బతికించుకోవడం కోసం తమ శక్తికి మించి కృషిచేసిన తల్లిదండ్రులు శారీరకంగా, మానసికంగా అలసిపోయి, దాతల సహాయం కోసం దయనీయ స్థితిలో ఎదురుచూస్తున్నారు. గత 3 సంవత్సరాల క్రితం జరిగిన అగ్ని ప్రమాదంలో వీరి ఇల్లు పూర్తిగా దగ్ధం కాగా, ఇంట్లో ఉన్న సామాగ్రి అగ్నికి ఆహుతి కావడంతో సుమారు పది లక్షల రూపాయల వరకు నష్టం వాటిల్లింది. ఆ సంఘటన నుండి కోరుకొనే లోపే కుమారుడు క్యాన్సర్ బారిన పడడంతో, వారి ఆవేదనకు అవధులు లేకుండా పోయాయి. మనసున్న దాతలు ముందుకు వచ్చి, ఆదుకోవాలని రిషికేశ్వర్ కుటుంబ సభ్యులు దాతలను వేడుకుంటున్నారు. వైద్యం కొరకు డబ్బులు అందించాలనుకునే దాతలు వేనవంక నారాయణ - శ్రీలత ల గూగుల్ పే, ఫోన్ పే నెంబర్ 9949156031 కు పంపించాలని కోరారు.

## కార్మికుల సంక్షేమమే ధ్యేయం

**4.26 కోట్లతో కాసీపేట 1ఏ గనిలో మ్యాన్ రైడింగ్ ఏర్పాటు**

**సింగరేణి ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్ డైరెక్టర్ కె వెంకటేశ్వర్లు**

**ఏరియాలో విస్తృత పర్యటన**

**మందమర్రి, ఏప్రిల్ 24 అక్షర కలం:**

కార్మికుల సంక్షేమ ధ్యేయంగా ఏరియాలోని కాసీపేట 1ఏ గనిలో కార్మికుల రవాణా సౌకర్యం కోసం 4,26,25,314 రూపాయల అంచనా వ్యయంతో 1350 మీటర్ల పొడవునా అత్యాధునిక మ్యాన్ రైడింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయడం జరిగిందని సింగరేణి ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్ డైరెక్టర్ కె వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం ఆయన ఏరియాలో విస్తృతంగా పర్యటించారు. ముందుగా డైరెక్టర్ కే వెంకటేశ్వర్లు దంపతులు, ఏరియా జీఎం ఎన్ రాధాకృష్ణ దంపతులతో కలిసి పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర దేవస్థానాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారికి ఆలయ అర్చకులు ఘనస్వాగతం పలికి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏరియాలోని కాసీపేట 1ఏ గనిలో నూతనంగా ఏర్పాటు చేసిన మ్యాన్ రైడింగ్ వ్యవస్థను ప్రారంభించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, కాసీపేట 1ఏ గని ఉద్యోగులు నడిచి వెళ్ల శ్రమను తగ్గించేందుకు, తక్కువ సమయంలో పని ప్రదేశానికి చేరుకునేందుకు ఈ వ్యవస్థ ఎంతో ఉపయోగపడుతుందని, దీంతో ఉత్పత్తి పెంపుదలకు సహకరిస్తుందని తెలిపారు. అనంతరం ఏరియాలోని కేకే ఓసిపి గనిని వ్యూ పాయింట్ నుంచి సందర్శించి, బొగ్గు వెలికితీత పనులను పర్యవేక్షించారు. అదేవిధంగా రామకృష్ణాపూర్ లో నిర్వహిస్తున్న సర్ఫేస్ మిక్స్ ఎమల్షన్ (ఎస్ఎంఈ) ప్లాంట్ ను తనిఖీ చేసి, ప్లాంట్ లో జరుగుతున్న పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్లాంట్ లో జరుగుతున్న పనులను త్వరగా పూర్తిచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అదేవిధంగా ఏరియాలో



జరుగుతున్న ఇతర సివిల్, సాంకేతక పనుల పురోగతిపై సంతృప్తి వ్యక్తం చేసి, నిర్దేశించిన లక్ష్యాలను రక్షణతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్ఓటు జీఎం జీఎల్ ప్రసాద్, గుర్తింపు కార్మిక సంఘం ఏఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి శైలేంద్ర సత్యనారాయణ, బెల్లంపల్లి బ్రాంచ్ దాగం మల్లేష్, కేకే గ్రూప్ ఏజెంట్ రాంబాబు, డీజీఎం పర్సనల్ సిహెచ్ అశోక్, ఏరియా ఇంజనీర్ బాలాజీ భగవతి జా, కాసీపేట గని మేనేజర్ సతీష్ కుమార్, బెల్లంపల్లి రీజియన్ క్వాలిటీ జీఎం వీరభద్రరావు, కేకే ఓసిపి గని మేనేజర్ రామరాజు, ప్రాజెక్ట్ ఇంజనీర్ వెంకట వంశీధర్, సివిల్ ఎస్ఈ శ్రీధర్, ఏరియా అధికారులు, వివిధ విభాగాల అధిపతులు, సిబ్బంది పాల్గొన్నారు.

## తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 24:**





రైతు సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని, ఈ క్రమంలో రైతులకు నమ్మకమైన, అధిక దిగుబడిని ఇచ్చే నాణ్యమైన విత్తనాలను అందించాలని తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి తెలిపారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో మంచిర్యాల, కుమ్రంభీమ్ ఆసిఫాబాద్ జిల్లాల వ్యవసాయ అధికారులు సురేఖ, విత్తన డీలర్లు, సహకార సంఘాల ప్రతినిధులు, మహిళా సంఘాల ప్రతినిధులు, ఎఫ్‌పీఓల ప్రతినిధులతో విస్తృత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, రాష్ట్రంలో కల్తీ విత్తనాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, ఈ పరిస్థితులలో వారిని నాణ్యమైన విత్తనాల వినియోగం వైపు మళ్లించాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. ముఖ్యంగా ఈ 2 జిల్లాల్లో పత్తి సాగు విస్తీర్ణం అధికంగా ఉందని, ప్రతి సంవత్సరం నకిలీ పత్తి విత్తనాల వల్ల రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, కట్టడి చేసేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వరి సాగు మాత్రమే కాకుండా, రైతులు లాభదాయకమైన వాణిజ్య పంటల వైపు మొగ్గు చూపాలని తెలిపారు. వరికి ప్రత్యామ్నాయంగా పెసర, కంది, మినుము, శనగ, వేరుశనగ, నువ్వులు వంటి పంటలను సాగు చేయడం ద్వారా ఆదాయాన్ని పెంచుకోవచ్చని తెలిపారు. విత్తనాభివృద్ధి సంస్థ నేరుగా రైతులతో అనుసంధానమై విత్తన ఉత్పత్తి చేపడుతుందని, కఠినమైన ప్రమాణ పరీక్షల తర్వాత వాటిని ధృవీకరించి రైతులకు అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి జిల్లాలలో విత్తనాల కొరత లేదని, సన్న రకాలు బిపిటి 5204, ఆర్ఎన్ఆర్ 15048, కెఎన్ఎం 1638 అందుబాటులో ఉన్నాయని, దొడ్డు రకాలు కెఎన్ఎం 118, ఎమ్‌టియు 1010 కూడా రైతులకు అందించేందుకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం సూచించిన ఈ రకాలను మాత్రమే డీలర్లు విక్రయించాలని, విత్తనాభివృద్ధి సంస్థ విత్తనాలను ప్రతి విత్తన డీలర్ విక్రయించాలని, పచ్చిరొట్ట ఎరువులైన జీలుగ, జనుము విత్తనాలను సకాలంలో అందిస్తామని తెలిపారు. ఈ వానకాలంలో 2 జిల్లాలలో సుమారు 2 లక్షల ఎకరాలలో వరి సాగు అవుతుందని, ఇందుకు 50 వేల క్వింటాళ్ల విత్తనం అవసరమని, కనీసం 20 వేల క్వింటాళ్లను విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా సరఫరా చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. త్వరలో రాబోయే నూతన విత్తన చట్టం రైతుల హక్కులతో పాటు డీలర్ల ప్రయోజనాలను కాపాడుతుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ కుమార్ మాట్లాడుతూ, రైతులు నాణ్యమైన విత్తనాలు వినియోగించేలా, పంట మార్పిడి చేపట్టేలా వ్యవసాయ శాఖ తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాల్లో కంది, మినుము పంటలపై అవగాహన కల్పించాలని డీలర్లు కోరగా, విత్తన సరఫరాలో తాము భాగస్వాములం అవుతామని మహిళా సంఘాలు ముందుకు రావడం శుభ పరిణామమని తెలిపారు. పంట సాగులు శాస్త్రీయ, సేంద్రీయ పద్ధతులను అవలంబించడం ద్వారా ఆరోగ్యకరమైన పంట ఉత్పత్తులు దిగుబడి చేయవచ్చని తెలిపారు. సాధారణ పంటలే కాకుండా ప్రత్యామ్నాయంగా కూరగాయలు, పండ్ల సాగుపై రైతులు దృష్టి సారించేలా అధికారులు కృషి చేయాలని తెలిపారు. పంట సాగులో వివిధ రకాలైన పంటలు సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని, పంట సాగులో అవసరమైన మెలకువలు అందించాలని తెలిపారు. ఈ సమావేశంలో ఆసిఫాబాద్ జిల్లా వ్యవసాయ శాఖ (టెక్నికల్), సహకార అధికారులు, ఏడీఏలు, ఎంఏఓలు, ఎఫ్‌పీఓ ప్రతినిధులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలి

**కేంద్ర, రాష్ట్ర నిధులతో అమలవుతున్న పథకాల వివరాలు పక్కాగా అందించాలి**

**అక్షర కలం నాగర్ కర్నూల్**



బ్యాంకింగ్ వ్యవస్థ ప్రజల ఉపాధి అవసరాలకు మరింత సమర్థవంతంగా స్పందించాలి, నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి, వివిధ శాఖల అధికారులు కేంద్ర ప్రభుత్వ పథకాల అమలులో జాప్యానికి తావులేకుండా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు, జిల్లా అభివృద్ధి, సమన్వయ పర్యవేక్షణ(దిశా) కమిటీ ఛైర్మన్ డాక్టర్ మల్లు రవి, అధ్యక్షతన శుక్రవారం కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో దిశా సమావేశానికి నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్లు అమరేందర్ జీవీ శ్యామ్ ప్రసాద్ లాల్, జిల్లా అటవీ శాఖ అధికారి రేవంత్ చంద్ర, పాల్గొన్నారు. ఉపాధి సృష్టి లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల అమలులో బ్యాంకుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ (పీఎంఈజీపీ) వంటి పథకాల ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని, ఈ నేపథ్యంలో ప్రతి బ్యాంకు తమ పరిధిలో ఉన్న లబ్ధిదారులకు ఎమ్ఎస్ఎంఈలకు ప్రాధాన్యతనిస్తూ రుణాల మంజూరులో వేగం పెంచాలని చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి రాష్ట్ర, దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తుందని పేర్కొంటూ, ప్రధానమంత్రి ముద్ర యోజన (ముద్ర యోజన), ప్రధానమంత్రి విశ్వకర్మ (పీఎం విశ్వకర్మ) వంటి పథకాల కింద అర్హులైన వారికి తక్షణమే రుణాలు అందించాలన్నారు. అదేవిధంగా, ఇప్పటికే ప్రభుత్వ సంక్షేమ పథకాల కింద ఆమోదం పొందిన రుణ దరఖాస్తులకు ఆశించిన స్థాయిలో రుణాలు అందించకపోవడం పట్ల ఎంపీ మల్లు రవి అసంతృప్తి వ్యక్తం చేశారు. సూక్ష్మ చిన్న తరహా పరిశ్రమలకు వెంటనే పరిష్కరించి, లబ్ధిదారులు తమ వ్యాపార కార్యకలాపాలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని బ్యాంక్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. బ్యాంకర్లు కేవలం రుణాల మంజూరుకు మాత్రమే పరిమితం కాకుండా, లబ్ధిదారులకు మార్గదర్శకత్వం కూడా అందించాలని ఎంపీ మల్లు రవి సూచించారు. వ్యాపార ప్రణాళికలు రూపొందించడం, రుణ వినియోగం, తిరిగి చెల్లింపు విధానాలపై అవగాహన కల్పించడం ద్వారా స్థిరమైన ఉపాధి అవకాశాలు కల్పించవచ్చని ,సమగ్రంగా చూస్తే, ఉపాధి సృష్టి, ఆర్థికాభివృద్ధి లక్ష్యాలను చేరుకునేందుకు బ్యాంకింగ్ రంగం చురుకుదనం ప్రదర్శించాలని, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు నిజమైన లబ్ధిదారులకు చేరేలా సమన్వయంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఎంపీ డాక్టర్ మల్లు రవి జిల్లా అభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల పురోగతిపై పలు కీలక శాఖల అధికారులతో విస్తృత సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. జరిగిన దిశ ఈ సమావేశంలో బ్యాంకింగ్ రంగం నుండి జాతీయ రహదారులు, రోడ్లు ఽ భవనాల నిర్మాణం, అంగన్వాడి కేంద్రాల అభివృద్ధి, నీటిపారుదల శాఖ ప్రాజెక్టులు, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ, ఈడబ్ల్యూఐడీసీ ఇంజనీరింగ్ శాఖ పనితీరుపై అధికారులు సమగ్ర నివేదికలు సమర్పించారు. మిషన్ భగీరథ అమలుపై ప్రత్యేకంగా దృష్టి సారించిన ఎంపీ, గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా ఎక్కడా అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. విద్యా రంగానికి సంబంధించిన అంశాలపై కూడా సమావేశంలో విస్తృత చర్చ జరిగింది. పాఠశాల విద్య, ఇంటర్మీడియట్ విద్య, కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాలు (కేజీబీవీలు), ఎస్సీ, ఎస్టీ, బీసీ మరియు మైనారిటీ గురుకుల పాఠశాలల నిర్వహణ, విద్యార్థుల హాజరు, ఫలితాలు, మౌలిక సదుపాయాలపై ఎంపీ సమీక్షించారు. విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించడంతో పాటు, వసతి, ఆహారం, భద్రత వంటి అంశాల్లో ఎలాంటి లోపాలు లేకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. సాంఘిక సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖలకు చెందిన వసతి గృహాల పరిస్థితిపై కూడా ప్రత్యేకంగా చర్చిస్తూ, అక్కడి పరిస్థితులను తరచుగా పర్యవేక్షించాలని సూచించారు. సంక్షేమ పథకాల అమలుపై సమీక్షిస్తూ ఎస్సీ కార్పొరేషన్, బీసీ కార్పొరేషన్, మైనారిటీ సంక్షేమ శాఖల పనితీరును పరిశీలించారు. అర్హులైన లబ్ధిదారులకు పథకాల ప్రయోజనాలు పారదర్శకంగా, సమయానికి చేరేలా చర్యలు తీసుకోవాలని ఎంపీ గారు అధికారులకు దిశానిర్దేశం చేశారు. బ్యాంకింగ్ రంగం ద్వారా రుణాల మంజూరు, స్వయం ఉపాధి అవకాశాల పెంపుపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.

## ఆర్టీసీ కార్మికుడు శంకర్ గౌడ్ మృతి బాధాకరం....

**- ఆర్టీసీ కార్మికులకు బీఆర్ఎస్ అండగా ఉంటుంది....**

**- మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మ దేవేందర్ రెడ్డి.....**

**మెదక్/ కొల్చారం ఏప్రిల్ 24( అక్షర కలం):-**

ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి పట్ల మాజీ డిప్యూటీ స్పీకర్, మెదక్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు పద్మ దేవేందర్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆత్మహత్యకు పాల్పడటం అత్యంత బాధాకరమని పేర్కొంటూ మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ దుర్ఘటన వారి కుటుంబానికి తీరని లోటని అన్నారు.ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, న్యాయమైన హక్కుల కోసం వారు చేస్తున్న పోరాటం సమంజసమని, అయితే ఆ పోరాటంలో ప్రాణాలను కోల్పోవడం సరైంది కాదని స్పష్టం చేశారు. “పోరాటం చేయాలి... గెలవాలి... కానీ బతికి ఉండాలి. ఒక వ్యక్తి తీసుకునే తప్పుడు నిర్ణయం మొత్తం కుటుంబాన్ని చీకటిలోకి నెడుతుంది. మీరే మీ కుటుంబానికి ధైర్యం, మీరే వారి బలం” అని పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మికులు ధైర్యంగా ఉండాలని, ఆత్మహత్యల వంటి అతి నిర్ణయాలకు పాల్పడవద్దని విజ్ఞప్తి చేశారు. సమస్యలు ఎంత పెద్దవైనా వాటికి పరిష్కారం ప్రాణాలు తీసుకోవడం కాదని, ధైర్యంగా నిలబడి పోరాడితేనే న్యాయం సాధ్యమవుతుందని తెలిపారు.ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఎన్నికల సమయంలో ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలను సానుకూలంగా పరిశీలించి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఆత్మహత్యలు సమస్యలకు పరిష్కారం కావు. అవి కుటుంబానికి మరింత బాధను మిగుల్చే నిర్ణయాలు. ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి. కలిసి పోరాడుదాం... న్యాయమైన హక్కులను సాధించుకుందాం. కార్మికుల సంక్షేమం కోసం బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ మీకు అండగా ఉంటుంది” అని పునరుద్ఘాటించారు. శంకర్ గౌడ్ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించి, కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం కల్పించాలని కోరారు.



## కోటకొండలో వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన వ్యవసాయ మార్కెట్ చైర్మన్ సదాశివరెడ్డి డైరెక్టర్ శరణప్ప

**(అక్షర కలం, నారాయణపేట, జిల్లా రిపోర్టర్, ఏప్రిల్,24)**

నారాయణపేట మండలం కోటకొండ గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వారి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు నారాయణపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సదాశివారెడ్డి డైరెక్టర్ శరణప్ప కోటకొండ ఐకెపి మహిళా సంఘం 1 ఆధ్వర్యంలో ఒక వరి కొనుగోలు కేంద్రం, అభిరామి రైతు ఉత్పత్తి దారుల ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులందరూ వరి కొనుగోలు కేంద్రాల దగ్గరికి వరి పంట ఇవ్వాలని ప్రభుత్వం రైతులకు లాభాదాయక మద్దతు ధర ఇస్తుందని కాబట్టి రైతులందరూ వరి పంట కొనుగోలు కేంద్రాలకే వరి పంట ఇవ్వాలని, రైతులకు ఆయన విజ్ఞప్తి



చేశారు రైతులకు , రైతులు తమకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా మా దృష్టికి తీసుకురావాలని అన్నారు , అలాగే వరి కొనుగోలు కేంద్రాలు వారు కూడా రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా రైతులు వచ్చిన వారికి తాగడానికి మంచినీరు సంచులు అన్ని అందుబాటులో ఉంచాలని వారికి కూడా సూచన చేశారు, ఈ కార్యక్రమంలో కోటకొండ సర్పంచ్ వెంకట్రాములు గౌడ్, మాజీ సర్పంచ్ జయలక్ష్మి, తిరుమలాపురం సర్పంచ్ లక్ష్మయ్య ఉపసర్పంచ్ రాజు ఊట కుంట తండా సర్పంచ్ వెంకట నాయక్, బండ గుండ సర్పంచి రాంచందర్, అభంగాపురం సర్పంచ్ రవి, అధికార ప్రతిపక్షాల అన్ని గ్రామాల తాజా మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ కార్మికుడు శంకర్ గౌడ్కు ఘనంగా నివాళులర్పించిన ఎ ఐ టి యు సి నాయకులు.

ఆర్టీసీ కార్మికుల సమ్మెకు మద్దతుగా ఏఐటీయూసీ ధర్నా నిరసన.



**అక్షర కలం / ఇల్లందు.**

ఎఐటియుసి అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ గుర్తింపు సంఘం ,ఆద్వర్యంలో తెలంగాణ వ్యాప్తంగా ఆర్టీసీ కార్మికుల సమ్మెకు తమ సంపూర్ణ మద్దతు తెలుపుతూ ఇల్లందు బస్సు డిపో వద్ద ఆందోళన, నిరసన నిర్వహించి సమ్మె పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వం తీరుకు మానసికంగా కృంగిపోయి ఆత్మహత్యాయత్నం చేసుకొని మృతి చెందిన శంకర్ గౌడ్ మౌనం పాటించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా హజరైన ఎఐటియుసి జిల్లా కార్యదర్శి దేవరకొండ శంకర్, గుర్తింపు సంఘం బ్రాంచ్ కార్యదర్శి ఎండి నజీర్ అహ్మద్, ఉపాధ్యక్షులు దాసరి రాజామ్ సిపిఐ మండల కార్యదర్శి బొప్పిశెట్టి సత్యనారాయణ లు మాట్లాడుతూ నిన్నటి రోజు జరిగిన ఆర్టీసీ కార్మికుడు నర్సంపేట బస్టాండ్ లొ ఆత్మహత్యాయత్నం చేసుకోవడం వారు మృతి చెందడం బాధాకరమని సంవత్సరాల తరబడి వారి సమస్యల పరిష్కారానికి వారు పోరాటం చేయడం జరుగుతుందని వారు అన్నారు ఆర్టీసీ కార్మికులు చేస్తున్నటువంటి న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కారంచేయాలని ,ఎన్నికల ముందు ఇచ్చినటువంటి హామీ నెరవేర్చాలని,ఆర్టీసీ సంస్థను కార్మికులను ప్రభుత్వం లోవిలీనం చేస్తామన్న హామీ అమలు చేయాలని, ఆర్టీసీ కార్మికులకు పని భద్రత కల్పించాలని, ఆర్టీసీ కార్మికుల రెండు సవరణ ఒప్పందాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కొత్త బస్సులు కొనుగోలు చేయాలని, ఆర్టీసీ పరిరక్షణ కోసం ప్రభుత్వం కృషి చేయాలని, తదితర అనేక డిమాండ్ సాధన కోసం ఆర్టీసీ రాష్ట్రవ్యాప్తంగాజరుగుతున్నటువంటి ఈ ఆందోళన న్యాయబద్ధమైనదని,గత ప్రభుత్వం బిఆర్ఎస్ తప్పిదాల వల్ల కార్మికులకు అన్యాయం జరిగిందని ఈ ప్రభుత్వంలొ నైనా మాకు న్యాయం జరుగుతుందని వారు ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. వెంటనే పరిష్కారం కోసం కృషి చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మృతి చెందిన శంకర్ గౌడ్ కుటుంబానికి కోటి రూపాయల పరిహారం ప్రభుత్వం ఇవ్వాలని వారు డిమాండ్ చేసారు. ఈకార్యక్రమంలో ఆర్టీసీ ఎంప్లాయిస్ యునియనియన్ నాయకులు ,స్టాఫ్ అండ్ వర్కర్స్ యునియన్ నాయకులు వేంకటేశ్వర్లు, ఎఐటియుసి ఫిట్ కార్యదర్శులు నాదెండ్ల శ్రీనివాస్ రెడ్డి, మాలోత్ హరిసింగ్, జీఎం కమిటీ సభ్యులు బొల్లెద్దుల శ్రీనివాస్,ఎఐటియుసి డివిజన్ అద్యక్షులు జంగంపల్లి మోజేస్, తిలక్ నగర్ ఉప సర్పంచ్ షెక్ ఖాసిం, పెరుగు వేంకటేశ్వర్లు,రంజిత్ కుమార్,పర్వేజ్ అహ్మద్, నవీన్ కుమార్, సంతోష్ కుమార్, పప్పుల రాజ్ కుమార్, విజయ్ కుమార్, బాబురావు, ఎస్కే వలి, వేంకటేశ్వర్లు, రామకృష్ణ, ఎస్కే ఇమ్రాన్ ,సద్దాత్ హూసేన్ ,కోటయ్య,రాజయ్య, బల్లెం జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

## స్వీయ గణన ద్వారా జనగణన వేగవంతం .. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 24:**

జనగణన– 2027లో భాగంగా స్వీయ గణన ప్రక్రియ నిర్వహణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ప్రకటనలో తెలిపారు. జన గణనను రెండు విడతలుగా నిర్వహించడం జరుగుతుందని, మొదటి విడతలో మే 11వ తేదీ నుండి జూన్ 9వ తేదీ వరకు ఇండ్ల గణన, రెండవ విడతలో జనగణన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.



డిజిటల్ సాంకేతికతను ఉపయోగించి నాణ్యమైన, స్పష్టమైన జాబితా రూపొందించడం జరుగుతుందని, ఇందు కొరకు ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లకు తగు శిక్షణ అందించడం జరుగుతుందని తెలిపారు. స్వీయ గణన కార్యక్రమం నిర్వహణలో ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు, ప్రముఖ వ్యక్తులు, గణన అధికారులు, యువత, స్వయం సహాయక సంఘాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఏప్రిల్ 26వ తేదీ నుండి మే 10వ తేదీ వరకు స్వీయ గణన పోర్టల్ అందుబాటులో ఉంటుందని, జిల్లాస్థాయి జనగణన అధికారులు ప్రతిరోజు స్వీయ గణన వివరాలను నవీకరించాలని తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాలు, గ్రామపంచాయతీలు, మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీలలో స్వీయ గణనపై ప్రజలందరికీ తెలిసే విధంగా విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు. జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు స్వీయ గణన కార్యక్రమ కార్యచరణను పకడ్బందీగా అమలు చేయాలని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలు జనాభా ప్రాతిపదికన చేపట్టడం జరుగుతుందని, ఈ క్రమంలో స్పష్టమైన జాబితా రూపొందించేందుకు జిల్లా ప్రజలు సహకరించాలని తెలిపారు. ఏప్రిల్ 26వ తేదీ నుండి మే 10వ తేదీ వరకు ఆన్ లైన్ లో ష్ట్రజూం://ఎ.ఎవఅంబం.న్ర్తశీజ.ఱఅ వెబ్ సైట్ ద్వారా స్వీయ గణన చేసుకోవచ్చని, జనగణలో భాగంగా అధికారులు ఇంటికి వచ్చినప్పుడు స్వీయ గణన ఐడి అందించవచ్చని తెలిపారు. జన గణన కొరకు అధికారులు వచ్చిన సమయంలో ప్రజలు వాస్తవ సమాచారాన్ని అందించాలని తెలిపారు. దినపత్రికలు, లోకల్ కేబుల్ చానళ్లు, వాట్సాప్ గ్రూపులు, సోషల్ మీడియా, కార్యాలయాలలో ప్రదర్శన ద్వారా ప్రజలందరికీ తెలిసేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు.

## జన సమితి ప్లీనరీ పోస్టర్ ఆవిష్కరణ:

**హైదరాబాద్ : ఏప్రిల్ 24, ( అక్షర కలం న్యూస్ ):**

తెలంగాణ జన సమితి రాష్ట్ర ప్లీనరీ సమావేశాలకు భారీ ఎత్తున తరలిరావాలని జన సమితి గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎం నరసయ్య ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ముషీరాబాద్ జన సమితి కన్వీనర్ మెరుగు శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో రాంనగర్ చౌరస్తాలో ఏర్పాటుచేసిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగవ ప్లీనరీ సమావేశాలలో కోదండరాం సార్ నాయకత్వంలో పలు రాజకీయ, విధాన నిర్ణయాలను చేయనున్నట్లు వెల్లడించారు. ఈ సభలకు ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నగర ప్రధాన కార్యదర్శి బట్టల



రామచందర్,బీసీ జన సమితి కన్వీనర్ ఎస్ జస్వంత్ కుమార్, నగర ఉపాధ్యక్షులు జైపాల్ రెడ్డి ,ఎం లక్ష్మణ్ , అడిక్ మట్ డివిజన్ అధ్యక్షుడు కాకునూరి సుధాకర్, గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు గుండెల్లి రవీందర్ యాదవ్ , నాయకులు సదానంద్, మాణిక్యం , ఎల్ సత్యనారాయణ, శంకర్, మహేందర్, గడ్డం శంకర్, గడ్డం ప్రభాకర్, గుండెల్ని రాజు, వేములకొండ కుమారస్వామి, సిహెచ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పథకంలో ఉపాధి కూలీల సంక్షేమం దిశగా చర్యలు..జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 24:**

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా జరుగుతున్న అభివృద్ధి పనులలో ఉపాధి హామీ కూలీల సంక్షేమం దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. శుక్రవారం జిల్లాలోని భీమిని మండల కేంద్రంలో కొనసాగుతున్న ఉపాధి హామీ పని ప్రదేశాలను జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, మండల



పరిషత్ అభివృద్ధి అధికారి గంగామోహన్ లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, ఉష్ణోగ్రత తీవ్రమవుతున్న దృష్ట్యా ఉదయం 6 గంటలకు పని ప్రదేశానికి చేరుకొని 11 గంటల లోగా ఇళ్లకు చేరుకునేలా చర్యలు తీసుకోవాలని, పని ప్రదేశాలలో నీడ, త్రాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామంలో రహదారులు, నిబంధనల ప్రకారం వ్యక్తిగత సంబంధిత పనులు మంజూరు చేస్తామని, కూలీలు 100 రోజుల పని పూర్తి చేసుకోవాలని తెలిపారు. గ్రామ సభల ద్వారా గుర్తించిన పనుల నిర్వహణకు చర్యలు



తీసుకోవడం జరుగుతుందని, ఇందిరమ్మ ఇండ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు 90 రోజుల పని దినాలను ఉపాధి హామీ పథకం ద్వారా కల్పించడం జరుగుతుందని తెలిపారు. అవసరం అయిన వారికి ఇంకుడు గుంతలు, పశువుల షెడ్లు, ఫారం పాండ్లు, చాపల చెరువులు వంటి పనులను మంజూరు చేస్తామని తెలిపారు. పనుల నిర్వహణలో నిబద్ధతతో పనిచేస్తున్న భీమిని, బిట్టూరుపల్లి, చిన్న గుడిపేట క్షేత్ర సహాయకులు లీలావతి, సాయిరాం, సత్యనారాయణ లను శాలువాలతో సత్కరించి నగదు బహుమతి అందజేశారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వార్డులు, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, గర్భిణులు ఆసుపత్రులలోనే ప్రసవాలు చేసుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. సాధారణ ప్రసవాలు, సిజేరియన్ల వివరాలు తెలుసుకొని వైద్యులకు పలు సూచనలు చేశారు. ఆసుపత్రిలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందుల నిల్వలు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. మండల తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి తహశీల్దార్ బికర్ణదాస్ తో కలిసి హాజరు పట్టిక, భూభారతి దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించారు. ఉద్యోగులు, అధికారులు, సిబ్బంది విధుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, భూ భారతి రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి రికార్డులతో సరిచూసి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. భీమిని మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన గ్రామసభకు అధికారులతో కలిసి హాజరయ్యారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంచాయితీరాజ్ వ్యవస్థ ద్వారా గ్రామ అభివృద్ధికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని, పరిపాలన సౌలభ్యం కొరకు గ్రామ సర్పంచ్, ఎంపిటిసి, ఎంపిపి, జిల్లా పరిషత్ వ్యవస్థల ద్వారా ప్రభుత్వం మంజూరు చేసిన అభివృద్ధి పనులను చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ప్రజాప్రతినిధులు ప్రజలకు జవాబుదారీతనంతో వ్యవహరించాలని, క్షేత్రస్థాయిలో స్థానికత కలిగిన ప్రజా ప్రతినిధులకు సమస్యలపై పూర్తి అవగాహన ఉంటుందని, తద్వారా సమస్యల పరిష్కారం సులభతరం అవుతుందని, అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అద్దుతాయని తెలిపారు. ఉపాధి హామీ పథకం, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు వంటి ప్రభుత్వం పథకాలు విజయవంతం కావడంలో ప్రజల భాగస్వామ్యం అవసరమని తెలిపారు. గ్రామ అభివృద్ధిలో భాగంగా ఏర్పాటు చేసిన గ్రామసభకు అధికారులు, ప్రజా ప్రతినిధులు బాధ్యతలు హాజరుకావాలని, గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు ఆస్కారం ఉంటుందని తెలిపారు. అనంతరం కన్నేపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఆసుపత్రిలోని వార్డులు, మందుల నిల్వలు, పరిసరాలను పరిశీలించారు. వేసవి అయినందున వడదెబ్బకు గురి కాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను ప్రజలకు వివరించాలని తెలిపారు. ఆసుపత్రికి వచ్చే వారికి మెరుగైన వైద్య సదుపాయాలు అందించాలని, వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంల సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రజలకు తెలిసేలా వాస్తవాలను ప్రచురించాలి







## జిల్లా కలెక్టర్, జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ కుమార్ దీపక్

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 24:**

మీడియా సంస్థలు ప్రజలందరికీ వాస్తవాలు తెలిసేలా వార్తలు ప్రచురించాలని జిల్లా కలెక్టర్, జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ చైర్మన్ కుమార్ దీపక్ తెలిపారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా పౌర సంబంధాల అధికారి, జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ కన్వీనర్ మాదంశెట్టి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన



కమిటీ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, దినపత్రికలు, న్యూస్ చానళ్లు ప్రజలకు వాస్తవాలను తెలియజేయాలని తెలిపారు. 2026–28 సంవత్సరాలకు గాను ప్రభుత్వ ఉత్తర్వులు 252, ఆర్ టి 103 ప్రకారం అర్హత గల వర్కింగ్ జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు జారీ చేయడంలో కమిటీ ప్రభుత్వ ఉత్తర్వుల మార్గదర్శకాలను పాటించాలని తెలిపారు. సరైన గుర్తింపు, అర్హత లేనివారు పాత్రికేయులుగా చలామణి కావడంతో అసలైన పాత్రికేయులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని కమిటీ సభ్యులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురాగా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అక్రిడిటేషన్ కోసం ఆన్ లైన్ లో అందిన దరఖాస్తులను కమిటీ సభ్యులు క్షుణ్ణంగా పరిశీలించి అర్హత గల వారిని ఎంపిక చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు అల్లువెల్లి రమేష్ రెడ్డి, గొల్లపల్లి సిద్ధార్థ, పార్వతి సురేష్ కుమార్, దేగ సత్యనారాయణ, మొహమ్మద్ ఇమాద్ ఉద్దీన్, రూపిరెడ్డి ప్రకాష్ రెడ్డి, అయినంపూడి నవీన్ కుమార్, గొల్లన నరేష్, బెక్కం సదానందం, మొదంపురం సంతోష్, జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయ సిబ్బంది కొల్లూరి సంపత్ కుమార్, జి రవితేజ, మంత్రి సునీల్ కుమార్ లు పాల్గొన్నారు.

## ప్రభుత్వాలకు గొప్పలు... సింగరేణికి అప్పులు...

**మందమర్రి, ఏప్రిల్ 24 అక్షర కలం:**

పేరు కోసం లాభాలను గొప్పగా చూపించిన ప్రభుత్వం, ప్రజా ప్రజాప్రతినిధులు సింగరేణికి ఇతర ప్రభుత్వరంగ సంస్థల నుండి రావాల్సిన బకాయిలు పేరుకుపోతుంటే వాటిపై అంతే గొప్పగా ఎందుకు చెప్పడం లేదని, దానివల్ల సంస్థకు రావాల్సిన బకాయిలు పేరుకుపోయి, ఆర్థిక సంక్షోభంలోకి కూరుకుపోయి, జీతాల కోసం బ్యాంకుల చుట్టూ తిరుగుతుందని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తుమ్మల రాజారెడ్డి ఆరోపించారు.



సింగరేణికి రావాల్సిన బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ, విద్యుత్ సంస్థల ముఖ్య కేంద్రమైన విద్యుత్ సౌధ వద్ద భారీ నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏరియాలోని కేకే 5 గనిపై చలో విద్యుత్ సౌధ కార్యక్రమం వాల్ పోస్టర్ లను విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరు కాగా, ఈ సందర్భంగా పలువురు కార్మికులు యూనియన్ లో చేరగా, వారికి ఆయన యూనియన్ కండువాలు కప్పి సాదరంగా యూనియన్ లోకి ఆహ్వానించారు. అదేవిధంగా ఏరియా వర్క్ షాప్ లో నిర్వహించిన సమావేశంలో సైతం చలో విద్యుత్ సౌధ వాల్ పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ, ఇప్పటివరకు వినతి పత్రాలు తీసుకున్న ప్రభుత్వ, ప్రజాప్రతినిధులు ఒక్కరూ సంస్థ బకాయిలపై స్పందించకపోగా, చివరకు అసెంబ్లీలో ఈ అంశాన్ని ప్రస్తావించకపోవడం చాలా దారుణమన్నారు. డబ్బులు లేక కార్మికులకు నాణ్యమైన పనిముట్లు, బూట్లు, ఇవ్వకపోవడం వల్ల పని స్థలాల్లో ఇబ్బందులు పడుతున్నా, కార్మికులు మెరుగైన ఉత్పత్తి సాధిస్తూ, ఆరోగ్య ఇబ్బందులకు గురవుతుంటే న్యాయంగా జరగాల్సిన మెడికల్ బోర్డును ఆపి, సీనియర్ కార్మికులను మరింత మానసిక కుంగూబాటుకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఎంచుకున్న రంగంలో ఏకాగ్రతతో నైపుణ్యత సాధించాలి.. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 24:**

నిరుద్యోగ యువత తాము ఎంచుకున్న రంగంలో ఏకాగ్రతతో నైపుణ్యత సాధించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో సంక్షేమ వారంలో భాగంగా షెడ్యూల్డ్ కులములు, షెడ్యూల్డ్ తెగలు, వెనుకబడిన తరగతులు, మైనారిటీ యువతకు ఏర్పాటుచేసిన నైపుణ్యాభివృద్ధి, కెరీర్పై అవగాహన సదస్సుకు జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య, షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి అధికారి చాతరాజుల దుర్గాప్రసాద్, మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతి, ఎటిసి ప్రిన్సిపాళ్లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, నిరుద్యోగ యువత తాము ఎంచుకున్న రంగాలలో ఏకాగ్రతతో నైపుణ్యత సాధించి జీవితంలో స్థిరపడాలని తెలిపారు. వృత్తి విద్య కోర్సులలో ఆధునిక సాంకేతికతను అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ల ద్వారా ప్రభుత్వం అందిస్తుందని, ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. తాము ఎంచుకున్న కోర్సులను ఏకాగ్రతతో నేర్చుకోవాలని, తరగతులకు తప్పనిసరిగా హాజరుకావాలని తెలిపారు. ప్రైవేట్ సంస్థలలో ఉద్యోగరంగంలో రాణించాలంటే నైపుణ్యత తప్పనిసరి అని, నేర్చుకునే ప్రతి అంశం, చేస్తున్న పనిలో ఉపయోగపడుతుందని తెలిపారు. ఎంచుకున్న సబ్జెక్టులో పూర్తి అవగాహన ఉండాలని తెలిపారు. జర్మన్ దేశంలో ఎలక్ట్రీషియన్, డ్రైవర్, నర్సింగ్ రంగాలకు అవసరం ఉందని, నైపుణ్యత గల వారిని ఎంపిక చేసి జర్మన్ భాషను నేర్పించి ఉపాధి కల్పించడం జరుగుతుందని తెలిపారు. విదేశాలలో వస్తున్న అవకాశాలకు నైపుణ్యత, అనుభవం తప్పనిసరిగా ఉండాలని, కోర్సు అనంతరం అప్రెంటిస్ షిప్ ద్వారా మరింత నైపుణ్యత నేర్చుకోవాలని తెలిపారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు జాబ్ మేళాలు నిర్వహించి అవకాశం ఉన్న చోట ఉద్యోగం కల్పించడం జరుగుతుందని, యువత తాము ఎంచుకున్న కోర్సును ఏకాగ్రతతో నేర్చుకుని, నైపుణ్యత సాధించినట్లయితే మంచి ఫలితాలు వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# మారుమూల గ్రామాల్లో 'బిఎస్ఎన్ఎల్' సేవలు మెరుగుపరచాలి

## ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి క్యాంపు కార్యాలయంలో జరిగిన టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో అధికారులకు సూచించిన టీఏసీ సభ్యులు

**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:**

ఖమ్మం: గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో బీఎస్ఎన్ఎల్ సిగ్నల్ సమస్యలను తక్షణమే పరిష్కరించి, వినియోగదారులకు వేగవంతమైన ఇంటర్నెట్ సేవలు అందించాలని టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ(టీఏసీ) సభ్యులు బిఎస్ఎన్ఎల్ అధికారులను కోరారు. శుక్రవారం ఖమ్మంలోని



ఎంపీ క్యాంపు కార్యాలయంలో టీఏసీ సభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న నెట్‌వర్క్ ఇబ్బందులపై కమిటీ సభ్యులు అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు.సమావేశంలో కమిటీ సభ్యులు ఉమ్మినేని కృష్ణ, ఇమామ్ భాయ్, రంజిత్ నాయక్, మచ్చా రామారావు, సత్యనారాయణ రెడ్డి తదితరులు మాట్లాడుతూ పలు కీలక సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అనేక అంశాల ప్రస్తావన..కూసుమంచి ప్రాంతంలో ఇంటర్నెట్ సేవలు అత్యంత పేలవంగా ఉన్నాయని, ఈ సమస్యను పరిష్కరించాలని, వినియోగదారుల కోసం బీఎస్ఎన్ఎల్ ఖమ్మం కార్యాలయంలో సిమ్ కార్డులు నిరంతరం అందుబాటులో ఉంచాలని కోరారు. బోనకల్, చింతకాని మండలాల్లో నెట్‌వర్క్ పరిధిని విస్తరించేందుకు మరిన్ని నూతన టవర్లను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ?గోవిందాపురం గ్రామంలో బీఎస్ఎన్ఎల్ సిగ్నల్ అస్సలు అందడం లేదని, అధికారులు వెంటనే గ్రామాన్ని సందర్శించి పరిశీలించాలని కోరారు. వైరా, బ్రాహ్మణపల్లి, ఉప్పలమడక గ్రామాల్లో నెలకొన్న సిగ్నల్ సమస్యలను పరిష్కరించాలన్నారు.

**నూతన టవర్ల ఏర్పాటుకు తీర్మానం**

ఖమ్మం రూరల్ మండలం కస్నా తండా, నగరంలోని ఇందిరానగర్, గోశాల ప్రాంతాల్లో మెరుగైన సిగ్నల్ కోసం నూతన టవర్ల ఏర్పాటు అంశాన్ని త్వరితగతిన ఆచరణలోకి తేవాలని సమావేశం తీర్మానించింది.

**అధికారుల అభయం..**

టీఏసీ సభ్యుల విజ్ఞప్తులపై బిఎస్ఎన్ఎల్ డీజీఎం రాజశేఖర్, ఏజీఎం స్పందిస్తూ.. సమస్య తీవ్రతను బట్టి ప్రాధాన్యత క్రమంలో అవసరమైన చోట కొత్త టవర్లను నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఎంపీ రఘురాంరెడ్డి సూచనల మేరకు పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించి, సిగ్నల్, ఇంటర్నెట్ సేవలకు ఆటంకం కలగకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# మన భూమి మన ఆత్మగౌరవం కోకపేట ముదిరాజ్ సంఘం

**చలో ముదిరాజ్ మే3 న వంటవార్పు కోకపేట ముదిరాజ్ భూమి**

**జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్ ముదిరాజ్ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు**



**అక్షర కలం సిద్దిపేట ఏప్రిల్ 24:**

తెలంగాణ రాష్ట్రంలో కెసిఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు 2014 లెక్కల ప్రకారం ముదిరాజులు 45 లక్షల జనాభా ఉంటే ఈ సంవత్సరం రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో 26 లక్షలకు చూయించడం ముదిరాజుల పైన ముదిరాజ్లకు అనుమానం కలిగిస్తుంది అదేవిధంగా ముదిరాజులకు కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన కోకాపేటలోని ముదిరాజ్ సంఘం భవన నిర్మాణ భూమి 5 ఎకరాలు అన్యక్రాంతం కాకుండా కాపాడుకోవడానికి వచ్చే నెల మే 3 వ తేదీన కోకాపేటలో ని ముదిరాజ్ ఆత్మగౌరవ భూమిలో వంటవార్పు కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి రాష్ట్రంలోని నలుమూలల ఉన్న ముదిరాజులు భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు ఇట్టి కార్యక్రమంలో జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్, చెరుకు నారాయణ,గుడిపల్లి వికాస్, దయ్యాల నాగరాజ్, చిట్యాల శ్రీనివాస్ లు పాల్గొన్నారు.

# ఆర్టీసీ కార్మికుల సమ్మెకు బీఎస్పీ పార్టీ సంపూర్ణ మద్దతు..జిల్లా అధ్యక్షుడు పుల్లూరు ఉమేష్

**అక్షర కలం సిద్దిపేట ఏప్రిల్ 24:**

బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) సిద్దిపేట జిల్లా ఆధ్వర్యంలో నేడు సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో సమీపంలో సమ్మె చేస్తున్న ఆర్టీసీ కార్మికులకు సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు పుల్లూరు ఉమేష్ మాట్లాడుతూ, ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లకు బీఎస్పీ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. ఆర్టీసీ కార్మికులు చాలా కాలంగా ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ముఖ్యంగా ఆర్టీసీని వెంటనే ప్రభుత్వంలో విలీనం చేయడం, కార్మికులకు సరైన వేతనాలు, భద్రత కల్పించడం, పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే చెల్లించడం వంటి అంశాలపై ఆయన గట్టిగా



పట్టు పట్టారు. కార్మికుల హక్కులను కాపాడేలా సంఘాలకు ప్రాధాన్యం ఇవ్వాలని, కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యే వరకు బీఎస్పీ పార్టీ ఎల్లప్పుడూ వారి పక్షాన నిలబడుతుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి లింగంపల్లి యాదగిరి, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు రోమాల బాబు, అసెంబ్లీ అధ్యక్షులు కొండపలక సంపత్, అజయ్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మం లో పలువురికి ఎంపీ రవిచంద్ర పరామర్శ

**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:**

ఇటీవల కాలంలో ఖమ్మం నగరంలో మృతి చెందిన పలువురి కుటుంబ సభ్యులను రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర శుక్రవారం పరామర్శించారు. దంసలాపురం లోని అగ్రహారంలో నివాసం ఉండే ఆళ్ల వెంకటరెడ్డి చిత్ర పటానికి నివాళులు అర్పించిన అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. తనయులు శేష వర్ధన్ రెడ్డి, అంజిరెడ్డి, అల్లుళ్లు బీరెడ్డి నాగచంద్రారెడ్డి, సత్య వర్ధన్ రెడ్డిలను ఓదార్చి, సానుభూతి తెలిపారు. అనంతరం శ్రీరామ్ హిల్స్ లో నివాసముండే కమర్తపు బతుకమ్మ కొద్ది రోజుల క్రితం చనిపోగా ఆమె తనయులు కమర్తపు మురళి, రవిందర్, కుటుంబ సభ్యులు కూరపాటి వెంకటేశ్వర్లు, డాక్టర్ కూరపాటి ప్రదీప్ లను ఓదార్చి, సానుభూతి తెలిపారు. అనంతరం మధిరలో నివాసముండే తన సమీప



బంధువు ఆది వెంకటేశ్వర్లు (పెద్దబ్బాయ్) ఇంటికి వెళ్లి ఆయన చిత్రపటానికి అంజలి ఘటించారు. అనంతరం ఆయన కుమారులు, కుటుంబ సభ్యులను పరామర్శించారు ఈ కార్యక్రమాల్లో ఎంపీ రవిచంద్ర వెంట మాజీ జిల్లా



పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేటర్లు సాగర్, గుణ చరిత్, మహేష్ తదితరులు ఉన్నారు.

# నేడు మంత్రి చేతుల మీదుగా కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ.....

**మెదక్ /కొల్చారం, ఏప్రిల్ 24(అక్షర కలం):-**

మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గం కొల్చారం మండలం లోని వివిధ గ్రామాలకు చెందిన కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులను మెదక్ ఇన్చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి చేతుల మీదుగా నర్సాపూర్ లోని సాయి కృష్ణ గార్డెన్ లో నేడు చెక్కుల పంపిణీ జరుగుతుందని కొల్చారం



తాసిల్దార్ శ్రీనివాస్ చారి ఒక ప్రకటనలో తెలిపారు. ఇట్టి అవకాశాన్ని లబ్ధిదారులందరూ సద్వినియోగం చేసుకోవాలని కొల్చారం కొల్చారం తాసిల్దార్ శ్రీనివాస్ చారి తెలిపారు.

# రామాలయం నందురామ కీర్తనలపై నాట్య ప్రదర్శన.

**అక్షర కలం / భద్రాచలం**

శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానము భద్రగిరి పునర్వసు నక్షత్ర గిరి ప్రదక్షణ మహోత్సవము తొలి వసంతము పూర్తి చేసుకున్న శుభ సందర్భములో ప్రముఖ వాగట?యకారులు శ్రీ భక్త రామదాసు పదో వ వారసులు శ్రీ కంచెర్ల శ్రీనివాసు దాసు గారి పిలుపు మేరకు శ్రీ శక్తి సేవా సత్సంగ్ వ్యవస్థాపకులు శ్రీమతి మీనాక్షి శ్రీనివాస్ కళాబృందములుఆంధ్రతెలంగాణతెలుగురాష్టాలనుండి నాట్యగురు శ్రీమతి అనూష శిష్య బృందము,శ్రీమతి ప్రియదర్శిని శిష్య బృందము చే దేవస్థానచిత్రకూటమండపమునందు అధ్యంతంకన్నుల పండువగా సాగింది చిన్నారులు రామ కీర్తనలపై నాట్యప్రదర్శనచేస్తూ భక్తుల ప్రశంసలు అందుకున్నారు తోలుతఈసంస్థకోలాటకళాకారులూ పొన్నూరు కు చెందిన శ్రీమతి జ్యోతి బృందము తమ కోలాటప్రదర్శనతో భద్రాద్రి గిరిప్రదక్షన లో పాల్గని రామ దీక్షకులు,రామదాసు వంశీయులుతోపురావీధులలోకోల ాటప్రదర్శనతో భక్తి ప్రపత్తులతో ఓలలాడించారు. ఈ సందర్భముగా శ్రీమతి మీనాక్షి శ్రీనివాస్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలలో సుమారు డెభై ప్రముఖ దేవాలయాలలో సాంస్కృతిక కళా వైభవమును ప్రదర్శిస్తూ కళా సేవను నిర్వహిస్తున్నమని ఆ రామచంద్రుని సేవలో అయోధ్య రామదార్బార్, ఒంటిమిట్ట,అమ్మపల్లె,వంటి పుణ్య క్షేత్రలతోపాటు,కాశి,కంచి,యాగంటి, మహానంది,కడప,నందవరం,నందలూరు,తాళ్లపాక,శ్రీకూర్మం,శ్రీకాకుళం,అరసవిల్లి,అరకు,విజయవాడ,రాజమండ్రి,అయినవిల్లి, ర్యాలీ,అప్పనపల్లి,చిలుకూరు,అమ్మపల్లి,ఉద్దమర్రి,వంటి దివ్య పుణ్యక్షేత్రములతో పాటు ఇటీవల శ్రీరామనవమి సందర్బంగా శ్రీలంక రామాయణ యాత్రలో భాగం గా అశోక వాటికలోశ్రీసీతారామచంద్రస్వామిదేవాలయంలోనునాట్యకైంకర్యాన్నినిర్వహించామని తెలియచేసారు తమసంస్థకళాకారులకుఇంతటివిశేషఅవకాశాన్ని కల్పించిన ఈఓ.దామోదరావుకిమరియుదేవాలయప్రధానఅర్చకసిబ్బందికి,శ్రీరామదాస పదో వ తరము వారసులకు ప్రత్యేక అభినందనలు తెలియచేసారు



# ఏకగ్రీవంగా ఎన్నిక

**అధ్యక్షుడు డా,,డి.ప్రవీణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి డా,,బి.సైదులు,**

**అక్షర కలం / భద్రాచలం**





భద్రాద్రి కొత్తగూడెంజిల్లాలోతెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం (మోడ్రన్ మెడిసిన్) యూనిట్‌కు రెండు వేల ఇరవై ఆరు మరియు రెండు వేల ఇరవై ఎనిమిదికాలానికినిర్వహించిన ఎన్నికలు ప్రశాంతంగా.ఏకగ్రీవంగా పూర్తయ్యాయి.ఈ ఎన్నికలలో మొత్తంఆరునామినేషన్లుదాఖలవగా, అవన్నీ చెల్లుబాటు కావడంతో అన్ని పదవులకు పోటీ లేకుండానే అభ్యర్థులుఏకగ్రీవ ంగాఎన్నికయ్యారు.అధ్యక్షుడిగా డా,,దుబ్బాసి.ప్రవీణ్ కుమార్,ప్రధాన కార్యదర్శిగా డా,,బి. సైదులు,కోశాధికారిగా డా,,భూక్య. వీరబాబు,ఎన్నికయ్యారు.జనరల్ కౌన్సిల్ సభ్యులుగా డా,,రామవత్. బలోజి,డా,,ఆర్.కరుణాకర్, డా,,షేక్. అజహర్ బాబా,ఎంపికయ్యారు. ఎన్నికలప్రక్రియలోఎటువ ంటితి రస్కం ఇలులేదాఉపసంహరణలునమో దుకాకుండా.మొత్తంఆరునామినేషన్లు చెల్లుబాటు కావడం విశేషం. కొత్తగా ఎన్నికైన కమిటీకి వైద్యుల నుండిఅభినందనలువెల్లువెత్తుతున్నాయి.తమ పదవీకాలంలో వైద్యుల సమస్యల పరిష్కారం కోసం కృషిచేయాలనిఆకాంక్షవ్యక్తమవుతోంది.

# ప్రజా సమస్యలపై నిరంతరం పనిచేయడమే కామ్రేడ్ మడెం లక్ష్మికి మనం ఇచ్చే ఘన నివాళి.

**అక్షర కలం / భద్రాచలం**

క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలపై నిరంతరం పనిచేయడమేఅమరజీవి కామ్రేడ్ మడెం లక్ష్మికి మనమిచ్చే ఘన నివాళి అని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబి నర్సారెడ్డి జిల్లా కమిటీ సభ్యులు బండారు శరత్ బాబులు అన్నారు. భద్రాచలం గ్రామ పంచాయతీ మాజీ పదమూడో వ వార్డు మెంబర్,గిరిజన సంఘం నాయకురాలు ఆదివాసి బిడ్డ అమర జీవి కామ్రేడ్ మడెం లక్ష్మి ప్రధమ వర్ధంతి డబుల్ బెడ్ రూమ్ (కెసిఆర్ కాలనీ) మడెం లక్ష్మి నివాస స్థలమునందు జరిగింది. ముందుగా పార్టీ పతాకాన్ని పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి ఆవిష్కరించగా మడెం లక్ష్మి చిత్రపటానికి పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంపీ నర్సారెడ్డి జిల్లా కమిటీ సభ్యులు బండారు శరత్ బాబులు పూలమాలవేసి నివాళులు అర్పించారు.అనంతరం కుంజ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సభలో వారు మాట్లాడుతూ భద్రాచలం గ్రామపంచాయతీ



పాలకవర్గంలో సిపిఎం పార్టీ నుండి పదమూడో వ వార్డు మెంబర్ గా మడెం లక్ష్మి పనిచేశారని నీతిగా,నిజాయితీగా నిరంతరం ప్రజల సమస్యలపై పని చేస్తూ ప్రజల గుండెల్లో నిలిచారని అన్నారు. కడవరకు సిపిఎం పార్టీ వార్డు మెంబర్ గా ప్రజా సమస్యలపై పోరాడుతూ ఎర్ర జెండా నీడలో నిలిచారని అన్నారు.తమ వార్డు పరిధిలో రోడ్లు డ్రైన్లు విద్యుత్తు తదితరసమస్యలపైపాలకమండలిలో అధికారులకు విన్నవించిసాధించే వారిని అన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు పి.సంతోష్,పట్టణ కమిటీ సభ్యులు వుస్తెల.జ్యోతి, ఎస్.అజయ్ కుమార్, డి.రాఘవయ్య,శాఖా కార్యదర్శులు కాపుల.దుర్గారావు,సీత,కుంజ. విజయ,సారిక,కాపుల.లక్ష్మి,రమ, డివైఎఫ్ఐ కార్యదర్శి సతీష్,కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల డిమాండ్లను నెరవేర్చకుంటే ఉద్యమం తప్పదు .

**సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హెచ్చరిక..**

**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:**

ఆర్టీసీ కార్మికులు న్యాయమైన డిమాండ్లను నెరవేర్చకుంటే మరో ఉద్యమం తప్పదని సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శుక్రవారం జేఏసీ ఆధ్వర్యంలో ఆర్టీసీ కార్మికుడు కోలా శంకర్ గౌడ్ మృతికి నిరసనగా సమ్మెలో మూడవరోజు నోటికి నల్ల రిబ్బన్ కట్టుకుని బస్ డిపో నుండి పాత బస్టాండ్ సెంటర్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అనంతరం మానవహారం చేపట్టి రెండు నిమిషాల పాటు మౌనం పాటించి కోలా శంకర్ గౌడ్ కు నివాళులర్పించారు.. ఈ



సందర్భంగా సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు మాట్లాడుతూ కార్మికులు ఇప్పటికి ఇప్పుడే అనుకుని సమ్మె నోటీసు ఇవ్వలేదని.. 41 రోజుల క్రితమే సమ్మె నోటీసు ఇచ్చారన్నారు. సమ్మె ప్రారంభించడానికి ముందు కార్మిక సంఘాలతో చర్చలు జరిపిన మంత్రులు మరో నాలుగు వారాలు సమయం కావాలని కోరటం సమంజసం కాదన్నారు. వీరు పెట్టిన డిమాండ్స్ కూడా కొత్తవేమీ కాదనీ గత మూడు సంవత్సరాల నుండి యాజమాన్యం, కార్మికులు, ప్రజల మధ్య నలుగుతున్న డిమాండ్లేన్నారు. ఎన్నికల సమయంలో ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. కార్మికుల సమస్యల పరిష్కరించకుండా దొంగ దారిన బస్సులు నడపాలని చూసినప్పుడు కొంతమంది కార్మికులు నిస్పాయతకు గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల ఎవరు నిరాశ చెందవద్దని పోరాడి సాధించుకోవాలే కానీ ఆత్మహత్యలు పరిష్కారం కాదన్నారు. గతంలో జరిగిన 56 రోజుల పాటు జరిగిన సమ్మెలో సిపిఐ మొదటి రోజు నుండి చివరి వరకు కీలక పాత్ర పోషించిందనీ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ఏడు రోజులపాటు ఆమరణ హారదీక్ష చేసి సమస్యకు పరిష్కారం చూపారన్నారు. ఈ సమ్మెలో కూడా సిపిఐ మద్దతు పూర్తిస్థాయిలో ఉంటుందని కార్మికులకు ఆయన భరోసా ఇచ్చారు. . ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ ఖమ్మం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గాదే లక్ష్మీనారాయణ తోట రామాంజనేయులులి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోటు కళావతి, పగడాల మల్లేష్, పిడిఎస్ యు జిల్లా నాయకులు మస్తాన్ ,జేఏసీ చైర్మన్ పిల్లి రమేష్ కన్వీనర్స్ బిఎస్ రెడ్డి , ఎన్ . నాగయ్య, ఎల్ ఆర్ కే రావులి, ఎం ఆర్ నాథ్, పిట్టల సుధాకర్, జేఏసీ నాయకులు బేతంపూడి బుచ్చిబాబు, అనిత, రామలక్ష్మి, సుజాత, , స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ నాయకులు, మాధవరావు , రోశయ్య తదితరులు పాల్గొన్నారు.



అక్షర కలం
APTELRNI No. 2009/27246

# ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి

ఎమ్మెల్యే హరీష్ రావు దృష్టి కి తీసుకెళ్తాం,
రైతులకు అండగా ఉంటాం
సిద్దిపేట అర్బన్ మండలంలో పంట నష్టపోయిన గ్రామాల్లో
పర్యటించి బి ఆర్ ఎస్ నాయకులు





**అక్షర కలం సిద్దిపేట ఏప్రిల్ 24:**

సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్ పల్లి, కృష్ణ సాగర్, పొన్నాల గ్రామాల్లో నిన్న కురిసిన అకాల వర్షాలు, వడ గండ్ల వానలకు జరిగిన పంట నష్టం, తడిచిన ధాన్యాన్ని మండల బి ఆర్ ఎస్ నాయకులు పరిశీలించారు.. అర్బన్ మండలం సర్పంచ్ ల ఫోరమ్ అధ్యక్షులు బాలకృష్ణ రెడ్డి, సీనియర్ నాయకులు మాజీ వైస్ ఎంపీపీ అల్లం ఎల్లం, మండల పార్టీ అధ్యక్షులు ఎద్దు యాదగిరి లు ఆయా గ్రామాల సర్పంచ్ లతో కలసి పర్యటించారు.ఈ సందర్భంగా మాట్లాడుతు నిన్న కురసిన అకాల వర్షాలలు రైతు లకు తీవ్ర నష్టం జరిగిందని, అందోళన లో ఉన్న రైతు లను కలసి మనోధైర్యాన్ని ఇచ్చారు. చేతికొచ్చిన పంట నేల పాలయిందని ఆవేదన చెందారు. ఈ విషయం హరీష్ రావు ద్రుష్టి కి తీసుకెళ్లామని అధికారులతో మాట్లాడి అన్ని విధాలుగా అదుకుంటామని చెప్పారు.వ్యవసాయ అధికారలతో మాట్లాడి ప్రభుత్వానికి నివేదిక పంపాలని వారు కోరారు.అదేవిదంగా రైతు లు ఎవరు అందోళన చెంద్దొద్దని అధైర్య పడొద్దని చెప్పారు అండగా ఉంటామని భరోసానిచ్చారు.. అదేవిదంగా ఎన్సాన్ పల్లి, పొన్నాల గ్రామాల్లో తడిచిన వరి ధాన్యాన్ని పరిశీలించారు వెంటనే కొనుగోలు చేయాలని ప్రతి గింజను కొనాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమం సర్పంచ్ లు నాగుల ప్రశాంత్ గౌడ్, నరేందర్, వెంకటయ్య, నాయకులు నర్సయ్య,సంపత్ తదితరులు ఉన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం





**అక్షర కలం సిద్దిపేట ఏప్రిల్ 24:**

సిద్దిపేట నియోజకవర్గం పరిధిలోని బూరుగుపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో నూతనంగా నిర్మించిన ప్రవారి గోడను, గేట్ ను సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పూజల హరికృష్ణ ఈ రోజు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు నెలల కాలంలోనే ప్రవారి గోడకు శంకుస్థాపన చేసి పనులను పూర్తి చేసి ప్రారంభించుకోవడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. భవిష్యత్ లో పాఠశాల విద్యార్థులు ఆడు కోవడానికి ఇక్కడ ఉన్న గ్రౌండ్ ను చదును చేపించి విద్యార్థులు ఆడు కోవడానికి సౌకర్యాలు కల్పించేవిదంగా కృషి చేస్తానని తెలిపారు. ప్రతి విద్యార్థి, విద్యార్థినిని ప్రభుత్వ పాఠశాలలో చదువుపించడానికి తల్లిదండ్రులు సహకరించాలని ప్రైవేట్ పాఠశాలల కంటే దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యను అందిస్తున్నారని తెలిపారు.తదనంతరం పాఠశాల విద్యార్థులతో కలిసి పూజల హరికృష్ణ భోజనం చేశారు.ఈ కార్యక్రమంలో బూరుగుపల్లి గ్రామ సర్పంచ్ పద్మ బాలయ్య గారు, వార్డు సభ్యులు జొంగోని రేణుక, లిఖిత్ సాయి గ్రామ కమిటీ అధ్యక్షులు యాదగిరి మరియు కనకయ్య నాయకులు దాస్ అంజయ్య తో పాఠశాల ప్రధానోపాధయురాలు స్వప్న, ఉపాధ్యాయులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీరాజ్ చట్టంపై అవగాహన కల్పించిన సర్పంచ్ చాందావత్ రమేష్ బాబు.

**అక్షర కలం / ఇల్లెందు.**



జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవని పురస్కరించుకొని విజయలక్ష్మి నగర్ గ్రామపంచాయతీ సర్పంచ్ చాందావత్ రమేష్ బాబు ఆధ్వర్యంలో గ్రామసభ శు క్రవారం నిర్వహించడం జరిగింది . ఈ సందర్భంగా పంచాయతీరాజ్ చట్టం యొక్క ప్రాముఖ్యతను చర్చించుకోవడం జరిగింది. గ్రామ ప్రజలకు సర్పంచ్ చందవత్ రమేష్ బాబు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ ,ఉప సర్పంచ్ వార్డు సభ్యులు అంగన్వాడీ టీచర్స్,ఆశా కార్యకర్తలు, గ్రామపంచాయతీ ప్రజలు, పంచాయతీ సిబ్బంది పాల్గొనడం జరిగింది.

# నిరుపేదకు సొంతింటి కల నెరవేర్చడమే ప్రధాన లక్ష్యం....

## - ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని తెచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.....

## - మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్....

**మెదక్/ కొల్చారం ఏప్రిల్ 24(అక్షర కలం):-**





నిరుపేదల సొంత ఇంటి కళను నెరవేర్చడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని తీసుకొచ్చిందని మెదక్ కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. మెదక్ మండలం శివాయపల్లి గ్రామంలో శుక్రవారం పండుగ వాతావరణంలో లబ్ధిదారుల ఇండ్ల గృహ ప్రవేశ కార్యక్రమంలో కలెక్టర్. పాల్గొన్నారుఇందిరమ్మ గృహాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల సంక్షేమ వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా జిల్లాలో పెద్ద ఎత్తున ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలు జరుగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా శివాయపల్లి గ్రామంలో ఇందిరమ్మ గృహ లబ్ధిదారులు తోట లక్ష్మి గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొనడం జరిగిందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పక్కాగాపారదర్శకంగాజరుగుతుందన్నారు. సొంత స్థలం ఉండి ఇల్లు లేని వారికి మొదటి ప్రాధాన్యతగా గుర్తించి వారికి ఇల్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు.ఇందిరమ్మల నిర్మాణం కోసం ప్రభుత్వంవిడుదలవారీగా నిధులు విడుదల చేస్తున్నారు. ఒక్కో గృహ నిర్మాణానికి ఐదు లక్షలు అందించడం జరుగుతుందన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలనిసూచించారు. జిల్లాలో ఇప్పటి వరకు 750 ఇందిరమ్మ ఇండ్లు పూర్తయ్యాయని, మిగిలిన వారు కూడా త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. జిల్లాలో ఇప్పటివరకు 650 ఇండ్లు గృహప్రవేశాలు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్డీవో రమాదేవి, తాసిల్దార్ లక్ష్మణ్ బాబు, హౌసింగ్ పీడీ మాణిక్యం, శివాయపల్లి సర్పంచ్, అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# పసుపులలో జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం:

- చలివెంద్రం ప్రారంభం, పరిశుభ్రత-నీరు సందేశం ;
- గ్రామ సర్పంచ్ నర్మదా రవికుమార్ గౌడ్ ;



**(అక్షర కలం, నారాయణపేట జిల్లా రిపోర్టర్, ఏప్రిల్,24)**

పసుపుల; ప్రజాస్వామ్యానికి ప్రతీకగా నిలిచే జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా పసుపుల గ్రామపంచాయతీలో శుక్రవారం ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ ఒక్కసారి గ్రామ సర్పంచ్ నర్మదా రవికుమార్ గౌడ్ చలివెంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమం గ్రామ ప్రజలకు వేసవి ఆయాసాల నుంచి ఉపశమనం అందించనుంది.గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ నర్మదా రవికుమార్ గౌడ్ మాట్లాడుతూ, "ప్రతి ఇంటి చుట్టూ పరిశుభ్రత పాటిస్తే గ్రామం మొత్తం ఆరోగ్యకరంగా మారుతుంది. నీటిని వృథా చేయకుండా, ఆదా చేసుకుంటే భవిష్యత్ తరాలకు ప్రయోజనం చేకూరుతుంది" అని ప్రజలకు స్పష్ట సూచనలు చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ ప్రాజెక్టులు, స్వచ్ఛ భారత్ అభియాన్ గురించి కూడా చర్చించారు.కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ మహేష్ కుమార్ ప్రసంగించారు. వార్డు మెంబర్లు, గ్రామ సెక్రటరీ శేఖర్, మహిళా స్వయం సహాయక బృందాల సభ్యులు, యువకులు, గ్రామ ప్రజలు , పెద్దలు పాల్గొన్నవారు, నీటి పంపిణీతో కార్యక్రమం సమాప్తి చెందింది.ఈ కార్యక్రమం గ్రామంలో పంచాయతీరాజ్ వ్యవస్థపై అవగాహన పెంచి, స్థానిక సమస్యల పరిష్కారానికి కొత్త ఉత్సాహాన్ని నింపిందని పాల్గొన్నవారు అభిప్రాయపడ్డారు

# రైతులు పండించిన ప్రతి గింజను కొంటాం

వడ్ల కొనుగోలు కేంద్రం ప్రారంభించిన
సిద్దిపేట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ శ్రీ పూజల హరికృష్ణ

**అక్షర కలం సిద్దిపేట ఏప్రిల్ 24:**

సిద్దిపేట రూరల్ మండలం వెంకటాపూర్ గ్రామంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని కొబ్బరికాయ కొట్టి ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతి ప్రభుత్వం అని పేర్కొన్నారు. రైతులు పండించిన ప్రతి గింజను రాష్ట్ర ప్రభుత్వం



కొనుగోలు చేస్తుందని హామీ ఇచ్చారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని తెలిపారు.అలాగే ఐకేపీ కేంద్రాల్లో రైతులకు అవసరమైన నీడ, తాగునీరు వంటి సౌకర్యాలు కల్పించాలని సూచించారు. తేమ శాతం రాగానే ధాన్యాన్ని వెంటనే పారదర్శకంగా కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు. కేంద్రాల్లో గన్ని బ్యాగులు, తేమ కొలిచే పరికరాలు, తూకం కాంటాలు, వర్షాల వల్ల ధాన్యం తడవకుండా తార్పాలిన్ షీట్స్ సిద్ధంగా ఉంచాలని కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దేవి, ఉప సర్పంచ్ సుమన్, వార్డ్ సభ్యులు గజ్జల స్వామి, ఎర్ర కృష్ణ, సత్తవ్వ, చామంతి, ఎర్ర ప్రభాకర్, నాగరాజు, బండ చంద్రకళ, గ్రామ శాఖ అధ్యక్షులు దుబ్బ దుర్గయ్య, ఎండీ రాజ్ మహమ్మద్, పోతుగంటి శ్రీకాంత్, ఏఈఓ రాజు గారితో పాటు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మహేందర్ రెడ్డి, సిద్దిపేట రూరల్ మండల అధ్యక్షులు అంజిరెడ్డి, గుర్రం అంజిరెడ్డి, దాస్ అంజన్న, డీసీసీ సభ్యులు ముద్దం లక్ష్మి, ఎల్ల శ్రీనివాస్ రెడ్డి, పంతం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# యువత మారుతున్న కాలాన్ని అనుగుణంగా.....

# - అన్ని రంగాల్లో నైపుణ్యాన్ని మెరుగు పరుచుకోవాలి.....

## - మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్....

**మెదక్/ కొల్చారం ఏప్రిల్ 24(అక్షర కలం):-**




యువతకు మారుతున్న కాలానికి అనుగుణంగా తాము ఎంచుకున్న రంగాలలో నైపుణ్యాలను మెరుగుపరచుకోవడం ద్వారా ఉద్యోగ అవకాశాలు సాధ్యపడతాయని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పేర్కొన్నారు.99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో సంక్షేమ వారంలో భాగంగా శుక్రవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయ ప్రజావాణి హాల్ నందు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో వివిధ కళాశాలల నుంచి ఇంటర్మీడియట్ ,డిగ్రీ పూర్తి చేసుకున్న యువతకు (స్కిల్ డెవలప్మెంట్ ) స్వయం ఉపాధి పథకాల అమలుపై ఎస్సీ సంక్షేమ అధికారి డి ఆర్ డి ఓ పి డి శ్రీనివాసరావు, గిరిజన సంక్షేమ అధికారి నీలిమ, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ప్రకాష్ రావు, తో కలిసి యువతకు శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ ఎస్సీ , ఎస్టి , బీసీ , మైనారిటీ యువతకు సాంకేతిక మరియు వ్యవస్థాపక నైపుణ్యాలలో (టెక్నికల్ ఇంట్రెప్రెనేరియల్ స్కిల్స్ ) ఉచిత శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వచ్చేసిందని మారుతున్న కాలానికి అనుగుణంగా పోటీ ప్రపంచానికి దీటుగా నిలబడాలంటే కంప్యూటర్ కోర్సులలో ప్రతిభావంతులై ఉండాలన్నారు. ఈ శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని యువత లబ్ధి పొందాలన్నారు.అంతకుముందు ఐటీసీ సంస్థ నుండి ప్లాంట్ మేనేజర్ ఆనంద్, టెక్నీషియన్ శివయ్య నైపుణ్యత శిక్షణ ద్వారా ఉద్యోగాలు పొందే విధానంపై సమగ్రంగా వివరించారు. ఐ.టీ.సీ సంస్థలో 50 ఉద్యోగాలు కలవని వివరించడం జరిగింది. సంబంధిత యువత నుండి ఉద్యోగ అర్హత పత్రాలు స్వీకరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ సంక్షేమ శాఖ అధికారులు, యువత పాల్గొన్నారు.



Printed, Published and Owned by Pittala Ramakrishna, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana) Printed at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada,Nalgonda - 508 001. (Telangana) Published at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana)Editor: PITTALA RAMAKRISHNA, Cell: 9396218955